# శరశ్చంద్రికలు

## పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగభాషణలు

(ఆంగ్ల సత్సంగ భాగాలకు ఆంధ్రానువాదం)



## రెండవ భాగం

2012వ సంవత్సరంలో వెలువడిన
ఈ-మెయిల్ సంచికల సంకలనం

# *Sarathchandrikalu (Telugu)*

# శరశ్చంద్రికలు


ప్రచురణ: సాయిపథం పబ్లికేషన్స్
సాయిపథం, శిరిడీ – 423109

*Saipatham Publications*
*Saipatham, Shirdi - 423109*
*publications@saimail.com*



*Copyright © 2012* *Saibaba Foundation*



*ISBN:* 978-81-88560-13-4

ప్రథమ ముద్రణ: గురుపూర్ణిమ, 2013
*Guru Purnima, 2013*

ప్రొసెసింగ్: సాయిముద్ర, శిరిడీ
*Sai Mudra, Shirdi*

ముద్రణ: సాయిబాండ్స్ ప్రింట్ సిస్టమ్స్
చెన్నై – 106

*Saibonds Print Systems*
*Chennai - 106*

*Website:* *www.saibaba.com*
*http://saipatham.saibaba.com/sarathchandrikalu*
*http://downloads.saibaba.com*

సాయిపథం పబ్లికేషన్స్
శిరిడీ | చెన్నై | హైదరాబాద్

మా సద్గురుదేవులు
శ్రీసాయినాథుని శరత్‌బాబూజీని మాకు అనుగ్రహించిన
శ్రీసాయిబాబా చరణారవిందములకు,
శ్రీసాయిబాబాని చూపి, సాయి నిజతత్త్వాన్ని దర్శింపజేసిన
పూజ్యగురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ పాదపద్మములకు
భక్తిపూర్వక సమర్పణ





తన స్వరూపమేయైన యీ జగత్తుకు ఆనందాన్నిస్తూ, ఆ
ఆనందాన్నే గుర్తిస్తూ, తరుగులేని ఆనందమే తానని తెలియజేస్తూ
ఉన్న ఆనందస్వరూపం... శ్రీసాయిబాబా!

- **శ్రీబాబూజీ**



## ప్రకాశకుల ముందుమాట

దేశవిదేశాలలోని ఎందరో భక్తులకు మార్గదర్శిగా, సద్గురుమూర్తిగా వెలుగొందుతున్న పూజ్య గురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ అక్టోబర్ 7, 1954 విజయదశమి పర్వదినాన చెన్నైలో జన్మించారు. అజరామరమైన సాయిమహిమకు మహితదీప్తి ఆయన. సాయి చరిత్ర పరిశోధనలతో, సాయితత్త్వ రచనలతో సాయిభక్తి సంప్రదాయాన్ని సుసంపన్నం చేసిన జీవనయానం వారిది. ఆధ్యాత్మికత అనేది మానవ అస్తిత్వంతో ముడిపడిన విషయమని, మనిషి జీవితంలోని అసంపూర్ణతలను, కొరతలను, ఖాళీలను పూరించే సాధనం ఆధ్యాత్మికత కావాలని, ఆ ఆధ్యాత్మిక సౌధానికి మూలం 'సద్గురువు' అని చాటిచెప్పారు శ్రీబాబూజీ. ఆధునిక ఆధ్యాత్మిక యోచనకు క్రొత్త భావజాలమందించి, ప్రాపంచిక ఆధ్యాత్మిక జీవితాల మధ్య గీతలను చెరిపేసే సాయిభక్తి సంప్రదాయాన్ని **'సాయిపథం'**గా లోకానికి అందించారు శ్రీబాబూజీ.

శ్రీబాబూజీ సత్సంగాలు సుజ్ఞాన వీచికలు. ప్రాచీన బౌద్ధం నుండి నేటి భౌతికశాస్త్ర సిద్ధాంతాల వరకు, మంత్రశాస్త్రం నుండి మనస్తత్వ శాస్త్రం వరకు, పురాణేతిహాసాల నుండి ఆధునిక కంప్యూటర్ టెక్నాలజీ

వరకు వివిధ అంశాలు శ్రీబాబూజీ సమాధానాలలో సాదృశ్యాలుగా మారేవి. మనఃప్రవృత్తుల గుట్టుమట్లను, భావోద్వేగాల లోతుపాతుల్ని ఆంగ్లంలోనైనా, తెలుగులోనైనా సరళంగా పూసగ్రుచ్చినట్టు చెప్పే వారి విశ్లేషణశైలి, అత్యంత ఆసక్తికరంగా ఉండేది.

శ్రీబాబూజీ సత్సంగసాన్నిధ్యంలోని భక్తుల యొక్క అనుభవాలను, సత్సంగ వాతావరణాన్ని తరువాత పేజీలలోని పరిచయవ్యాసంలో వివరించడం జరిగింది. శ్రీబాబూజీ జీవిత సంగ్రహాన్ని సంక్షిప్తంగా "*శరశ్చంద్రికలు - మొదటిభాగం*"లో చూడవచ్చు.

అపూర్వమైన దివ్యసన్నిధి, అవధి లేని ప్రేమ, అద్వితీయమైన సత్సంగప్రబోధాలతో ఎన్నో జీవితాలను ప్రభావితం చేసి, తీర్చిదిద్దిన పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ నవంబర్ 13, 2010న మహాసమాధి చెందారు. శ్రీసాయిని అనన్యంగా ప్రేమించి, ఎన్నో జీవితాలకు సాయిప్రేమతో ఊపిరులూదిన ఆ రూపం అనంతమైన ఆ ప్రేమ స్వరూపంలో ఐక్యమయ్యింది. వారు భౌతికంగా లేని లోటు భక్తులకు అశనిపాతమే అయ్యింది.

"శ్రీబాబూజీ ప్రథమ ఆరాధన" సందర్భంగా (డిసెంబర్ 31, 2010 నుండి జనవరి 1, 2011 వరకు) శ్రీబాబూజీ వాక్సుధను అందరితో పంచుకోవాలన్న ఆలోచనతో ఆంగ్ల, తెలుగు సత్సంగాలలో ఉన్న ఒకే అంశానికి సంబంధించిన విషయాలను క్రోడీకరించి వివిధ శీర్షికల క్రింద ప్రతి మాసం మొదటితేదీన ఇంగ్లీషులో "రోజ్ పెటల్స్" పేరున, తెలుగు అనువాదాన్ని "*శరశ్చంద్రికలు*" పేరున ఈ-మెయిల్ సంచికగా అందించడానికి అంకురార్పణ జరిగింది.

2011వ సంవత్సరంలో వెలువడిన 12 సంచికల సంపుటి "*శరశ్చంద్రికలు – మొదటి భాగం*"ను గత సంవత్సరం గురుపూర్ణిమ

సందర్భంగా ఆవిష్కరించడం జరిగింది. 2012వ సంవత్సరంలో వెలువడిన సంచికల సంపుటి *"శరశ్చంద్రికలు – రెండవ భాగం"*ను ఈ గురుపూర్ణిమ (జూలై 22, 2013) సందర్భంగా అందించడం జరుగుతోంది.

ఈ *"శరశ్చంద్రికలు – రెండవ భాగం"*లోని 12 సంచికల్లో వున్న అన్ని సత్సంగభాగాలు ఆంగ్లసత్సంగాలకు అనువాదాలేనని పాఠకులు గ్రహించాలని మనవి. (12 అధ్యాయాలలో ఉన్న 'సత్సంగాలలోని భాగాలు' ఏఏ సత్సంగాల నుండి గ్రహింపబడినవో ఆ వివరాలు ఈ గ్రంథం చివర 'అనుబంధం'లో పేర్కొనబడినవి.)

## కృతజ్ఞతాభినందనలు

*'శరశ్చంద్రికలు'* ఆలోచనకు అంకురార్పణ నుండి ప్రతి సంచికను యథాతథంగా సరళమైన తెలుగుభాషలోనికి అనువదించడంలో, సకాలంలో సంచిక విడుదలకు ఎంతో స్ఫూర్తిదాయకమైన సహకారాన్ని అందిస్తున్న పూజ్యశ్రీ బాబూజీ సతీమణి శ్రీమతి సాయినాథుని అనసూయమ్మగారికి కృతజ్ఞతాభివందనాలు.

*'శరశ్చంద్రికలు'* మాతృకైన *'రోజ్ పెటల్స్'*ను రూపొందించడంలో అవిరళకృషి చేసిన పాశ్చాత్య భక్తులు శ్రీయుతులు అరుణ అల్మెలా, బాబ్ బార్నెట్, శాంతి బేరన్, భక్తి బోన్నర్, క్రిస్ బర్జెస్, రామ్ బ్రౌన్ క్రొవెల్, మార్గరెట్ బుర్రి, కరిన్ డర్కోట్, పామ్ డోనాల్డ్‌సన్, కార్లోస్ గిల్ సొబెరా, కషల్య మిలాన్, నాడ్జా నేతన్, లోలా నవర్ర, ఎలిస్ శాడ్లర్, ఆంకి స్టెర్నాండర్, లరిసా వెబ్బ్, పీటర్ వెస్టో మరియు ఆలిసన్ విలియమ్స్‌లకు కృతజ్ఞతాభినందనలు. ఈ బృందాన్ని ముందుండి నడిపిస్తున్న శ్రీమతి ఇవాన్ వయర్‌గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఆంగ్ల సత్సంగాలను అత్యంత శ్రద్ధతో, అంకితభావంతో సులభ శైలిలో అనువదించిన కె. భీమేశ్వర్, శ్రీమతి పి. శైలజ ద్వారకనాథ్, మేజర్ ఎస్. సురేష్‌బాబుగార్లకు, చక్కగా ఎడిట్ చేసిన పోలా శ్రీనివాస్, శ్రీమతి బి. శిరీష, సాయినాథుని శృతి, శ్రీమతి ఎస్. రమాలక్ష్మి, కె. ఉపేంద్ర, సిహెచ్. రమణగార్లకు కృతజ్ఞతాభినందనలు.

ఈ గ్రంథ నేపథ్యాన్ని ప్రతిబింబిస్తూ, ఆకర్షణీయంగా కవర్ పేజీని రూపొందించిన అరుణ అల్మెలాగారికి, శ్రీబాబూజీ ఫోటోలను చక్కగా తీర్చిదిద్దిన శ్రీఎమ్. పద్మాకరన్‌గారికి, గ్రంథాన్ని సకాలంలో అందంగా అచ్చువేసి అందించిన సాయిబాండ్స్ ప్రింట్ సిస్టమ్స్, చెన్నై మేనేజింగ్ డైరెక్టర్ శ్రీఎల్.వి.ఎస్. వాసుదేవరావుగారికి, ప్రతి మాసం సంచిక వెబ్ పేజీని ప్రచురించడంలో సహకరించిన శ్రీశాఖమూరి రామకృష్ణగారికి కృతజ్ఞతాభినందనలు.

సత్సంగభాగాలతోపాటు శ్రీబాబూజీ ఛాయాచిత్రసహితంగా రూపొందించిన ఈ సంపుటి ఆ మహితాత్ముని దివ్యసన్నిధిని మనకు ప్రసాదిస్తుంది. సత్యాన్వేషకులు, సాధకులు, జిజ్ఞాసువులకే కాక అందరికీ జీవనగమనంలో ఈ 'శరశ్చంద్రికలు' సరియైన మార్గాన్ని చూపిస్తాయి. శ్రీబాబూజీ సత్సంగ సౌరభాలు సర్వత్రా వ్యాపించాలని, సద్గురు చంద్రుని జ్ఞానవెన్నెల పరచుకున్న హృదయాలు జ్ఞానానంద పరవశం కావాలని ఆకాంక్షిస్తూ, ఈ అమూల్య గ్రంథ కుసుమాన్ని సద్గురు చరణారవిందములకు ప్రేమపూర్వకంగా సమర్పిస్తున్నాము.

- **సాయిసీకర్స్**

# విషయసూచిక


ముందుమాట vii

పూజ్యశ్రీ బాబూజీ సత్సంగాలలో వెల్లివిరిసే
సాన్నిధ్యపు పరిమళాల ఆనంద చంద్రికలు xiii

*1.* ఆరతి 1

*2.* రసానుభూతి 15

*3.* నీ లక్ష్యాన్ని నీవే తెలుసుకో 27

*4.* సద్గురు ప్రేమకక్ష్యలో 37

*5.* నియమం 51

*6.* కోపాన్ని జయించడం ఎలా? 65

*7.* ప్రేమ తత్త్వం 77

*8.* లక్ష్యసిద్ధిని లభింపజేసే ముచ్చటైన మూడు సూత్రాలు 93

*9.* పూర్ణ అవధూతకు నిదర్శనం శ్రీపూండీస్వామి 107

*10.* పవిత్ర క్షేత్రాలు 121

*11.* ఆనందపారవశ్యం - వ్యక్తీకరణ 135

*12.* ఎరుక మరపుల హేల 149

అనుబంధం 159



## పరిచయం

# పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగాలలో వెల్లివిరిసే సాన్నిధ్యపు పరిమళాల ఆనంద చంద్రికలు

*"సత్సంగానికి పునాది ప్రేమ, అది అందుకు ఇందుకు అని కాదు. ఒకరిని (సద్గురువును) చూసినపుడు ఎందుకో మనసులో తెలియని ప్రేమ, ఆయన దగ్గర కూర్చున్నా ఆయన గురించి ఆలోచించినా మనస్సులో తెలియని ఆనందం కలుగుతుంది. అదేమిటో తెలియదు, ఎందుకు వస్తోందో తెలియదు. ఏదో తెలియని భద్రత, "నా జీవితాన్ని ఆయన చూసుకుంటాడు" అనే భద్రత. ఎందుకు చూసుకుంటాడో తెలియదు, మనలో ఏం అర్హతలున్నాయని చూసుకుంటాడో తెలియదు. దీని ద్వారా ప్రేమ కలుగుతుంది. ఆయన గురించి వినాలి, ఆయనను చూడాలి, ఆయనకు ఇష్టమైన రకంగా ఉండాలి అనే తపన బయల్దేరుతుంది. ఆ తపనకు ప్రతిరూపంగానే మనం సత్సంగానికి వెళతాం."* - ***శ్రీబాబూజీ***

సత్సంగం అనే సంస్కృత పదానికి 'సత్ పదార్థంతో సాంగత్యంలో ఉండటమ'ని శబ్దార్థం. ఈ అర్థంలో చూస్తే 'సత్సంగం' యొక్క పరిధి

విస్తృతంగా ఉంటుంది. సద్గురు సాంగత్యం, సద్గ్రంథ పఠనం, సత్పురుషుల చరిత్ర పారాయణ, సత్ప్రబోధాల అధ్యయనం, మనన శ్రవణాదులు, భజనలు, సంకీర్తనలు, స్వాధ్యాయ ప్రవచనాలు, సత్యాన్ని గురించిన చర్చ, గురువు ముఖతా సంశయనివృత్తి మొదలైన వాటినన్నింటినీ సత్సంగం యొక్క రూపాలనే చెప్పవచ్చు. ఇలా సత్సంగానికి ఎన్ని రూపాలున్నప్పటికీ, సత్స్వరూపులైన సద్గురు సాన్నిధ్యంలో శిష్యునికి ఆనందానుభూతిని సంప్రాప్తింపజేసేదే నిజమైన సత్సంగమని ఉపనిషత్ ప్రోక్త రూపాన్నే సదా ప్రామాణికంగా భావించడం జరుగుతుంది.

సత్సంగం ఎందుకు?... అనేది తరువాత ఉదయించే ప్రశ్న. సాంప్రదాయానుసారం, సత్సంగం – జీవనసాఫల్యానికి ఉపయుక్తమైన జ్ఞానాన్ని ప్రబోధించడం, అంతరంగంలో పరివర్తన కలిగించడం అనే రెండు విధులనూ నిర్వర్తించాలి. సద్గురు ప్రబోధం వాచా బాహ్యంగా జరిగితే, మహిమాన్వితమైన వారి పవిత్ర సన్నిధి హృదయంలో పరివర్తన కలిగిస్తుంది. సుజ్ఞాన శోభితమైన సద్గురు ప్రబోధాలు సాధకునిలో సాధనాస్ఫూర్తిని రగిలిస్తే, వారి సన్నిధి (ప్రత్యక్ష సన్నిధైనా లేక పరోక్ష దివ్యసన్నిధైనా) అంతరంగాన్ని క్షాళన చేసి శాంతిని, సంతృప్తిని అందిస్తుంది. ఇలా సద్గురు సన్నిధిని అందిస్తూ, ఆ సాన్నిధ్య నేపథ్యంగా ప్రబోధామృతాన్ని పంచేదే నిజమైన సత్సంగం.

సత్సంగానికి నేడు వాడుకలో ఉన్న వ్యావహారికమైన అర్థం సత్సంగాన్ని కేవలం ప్రబోధాలు, ప్రవచనాలకు మాత్రమే పరిమితం చేస్తోంది, ఇందులో సత్సంగానికి మూలాధారమైన సద్గురు సాన్నిధ్యాన్ని గురించిన ప్రస్తావన ఉండదు. సదాసత్స్వరూపులైన సద్గురుమూర్తుల సన్నిధి లభ్యం కావడం అరుదు గనుక చాలావరకు సత్సంగాలు

కేవలం వారి ప్రబోధాల పఠనానికి, ప్రవచనాలకు మాత్రమే పరిమితం కావడం జరుగుతుంది. సద్గురు ప్రబోధాలకు నేపథ్యమైన వారి సన్నిధి గొప్పతనాన్ని, భక్తుల హృదయాలలో ఆ సాన్నిధ్యం నింపే శాంతిని, సంతృప్తిని మాటల్లో వర్ణించడం, పదాలలో పొందుపరచడం సాధ్యపడదు కాబట్టి గ్రంథకర్తలు, ప్రసంగకర్తలు ప్రబోధాలను 'విడమరచి' చెప్పినంతగా సాన్నిధ్యపు మహాత్మ్యాన్ని తెలియజేయలేరు. సర్వాత్మకమైన సద్గురుసన్నిధిని గురించిన ప్రస్తావన లేకపోతే – అన్ని పరిమితులకూ అతీతమైన సత్స్వరూపానుభూతిని మానవాళికి అనుభవైకవేద్యం చేస్తూ, మనిషి మనుగడకు ఆలంబన కావాల్సిన సత్సంగాలను కేవలం సిద్ధాంత ప్రబోధాలకు, తాత్త్విక ప్రవచనాలకు పరిమితం చేసినట్లవుతుంది.

శ్రీమతి తర్ఖడ్ 1911వ సంవత్సరంలో శ్రీసాయిబాబాను ప్రప్రథమంగా దర్శించినప్పుడు, సాయినాథుని దివ్యసన్నిధిలో ఆమెకు అనుభవమైన అపూర్వ శాంతి ఆనందాలు, భద్రతాభావం గురించిన ఆమె స్మృతులు – మాటల ప్రమేయం లేని మహత్తర సత్సంగానికి ఒక అద్భుతమైన ఉదాహరణ.

"ప్రథమంగా బాబాను దర్శించినపుడు ఎవరినైనా అమితంగా ఆకర్షించేది వారి కళ్ళు. వారి శక్తివంతమైన చూపు మన అణువణువులోనికి చొచ్చుకొని వెళ్ళి పరిశీలిస్తున్నట్లుండేది. ఎవ్వరూ బాబా కళ్ళలోనికి ఎక్కువసేపు చూడలేకపోయేవారు. వారి నిశిత దృష్టిని తట్టుకోలేక తలవంచి నమస్కరించేవారు. బాబాను దర్శించిన వారెవరైనా – బాబా అంతర్యామి అని, మన హృదయంలోనేగాక శరీరంలో ప్రతి అణువణువులోనూ వారు ఉన్నారన్న అనుభూతిని పొందుతారు. బాబా మాట్లాడే కొద్ది మాటలు, సంజ్ఞలను బట్టి

భూతభవిష్యద్వర్తమానాలు తెలిసిన సర్వజ్ఞులని భక్తులు తెలుసుకొంటారు. బాబాను ఒకసారి దర్శించిన తరువాత వారికి సర్వస్య శరణాగతి చెందడం కన్నా చేయవలసినది మరేదీ ఉండదు".

శ్రీమతి తర్ఖడ్ యొక్క ఈ అనుభవం సత్సంగంలో సద్గురుసన్నిధి ప్రభావాన్ని ప్రస్ఫుటంగా తెలియజేస్తుంది. అక్కడ శ్రీసాయి వాచా చేసిన ప్రబోధమంటూ ఏమీ లేదు, ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కానీ ఆ ప్రభావం నిరుపమానం. మహిమాన్వితమైన సాయినాథుని సన్నిధిలో మాటల అవసరమే లేకపోయింది. ఆయన సన్నిధే మనోవాక్కులకు అతీతమైన సత్యాన్ని దర్శింపజేస్తుంది. శ్రీసాయి సన్నిధిని చేరిన ఎంతోమంది అనుభవం ఇటువంటిదే అనడానికి శ్రీఖాపర్డే, శ్రీమతి తర్ఖడ్ వంటి భక్తుల అనుభవాలే నిదర్శనం.

ఆధ్యాత్మిక శాస్త్రాలలో చెప్పినట్టు ప్రపంచంలో ప్రతి జీవి సచ్చిదానంద స్వరూపమే కావచ్చు, కానీ ఆ నిజస్థితి సద్గురురూపంలో మాత్రమే పరిపూర్ణంగా వ్యక్తమవుతుంది. దీపంతోపాటు వేడి వెలుతురు ఎట్లా అయితే కలిసే ఉంటాయో, సద్గురు సాన్నిధ్యంలో ప్రేమ, కరుణ, జ్ఞానం, శాంతి, అనుగ్రహం సమన్వితమై ఉంటాయి. సద్గురు ప్రత్యక్ష (భౌతిక) సాన్నిధ్యంలోనే కాక వారు భౌతికదేహాన్ని విడిచిపెట్టిన తరువాత కూడా వారి సమాధిస్థానాలు భక్తులకు ఆ ప్రత్యక్ష సాన్నిధ్యానుభూతిని అందిస్తే, ఆ సద్గురుమూర్తుల జీవిత చరిత్రలు – వారి బోధనలను, దివ్యసన్నిధిని ప్రసాదిస్తాయి. ఓ మహాత్ముని మహాసమాధి ఆయన అవతారకార్యం మరింత విస్తృతం కావడానికి, వారి మహిమ ప్రవర్ధమానమవడానికి సూచిక. ఈ కారణం చేతనే బుద్ధుడు, జీసస్, మహమ్మద్, సాయిబాబా వంటి మహాత్ములు మహాసమాధి అనంతరం కూడా తరతరాలుగా ప్రజల

జీవితాలపై ప్రభావం చూపగలుగుతున్నారు. దేశకాలాలకు అతీతులైన ఈ సద్గురుమూర్తుల దివ్యప్రేమ ఎందరో భక్తులను పరిపూర్ణులను చేస్తోంది.

సర్వత్రా సర్వజీవులలోనూ ప్రకాశించే చైతన్యస్వరూపులైన శ్రీసాయి వంటి సద్గురుమూర్తుల దివ్యసన్నిధికి దేశకాల పరిమితులు ఉండవు. *"సాయి అంటే ఈ మూడున్నర మూరల దేహం మాత్రమేనని, బాబా శిరిడీలోనే ఉన్నాడని ఎవరైనా అనుకుంటే వారు నన్నసలు చూడనట్లే"* అని బాబానే అన్నారు. శ్రీసాయిని మహాసమాధి అనంతరం ఆశ్రయించి పరిపూర్ణత్వాన్ని పొందిన శ్రీబి.వి.నరసింహస్వామి, శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ వంటి ప్రముఖ సాయిభక్తుల అనుభవాలే సర్వవ్యాపకమైన సద్గురుసన్నిధి మహాత్మ్యానికి నిదర్శనం.

సద్గురుమూర్తుల సన్నిధికి ప్రత్యక్షమూ, పరోక్షమూ అనే పరిమితులు లేకపోయినప్పటికీ, వారి ప్రత్యక్ష సన్నిధిలో గడిపి, వారి సాంగత్యాన్ని పొందిన భక్తుల మహద్భాగ్యాన్ని మాటలలో వర్ణించడం సాధ్యంకాదు. శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ వంటి అరుదైన సద్గురుమూర్తుల విషయంలో ఇది అక్షరసత్యం. సమకాలీన ఆధ్యాత్మిక తత్వచింతనలో శ్రీబాబూజీ ఒక నూతన ఒరవడి. ఉపన్యాసాల వలన, మాటల వలన మనుషులలో మార్పురాదు అని నిష్కర్షగా చెప్పినా, దక్షిణలు విరాళాలను ఆశించడాన్ని, అంగీకరించడాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరించినా, సాయి సంప్రదాయంలో ప్రవేశించిన వ్యర్థ ఆచారాలను తూర్పారబట్టినా, భగవంతుడున్నాడో లేదో నాకు తెలియదు, సాయిబాబానే నాకు భగవంతుడు అని కుండబ్రద్దలు కొట్టినట్టు చెప్పినా అది ఆయనకే సాధ్యమయింది.

"తామెవరికీ గురువును కాద"ని శ్రీబాబూజీ స్పష్టం చేసినప్పటికీ, దేశవిదేశాలలోని ఎందరో భక్తులు ఆయనలో తమ సద్గురుమూర్తిని దర్శించి, సద్గురువుగా భావించి ఆత్మీయంగా "గురువుగారూ" అనీ, "గురూజీ" అనీ సంబోధించేవారు. విభిన్న సాంప్రదాయాలనుండి, విభిన్న సంస్కృతుల నుండి వచ్చిన ఎందరో భక్తులు ముఖ్యంగా పాశ్చాత్యులు, శ్రీబాబూజీ సమక్షంలో తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆశించేవారు. జీవితంలో సునిశితమైన పరిశీలనను, ప్రశ్నించే తత్వాన్ని, అన్వేషణాస్ఫూర్తిని ఎంతగానో ప్రోత్సహించే శ్రీబాబూజీ వారి ప్రశ్నలకు ఎంతో ఓర్పుతో సమాధానాలిచ్చేవారు. నదిలో వర్షించిన ప్రతి చినుకు చివరికి కడలిని చేరుకున్నట్లు, భక్తుల అంతరంగంలోని ప్రశ్న ఏదైనా, సమస్య ఏదైనా శ్రీబాబూజీ ఇచ్చే వివరణలు ఆ ప్రశ్నలను సాయితత్వసాగరానికి చేర్చి సమాధానపరచేవి.

ఆయన సత్సంగాలలోని విషయ పరిచయానికి ముందు, తమ సత్సంగాల పట్ల శ్రీబాబూజీ వైఖరి గురించి, సత్సంగాల నేపథ్యం గురించి తెలియజేయడం అవసరం. తమ సత్సంగాల పట్ల తమ దృక్పథాన్ని వారు ఇలా తెలియజేశారు:

*"సత్సంగాలలో నేను చెప్పే విషయాలు వాటంతట అవే మిమ్మల్ని ముక్తుల్ని చేస్తాయనిగానీ లేదా మీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాయనిగానీ నేను భావించడం లేదు. మనం మాట్లాడుకునే విషయాలు అంత ముఖ్యమైనవని కూడా నేను అనుకోవడం లేదు, ఎందుకంటే నాకు ఉపన్యాసాల మీద, ప్రవచనాల మీద నమ్మకం లేదు. నిజంగా అవి అంత ఉపయుక్తమైనవే అయివుంటే ప్రపంచం నలుచెరుగులా తిరిగి బాబానే బోధించి ఉండేవారు, ఉపన్యాసాలు ఇచ్చుండేవారు.*

*ఆయనే చెయ్యని దానిని నేనెందుకు చెయ్యాలి? బాబా, ఆయన చేసేటటువంటి సంస్కరణకార్యాన్ని వాచా బోధించడం ద్వారా చెయ్యరు. ఆయన పద్ధతి వేరుగా ఉంటుంది: ఆయన ప్రత్యక్షమైన అనుభవాన్ని ఇస్తారు! ఆయనకు ఆ అనుభవం ఎలా ఇవ్వాలో తెలుసు. ఇదీ బాబాతో నా అనుభవం. కేవలం వాచా వెలువడే ప్రబోధాల ద్వారా మాత్రమే అర్థం చేసుకునేవారిని కూడా, ఆ బోధ చివరికి వారిని బోధకు అతీతంగా తీసుకుపోతుంది. ఎందుకంటే మాటలు కేవలం ప్రారంభం మాత్రమే, చరమస్థితికి చేరుకున్నప్పుడు అక్కడ మాటలు ఉండవు. నిజమైన పరివర్తన హృదయంలో కలుగుతుంది, నేను సత్సంగంలో ఏమి చెబుతున్నాను అనేదానిపైన ఆ పరివర్తన ఆధారపడి వుండదు. నిజంగా మీలో పరివర్తన కలిగించేది నేను మాట్లాడే మాటలు కాదు. నేను మీకు ఇంతకుముందు చాలాసార్లు చెప్పాను, నాకు మాటల మీద అస్సలు నమ్మకం లేదు. మనం మాట్లాడుకునే మాటలు నేను మీతో కలసి కాసేపు గడపడానికి, ఆనందం పంచుకోవడానికి ఒక అవకాశంగా భావిస్తాను".*

శ్రీబాబూజీతో సత్సంగం సాయిభక్తులకు, సాధకులకు ఓ ఆత్మీయ సమాగమం. వేదికలమీద బహిరంగమైన సత్సంగాలు శ్రీబాబూజీ పద్ధతి కాదు. సాయికృపావిశేషంగా శ్రీపూండీస్వామి వద్ద వారు పొందిన అనుభవం తరువాత నుండి వారి సన్నిధిలోని అనిర్వచనీయమైన మాధుర్యం ఎంతోమందిని ఆయన దరికి చేర్చింది. ఆయన సమ్మోహనశక్తి, అపారమైన పాండిత్యం వలన ఎందరో సాధకులు, సాయిభక్తులు, సత్యాన్వేషకులు ఆయన సాన్నిధ్యంలో ఉండాలని పరితపించేవారు. ఆయన సమక్షంలో అందరూ కలసి కూర్చునే అవకాశం దొరికిన ప్రతిసారీ అప్పటికప్పుడు అది సత్సంగంగా

రూపుదిద్దుకునేది. ఈ సత్సంగాలలో శ్రీబాబూజీ తమకు సాయినాథుని పట్ల గల ప్రేమను, బాబా గొప్పతనాన్ని, తమ అనుభవసారమైన సాయితత్వాన్ని అందరితో పంచుకొనేవారు. శ్రీబాబూజీ పలికిన ప్రతి మాటా, అప్పుడక్కడ అడిగిన ప్రశ్నకు సమాధానమేనని గుర్తుంచు కోవాలి. ఏకపక్షమైన ఉపన్యాసధోరణి, 'సిద్ధాంత' ప్రబోధాలు ఆయన విధానంకాదు. తరువాత రోజుల్లో భక్తసందోహం ఎక్కువ కావడంతో ఆయనతో సత్సంగాలు అరుదుగా మారాయి. శిరిడీలో సాయిభక్తులతో కలసి సాయినామ సంకీర్తనలో పాల్గొనడానికి శ్రీబాబూజీ వేదిక మీదకు వచ్చినపుడు అందరికీ వారి సాన్నిధ్యభాగ్యం లభించేది.

శ్రీబాబూజీ సత్సంగాలు చాలావరకు అప్పటికప్పుడు జరిగేవి. ముఖ్యంగా 'ఫలానా' సమయంలో సత్సంగం అని ప్రకటించడం ఎన్నడూ జరిగేది కాదు, సత్సంగాలు చాలావరకు రాత్రిపూట జరిగేవి. సత్సంగాలకు నిర్దేశిత ప్రదేశమంటూ ప్రత్యేకించి ఉండేది కాదు: శ్రీబాబూజీ ఉన్నప్రాంతాన్ని బట్టి శిరిడీ, తిరుమల, సముద్రతీరాన చెన్నై, హృషీకేశ్, వారణాసి, ఉత్తరకాశీ, తిరువణ్ణామలైలోని వారి చిన్న ఫ్లాట్... లేదా ప్రయాణసమయంలో రైలులోనో, బోటులోనో... ఇలా ఎక్కడైనా సత్సంగానికి అవకాశం ఉండేది. ఆ సమయంలో, ఆ ప్రదేశంలో ఉన్నవారు సత్సంగంలో పాల్గొనేవారు. కాబట్టి ఆ అరుదైన సందర్భాల కోసం గంటలు, రోజులు, వారాలపాటు ఎదురు చూడవలసి వచ్చేది, ఆ అద్భుతమైన క్షణాల కోసం ఎందరో పాశ్చాత్య భక్తులు శ్రీబాబూజీ ఆవాసానికి దగ్గరలో నివాసముండేవారు. గురువుగారు ప్రయాణంలో ఉన్నప్పటికీ చాలామంది ఆయనతోపాటే ప్రయాణిస్తూ సత్సంగం కోసం వేచివుండేవారు. ఆ ఎదురుచూపుల్లో ఆయనను చూడాలన్న తపన, ఆయనంటే అమితమైన ఇష్టం, ఆయన

సన్నిధిలోనికి అడుగుపెట్టబోతున్నామన్న ఆనందం ఒకవైపున ఉంటే, మరోవైపు సత్సంగం ఎప్పుడు జరగబోతుందో తెలియని ఉత్కంఠ, ఆ ఎదురుచూపుల ఉద్విగ్నక్షణాలు కలిగించే భావోద్వేగాలు – ఇలా శ్రీబాబూజీ సత్సంగం కోసం నిరీక్షించే భక్తుల హృదయసీమల్లో అనుభూతుల ఇంద్రధనస్సు ఆవిష్కృతమయ్యేది. చివరికి సత్సంగంలో ఒకరిగా ఆయన పదసాన్నిధ్యాన ఆశీనులైనపుడు మనస్సులోని భావాలన్నీ కృతజ్ఞతాసుమాలై ఆ సద్గురు పాదాల చెంతకు చేరుకుని పరిమళించేవి.

సత్సంగాలలో తాము చెప్పేవారము, ఎదుటివాళ్ళు వినేవాళ్ళు అనే భావన శ్రీబాబూజీకి ఎన్నడూ లేదు. సత్సంగాలలో వారు ఎప్పుడూ "చెప్పండయ్యా" అనే అనేవారు. సత్సంగాలలో ఏకపక్షమైన ఉపన్యాసాలు ఇవ్వడం ఆయన పద్ధతి కాదు. అడిగిన వ్యక్తి అవసరాన్ని బట్టి వారి సమాధానం ఉండేది. ఇలా ప్రశ్న–సమాధానం రూపంలో వారి సత్సంగం కొనసాగేది. ఒకవేళ ప్రశ్నకు సమాధానమిచ్చిన తర్వాత అనుబంధమైన ప్రశ్నలేవీ లేకపోతే, మరో ప్రశ్న అడిగేవరకు వారు మౌనంగా ఉండేవారు. వారి సాన్నిధ్యంలో అంతరంగంలోని ఎన్నో ప్రశ్నలు అడగకుండానే సమాధానపడతాయని భక్తుల అనుభవం. భక్తుల అంతరంగాన్ని చదివి వారి ప్రశ్నలకు మౌనంగా బదులిస్తున్నట్లుగా ఉండేది. ప్రాచ్య, పాశ్చాత్య ఆలోచనారీతుల పట్ల, మానసిక ధోరణుల పట్ల, 'అహం' విన్యాసాల పట్ల శ్రీబాబూజీకి సంపూర్ణమైన అవగాహన ఉన్నట్లు కనిపించేది. వివిధ ఆధ్యాత్మిక సిద్ధాంతాల పరిభాషకు తావులేకుండా మానవ అనుభవాన్ని ప్రమాణంగా చూపుతూ, మనస్తత్వాన్ని అనుసరించి వారిచ్చే సలహాలు, సూచనలూ పాశ్చాత్య భక్తులకు, అన్వేషకులకు సైతం అబ్బురంగా,

ఆచరణసాధ్యంగా ఉండేవి. సత్యాన్ని నిక్కచ్చిగా, నిష్కర్షగా చెప్పడంలోనూ, మూఢత్వాన్ని, ఛాందస భావాలను సునిశితంగా విమర్శించడంలోనూ ఏనాడూ సంకోచించేవారు కాదు.

శ్రీబాబూజీ సత్సంగం ఓ అద్భుతమైన అనుభూతి. సత్సంగ వాతావరణం చెణుకులు, చురకలు, ఛలోక్తులతో ఉత్తేజభరితంగా ఉండేది. ఆధ్యాత్మికశక్తి నిబిడీకృతమైన వాతావరణం ఆ అనుభవానికి గాంభీర్యతను, అద్భుతమైన స్వచ్ఛతను చేకూర్చేది. శ్రీబాబూజీ సన్నిధిలో భక్తులకు ఎనలేని శాంతి ఆనందాలు, భద్రతాభావం అనుభవమయ్యేవి. ఆ సాన్నిధ్యంలో వర్షించే అనుగ్రహధారలలో పునీతమై ప్రతి ఒక్కరూ నూతన ఉత్తేజంతో తొణికిసలాడేవారు. సత్సంగంలో శ్రీబాబూజీ అత్యంత ఉత్సాహభరితంగా, సావధానంగా ఉండేవారు. వారి మాటలలోని చమత్కారానికి, హాస్యచతురతకు సత్సంగం ఆద్యంతం హర్షాతిరేకాలతో, నవ్వులతో ప్రతిధ్వనించేది. పురాణాలలోని కథలనుగానీ లేదా తమ స్వీయానుభవాలనుగానీ వారు చెప్పే తీరు అత్యద్భుతంగా ఉండేది. ఆయా పాత్రలను, వ్యక్తులను అనుకరిస్తూ, అభినయిస్తూ హాస్యస్ఫోరకంగా వారు చెప్పే విధానానికి అందరూ పొట్టచెక్కలయ్యేలా నవ్వుతుండేవారు. ఆయన గాంభీర్యస్వరంలోని మార్దవానికి కరిగిపోతూ, ఆయన నవ్వులతో శృతి కలిపి నవ్వుతూ, ఆయన మౌనంలో లయమైన మనస్సులతో, అందరూ ఆయనగా, ఆయనే అందరిగా అనుభవమయ్యే ఆ అద్భుత క్షణాల అనుభూతులను మాటలలో వర్ణించలేము. శ్రీబాబూజీ ప్రతి కదలికలో మైమరపింపజేసే రమణీయత ఉండేది – చెప్పే విషయంలోని భావానికి అనుగుణంగా పాదరసంలా కదిలే చేతులు, హావభావాలలో అత్యంత సహజంగా వ్యక్తమయ్యే తేజస్సు

అద్భుతమైన పారవశ్యానుభూతిని కలిగించేవి. ఆయనపై నుండి చూపు ప్రక్కకు మరల్చడం అసాధ్యమయ్యేది. సత్సంగంలో ఆయన ప్రతి కదలికా ఒక మహోన్నతశక్తి నిర్దేశకత్వంలో రూపుదిద్దుకున్న అద్భుతదృశ్యమై భాసించేది.

గురుదేవుల సన్నిధిలో గంటలకు గంటలు క్షణాల్లా గడిచిపోవడం గురించి, వారి సన్నిధి మహిమ గురించి సత్సంగాలలో పాల్గొన్న ఎందరో ఎన్నో రకాలుగా తమ అనుభవాలను పంచుకోవడం జరిగింది. కొంతమందికి వారి సన్నిధి ప్రభావం కొన్ని రోజుల తరువాత, లేదా కొన్ని వారాల తరువాత – ఒక అనుభవం రూపం లోనో, సంఘటన రూపంలోనో, స్వప్నదర్శన రూపంలోనో లేదా ఇతర రూపంలోనో తెలిసేది. దీనిని బట్టి చూస్తే వారి సత్సంగం హృదయంలో కలిగించిన మార్పు కాలక్రమేణా అనుభవంలోనికి వస్తుంది అనే విషయం సుస్పష్టమవుతుంది. రోజులు, నెలలు, సంవత్సరాలనే కాలపు ముసుగులను తొలగించుకొని చూస్తే ఆర్తి, ఆకాంక్ష ఉన్న భక్తులకు గురుదేవుల సాన్నిధ్య ప్రభావం హృదయాల్లో ఇంకా నిత్యనూతనంగా ఉన్నదని విశదమవుతుంది. మరికొంతమంది సత్సంగప్రభావం వలన వారిలోని ఆధ్యాత్మికశక్తి ఉద్దీపనమైందని చెప్పారు, ఇంకొందరు తమలో తలెత్తిన అహంకార ప్రకోపాన్ని గురించి తెలియజేశారు. సద్గురుసన్నిధి ప్రభావం వలన అంతరంగం లోని వేదనలు, దుఃఖం, ఇతర భావోద్వేగాలు బయటకు వస్తాయి. అంతరంగాన్ని క్షాళన చేసే క్రమంలో సద్గురువు మన లోపలి మాలిన్యాలను మన ఎరుకలోనికి తీసుకువచ్చే క్రమంలో ఇలాంటి పరిణామం సంభవిస్తుంది. ఇలా అనుభవమేదైనా దానికి ప్రచోదితం మాత్రం ఆ సద్గురుమూర్తి దివ్యసాన్నిధ్యమే.

ఈ పరిచయ వ్యాసం కోసం శ్రీబాబూజీ సత్సంగాలలో పాల్గొన్న భక్తులను పలుకరించగా చాలామంది ఎక్కువగా పేర్కొన్న విషయం: సత్సంగం తరువాత వారికి అనుభవమయ్యే ఒక రకమైన అమనస్కస్థితి (మనస్సు నిశ్చలం కావడం). ఆ స్థితిలో ఆలోచనా ప్రవాహం తాత్కాలికంగా ఆగిపోయి, ఆనందకరమైన మైమరపు అనుభవమవుతుంది. ఎల్లప్పుడూ అలవాటుగా వచ్చే ఆలోచనల చక్రం నుండి సాధకుని తప్పించి అహంకార పొరలు పలుచగా ఉండే ఉన్నతస్థితికి తీసుకెళ్ళే క్రమంలో భాగంగా సద్గురు సన్నిధిలో అనుభవమయ్యేటటువంటి ఈ స్థితి సాధకుని ఉన్నత చైతన్యస్థాయికి తీసుకెళ్తుంది. సత్సంగం యొక్క ప్రయోజనం ఇదేనని శ్రీబాబూజీ ఇలా తెలియజేస్తారు:

*"సత్సంగంలో ఇలా రెండుగంటలు కూర్చొని ఇక్కడ నుండి వెళ్ళిపోయిన తరువాత మీరు పొందే మనఃస్థితి – సత్సంగం యొక్క నిజమైన ప్రయోజనం. మీ మనస్సులో మేథోజనితమైన ప్రశ్నలుగానీ, భావోద్వేగాలకు సంబంధించిన ప్రశ్నలుగానీ, ఎటువంటి ప్రశ్నలూ ఉదయించవు, మీరు ప్రయత్నించినా సరే. ఆలోచించడానికి మీరు ఎంతగా ప్రయత్నించినా మీలో ఎటువంటి ఆలోచనలూ రావు! మీరు ప్రయత్నించినప్పటికీ ఆలోచనలు రాని స్థితి ఉంది చూశారా, అదీ సత్సంగం యొక్క నిజమైన ప్రభావం. సాధారణంగా ఆలోచనలు ఎలా ఆపాలా అన్నది మన సమస్య; కానీ సత్సంగం తరువాత ఆలోచించడానికి ప్రయత్నించడం కూడా అసాధ్యమవుతుంది. నేను సత్సంగంలో మాట్లాడే విషయాలకూ మీరు పొందే ఆ స్థితికీ ఏ మాత్రం సంబంధంలేదు, కానీ ఆ స్థితి సత్సంగం యొక్క పర్యవసానం, సత్సంగఫలితం."*

ఆసక్తికరంగా, ఈ 'మనోనిశ్చల'భావాన్నే దాసగణు మహరాజ్ తమ ఆరతి గీతంలో వ్యక్తం చేసారు. ఈ విషయాన్ని గురించి ఈ గ్రంథం యొక్క మొదటి అధ్యాయంలో శ్రీబాబూజీ ఇలా ప్రస్తావిస్తారు: *"మనం బాబా ఆరతిలో 'థక్ గయీ మేరీ రసనా' అని పాడుకుంటాం, అంటే 'నేను మూగబోయాను' ('నా నాలుక అలసిపోయింది') అని. నిజానికి, తమను తాము మరిచిపోయినపుడు కలిగేటటువంటి విస్మృతభావాన్ని (నిశ్చేష్టిత భావాన్ని) దాసగణు వ్యక్తం చేస్తున్నారు".* కాబట్టి సాయిసన్నిధి ప్రభావం అంత అమోఘమైనది.

సద్గురు సన్నిధి మన హృదయంలో పరివర్తన ఎలా తీసుకొని వస్తుంది? మన అహంకారాన్ని ఇనుపముక్కతోనూ, సద్గురువును అయస్కాంతంతోనూ, సద్గురు సన్నిధిని అయస్కాంత క్షేత్రంతోనూ పోలుస్తూ శ్రీబాబూజీ ఇచ్చిన అద్భుత సాదృశ్యం ఈ గ్రంథంలోని నాలుగవ అధ్యాయంలో కనిపిస్తుంది. దాన్ని క్లుప్తంగా చూద్దాం:

*"మనమంతా ఇనుపముక్కల్లాంటి వాళ్ళం. అయస్కాంతానికి, ఇనుపముక్కకు ఉన్న తేడా ఏమిటి? అయస్కాంతం విషయంలో దానిలోని అణువులన్నీ క్రమపద్ధతిలో సరిగ్గా ధృవీకృతమై ఉంటాయి. ప్రతి అణువుకు ఉత్తరధృవం, దక్షిణధృవం ఉంటాయి – వాస్తవానికి అవి అలా ధృవీకృతం కావించబడి ఉంటాయి. అదే ఇనుపముక్కలో అణువులు ధృవీకృతమై ఉండవు, అక్కడ ధృవాలుగానీ, క్రమంగానీ ఉండదు, కాబట్టి ప్రతి అణువు యొక్క అయస్కాంత క్షేత్రానికి మరొక అణువు అయస్కాంతక్షేత్రం ప్రతికూలంగా పనిచేస్తుంది, ప్రతిఘటిస్తుంది. నిజానికి ఇనుములోని ప్రతి అణువు అయస్కాంతత్వాన్ని కలిగివుంటుంది. అక్కడ అయస్కాంతశక్తి ఉంటుంది కానీ అది వ్యక్తం కాదు, నిరోధింపబడుతుంది; అది అణిచివేయబడుతుంది.*

అయస్కాంతంలో అది వేరే విధంగా ఉంటుంది. పైకి చూస్తే అది సరిగ్గా ఇనుము మాదిరిగానే ఉంటుంది, మార్పేమీ ఉండదు. కానీ ప్రతి అణువు ఓ క్రమపద్ధతిలో, అమరికతో ఉత్తరం నుండి దక్షిణంవైపుకు ధృవీకృతమై, కేంద్రీకరింపబడి ఉంటుంది. మన అంతరంగంలో, మనం కూడా ఆ ఇనుప అణువుల మాదిరిగానే ఉంటాం. మనలో ఓ క్రమంగానీ, కూర్పుగానీ లేని చాలారకాల ఆకర్షణలున్నాయి – ఈ ఆకర్షణలు, కోరికలు అన్నీ ఒకదానితో ఒకటి సంఘర్షించేటటువంటి అణువులవంటివి. ఇలా వివిధ రకాల పాశాలు మనల్ని వివిధ దిశల నుండి లాగుతుంటాయి, అందువల్ల ఆ అయస్కాంతత్వం పోయింది. కాబట్టి ఓ ఇనుపముక్కను అయస్కాంతం చేయడం ఎలా? – దానిని నిరంతరం అయస్కాంతాన్ని (సద్గురువును) అంటిపెట్టుకుని ఉండేలా చేయడం ద్వారా, అయస్కాంతం మీద తిరిగి తిరిగి రుద్దడం ద్వారా అయస్కాంతంలా చెయ్యవచ్చు.

నిజంగా అంటిపెట్టుకుని ఉండటమంటే ఆ అయస్కాంతక్షేత్రంలో ఉండటమే. నిజానికి ఇనుపముక్కను అయస్కాంతంగా మార్చేది ఆ అయస్కాంతం కాదు, దాని క్షేత్రం. అవును, ఆ పోలికలో అది శక్తి క్షేత్రమే. అది మరొకటి కూడా కావచ్చు. అది ఓ ప్రేమ క్షేత్రం కూడా కావచ్చు, ఎందుకంటే నిజానికి ఇక్కడ ప్రభావితం చేసేది ఆ ప్రేమే. ఇనుపముక్కల విషయంలో అయితే అది కేవలం ఆ అయస్కాంత శక్తి క్షేత్రమే. కానీ మనం ఇనుపముక్కలం కాదు, మనం మనుషులం. మనకు హృదయముంది, అందులో భావోద్వేగాలున్నాయి. మనం ఆ క్షేత్రాన్ని ప్రేమ అనే భావోద్వేగంలా అనుభూతి చెందుతాం. ఎక్కడైతే ఆ భావోద్వేగం మరింతగా ప్రజ్వరిల్లుతుందో, అది మరింత పెరిగి బలీయమవుతుందో, మీరు ఎక్కడైతే దానిని మరింతగా అనుభూతి

*చెందగలుగుతారో, అదీ ఆ అయస్కాంత క్షేత్రం, సద్గురు సన్నిధి!"* అని వివరించారు శ్రీబాబూజీ.

శ్రీబాబూజీ సత్సంగాలలో పాల్గొన్న భక్తులకు అనుభవమయ్యే మరో విషయం – వారితో సత్సంగం తరువాత వాళ్ళ అంతరంగం లోని క్రమత, వారి లక్ష్యం పట్ల వాళ్ళకు ఏర్పడే స్పష్టత. తమ సద్గురు నాథుడైన శ్రీసాయి పట్ల శ్రీబాబూజీ మాటల్లో, చేతల్లో వ్యక్తమయ్యే అనన్య ప్రేమ, భక్తి, వారి సాన్నిధ్యంలో ఉన్న భక్తులలో కూడా అదే భక్తి భావాన్ని కలుగజేస్తుంది.

భక్తునిలో పరివర్తన తీసుకురావడంలో సద్గురు సాన్నిధ్యం యొక్క పాత్రను వివరిస్తూ శ్రీబాబూజీ, సద్గురువును సజీవ దర్పణంతో పోలుస్తూ మరో ఉపమానాన్ని ఇచ్చారు. సద్గురు సాన్నిధ్యం మన అహంకార సంజనితమైన లక్షణాలను మనకు చూపించడమే కాకుండా, వాటిని పోగొట్టడానికి, సరిచేయడానికి ప్రయత్నిస్తుంది. సకలచరాచరసృష్టిని తమ స్వరూపంగా భావించే సద్గురు సన్నిధిలో జరిగే ఈ అద్భుతప్రక్రియను శ్రీబాబూజీ ఇలా వివరిస్తారు:

"సద్గురు సాన్నిధ్యంలో మిమ్మల్ని మీరు చూసుకున్నప్పుడు మీ *హృదయం వికసించే ప్రక్రియ మొదలవుతుంది. అలా మీ హృదయం వికసించే ఆ ప్రక్రియలో మీలో పేరుకొనివున్న చెత్త మీకే అవగాహనకు వస్తుంది. ఎవరూ వీటిని మీ దృష్టికి తీసుకురానవసరంలేదు. సద్గురువు కేవలం అద్దంలాగా పనిచేస్తారు. అద్దం అనేది పరిమితమైన పోలిక మాత్రమే, ఏ పోలికా పరిపూర్ణమైనది కాదు. సద్గురువు అనే అద్దం విషయానికొస్తే, ఆయన మనలో ఏ మార్పు రావాలో తెలియజేసి, ఆ మార్పు సాధించడానికి తోడ్పడుతూ మనం మార్పును సాధించడానికి కూడా ఆయన కారణభూతులౌతారు. ఆయన ఒక*

సజీవ దర్పణం. జడమైన దర్పణం కాదు. సద్గురువు మనలోని దోషాలను చూపడం మాత్రమే కాదు, వాటినన్నింటినీ తొలగిస్తారు కూడా. అందుకనే నేను దానిని 'సజీవ దర్పణం' అంటాను. అది ఒక మామూలు జడమైన అద్దం కాదు, నువ్వు ఎలా వుంటే అలా ఉన్నదున్నట్టు చూపించడానికి! నువ్వు కురూపిగా వుంటే కురూపిగానే చూపించక, నీలోని వికారాన్ని, మాలిన్యాలను తొలగించి నిన్ను శుభ్రపరచడానికి ప్రయత్నిస్తుంది. ఒక మామూలు అద్దం అలా చెయ్యలేదు. కానీ సద్గురువనే ఒక సజీవ దర్పణం అలా చెయ్యగలదు. ఈ అద్దం నువ్వెలా వుంటే అలా చూపించడమే కాక నిన్ను మెరుగు పరచడానికి ప్రయత్నిస్తుంది. దానికి కారణం అంటూ ఏమీలేదు. అది ఆయన లీల, ఆయన క్రీడ. సద్గురువనే సచేతనమైన అద్దం నిన్ను సరిచేయడానికి, అందంగా తయారుచేయడానికి ప్రయత్నం చేస్తున్నప్పుడు, వాస్తవానికి జరిగేది ఏమిటంటే సద్గురువు తనను తానే సరిచేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఎందుకంటే ఆయనకు నువ్వు వేరే వ్యక్తిగా కనిపించవు. ఆయనవైపు నుండి జరిగేది ఇదే. తన పట్ల తానే జాగ్రత్త వహిస్తూ, తనకు తానే సహాయం చేసుకునే ప్రయత్నమే జరుగుతుంది. సద్గురువుకు మీరందరూ తనలో భాగంగానే అనిపిస్తారు. కాబట్టి సద్గురువు వైపు నుండి చూస్తే ఆయనకు ఆయనే సహాయం చేసుకుంటున్నాడు".

సచ్చిదానందమైన సద్గురుస్థితిని, ఆయన సన్నిధి మహాత్మ్యాన్ని వివరిస్తూ శ్రీబాబూజీ ఇచ్చిన వివరణ అవధులు లేని సద్గురు ప్రేమకు, అర్హతలు చూడకుండా అందరినీ తమలో భాగంగా చూసే వారి కరుణకు అద్భుతమైన వర్ణన. దానిని వారి మాటల్లోనే చూద్దాం: "ఎవరైనా ఒక వ్యక్తి మహాత్ముని సన్నిధికి వచ్చినపుడు, ఆ

మహాత్ముడు సదరు వ్యక్తితో తాదాత్మ్యం చెందుతారు. మహాత్ములు అటువంటి స్థితిలో ఉంటారు. వారి సన్నిధిలో ద్వైతభావం ఉండదు. ఆ మహాత్ముని అనుభవంలో తమ కోసమే తాము ప్రతిస్పందిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ ఉన్నపుడు అది ఆయనకు స్వగతమైన సంభాషణలాగా, తమతో తామే మాట్లాడుకుంటున్నట్లుగా ఉంటుంది. అందుకే కొన్ని సందర్భాలలో కొన్ని ప్రశ్నలు అడగకపోయినా సమాధానాలు వస్తుంటాయి. మన మనస్సులోని ఆలోచనలు వారు బయటకు చెబుతారు. ఒక విధమైన దయతో కూడిన ప్రేమ కలుగుతుంది. ఇవన్నీ జరగడానికి కారణం ఆయనకు మనతో గల ఏకత్వం. ఆయన అద్దంలాగా, సచేతనమైన అద్దంలాగా పనిచేస్తారు. సద్గురువు మనలను ఆయనలో భాగాలుగానే చూస్తారు కాబట్టే మనల్ని ప్రేమిస్తారు".

శ్రీబాబూజీ ఇచ్చిన ఈ వివరణ అద్భుతంగా, స్ఫూర్తిదాయకంగా కనిపిస్తుంది. మానవ అస్తిత్వానికి ఆధారమైన అనంతప్రేమతత్వం సద్గురు రూపంలో వెలుగొందుతూ ప్రతి ఒక్కరికీ ఆ స్థితిని అందించడానికి నిర్విరామంగా ప్రయత్నిస్తుందని, అవ్యాజ ప్రేమను అందిస్తుందని తెలియజేసే ఈ వివరణ అహంకారపు బంధనాలలో చిక్కుకొని బాధపడే ఎందరికో నూతన స్థైర్యాన్నిస్తుంది. సద్గురు సన్నిధిని మినహాయించి సమస్త విశ్వంలో అంతటి ఆనందాన్ని, భద్రతను అందించే తావు మరొకటి లేదనేది నిత్యసత్యం.

శ్రీబాబూజీ సత్సంగం మాటలకందని మనోజ్ఞమైన అనుభవం అనేది అక్షరసత్యం. అద్వితీయమైన ఆయన సన్నిధిలోని ఆనంద రవళులను, మౌనం దాల్చిన భక్తుల మనస్సులు నిశ్శబ్దంగా ఆలపించే అపూర్వరాగాలను అక్షరబద్ధం చేయడం ఎవ్వరికీ సాధ్యంకాదు.

సత్సంగంలో అవిభాజ్యమైన గురుదేవుల సాన్నిధ్యాన్ని, వారి మాటలను వేరువేరుగా చూడటం సాధ్యపడదు. సదా స్వస్వరూప సంస్థితులైన ఆ మహితాత్ముని అంతరంగపు అనంత మౌనం నుండి వెలువడిన దివ్యవాక్కులు ప్రతి పదంలో ఆ ప్రేమమూర్తి సన్నిధిని సంప్రాప్తం చేస్తాయి. ఆలోచనలలో, మాటలలో, ఆచరణలో తిరుగులేని సామ్యతకు శ్రీబాబూజీ జీవితం నిలువుటద్దం. తమ త్రికరణాలను సాయినాథుని పదార్చనకు సమర్పించిన శ్రీబాబూజీ జీవితమంతా సాయినాథుని సత్సంగమే. ఆయన సత్యంతోనే జీవించారనడం అక్షరసత్యం. ఆయన ప్రత్యక్షసన్నిధిని పదాలలో వర్ణించలేకపోవచ్చు కానీ ఆయన పదాల ద్వారా ఆ సాన్నిధ్యాన్ని అనుభూతి చెందగలమనే విషయాన్ని పాఠకులకు తెలియజేయడమే ఈ పరిచయవ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

శ్రీబాబూజీ వంటి అరుదైన మహాత్ములు మానవజాతి ప్రస్థానంలో ఆణిముత్యాల వంటివారు. లక్ష్యశుద్ధితో సద్గురుపథాన పయనిస్తే ప్రతి మానవునికి ఒక జీవితకాలంలో పరిపూర్ణత్వం సాధించడం సాధ్యమన్న విషయాన్ని అనుపమానమైన ఆయన జీవితప్రస్థానం తెలియజేస్తుంది. అద్వితీయమైన ఆ మహితాత్ముని సాన్నిధ్య సమన్విత జ్ఞానప్రదీప్తమైన పలుకులు సత్యాన్వేషకులకు, సాయిపథగాములకు 'శరశ్చంద్రిక'లై దారిచూపుతాయని, దివ్యసన్నిధిని ప్రసాదిస్తాయని **'సాయిపథం'** ఆశిస్తోంది.

SAI SEEKERS

# శరశ్చంద్రికలు



బోధన్, 2000



# ఆరతి

ఆరతి అంటే – భక్తులు దైవానికిగానీ, దైవంగా భావించే మహాత్ముని ప్రతిమకుగానీ, సజీవులైన ఒక మహిమాన్విత సత్పురుషునికిగానీ అభిముఖంగా నిలబడి అందరూ కలసి ఆయన సంకీర్తనలను సమిష్టిగా ఒకే స్వరంతో పాడుతూ, అర్చించే ఒక సామూహిక పూజావిధానం (ఆరతి సేవ). సాధారణంగా, సంగీతవాయిద్యాలయిన చిరుతలు, తాళాలు, గంటలు మొదలైనవి ఈ సంకీర్తనకు సహకరిస్తాయి. సుగంధభరితమైన అగరుబత్తీలు, సాంబ్రాణి వెలిగించి ఆరాధ్యమూర్తిని పూలమాలలతో భక్తిపూర్వకంగా అలంకరిస్తారు. తరువాత భక్తులు ఆరతిగీతాలను ఆలపిస్తూండగా పూజారిగానీ, భక్తుడుగానీ అయిదు వత్తులు గల నేతి దీపాలతో లేదా కర్పూరంతో ఆరతి చేస్తారు. ఈ విధమైన అనుష్ఠానాన్నే ఆరతి అంటారు.

ఎక్కువమందికి, ఓ సామూహిక వాతావరణంలో జరిగే ఆరాధన అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. ఆ సామూహిక వాతావరణంలో, సంఘటిత భక్తిభావావేశం నిండి నిబిడీకృతమైన ఆ ప్రదేశంలో సులభంగా మనసు కుదిరి, భక్తులు తమ ఆరాధ్య దైవాన్ని ప్రార్థించుకోవచ్చు. ఒకే తాళాన్ని అనుసరించి భక్తిగీతాలను ఒకే స్వరంలో అందరితో కలసి సమిష్టిగా పాడుతున్నప్పుడు, భక్తుడు తన అహంకారపు పొరలను ఛేదించుకుని ఆ సంఘటిత లయలో సులభంగా కలసిపోగలడు. సమిష్టిగా పాడటమనేది 'సర్వత్రా చైతన్యం నిండివున్నది' అనే భావనను ఉత్తేజపరుస్తుంది. ఆ భావనలో ఎవరికి వారు తమ వ్యక్తిగత స్వరాన్ని కోల్పోతారు. ప్రపంచానికి అన్యంగా ఉన్నామన్న భావన స్థానంలో వారి గ్రహింపులో లేకుండానే తాము కూడా ఆ పూర్ణత్వంలో భాగం అనేటటువంటి ఎఱుక కలుగుతుంది. అంతేగాక, ఆ ఉత్తేజభరిత సంఘటిత భావోద్వేగ తీవ్రతలో 'తాను వేరు' అనే ప్రత్యేకమైన గుర్తింపు సామూహిక చైతన్య స్రవంతిలో కరిగిపోతుంది. దానితో పాటు ఇంద్రియాలన్నీ... దృష్టి – మనోహరంగా అలంకరింపబడిన విగ్రహమూర్తి మీద; వాక్కు – మేళతాళాలు, గంటలతో అందరిలో కలసిపాడటంలో; ఘ్రాణేంద్రియం – సుగంధభరితమైన ధూపాలు, పుష్పహారాల పరిమళాలను ఆఘ్రాణిస్తూ... ఇలా ఆరతిలో గాఢంగా లగ్నమవడం వల్ల ఈ ఇంద్రియాలు భక్తుల హృదయాలలో ఒక రకమైన అలౌకిక, పరమానంద పారవశ్యాన్ని కలుగజేస్తాయి.

*— పూజ్యశ్రీ బాబూజీ విరచిత 'ఆరతి సాయిబాబా' నుండి.*
*(సాయిపథం పబ్లికేషన్స్, 1996)*

**గురువుగారు:**

బాబా ఆరతిలో *"థక్ గయీ మేరీ రసనా"* అని పాడుకుంటాం, అంటే *"నేను మూగబోయాను" ("నా నాలుక అలసిపోయింది")* అని. నిజానికి, ఒకరు తమను తాము మరచిపోయినపుడు కలిగేటటువంటి ఆ విస్మృత భావాన్ని దాసగణు వ్యక్తం చేస్తున్నాడు. ఆయన కవిత్వాన్ని మేళవించి పాడుతున్నాడు కాబట్టి *"మూగబోయాను"* అనే పదాన్ని వాడాడు. కానీ అసలు ఆయన నాలుకెందుకు మూగబోయింది? ఎందుకంటే ఆయన మనస్సు స్తబ్ధమైపోయింది, ఆయన మరి మాట్లాడలేకపోయాడు. మళ్ళీ ఇది అటువంటిదే: మనం చదువుతూ ఉన్నపుడు కూడా ఆరతి పాడుతున్నపుడు కలిగే అనుభూతే కలుగుతుంది. మనం ఆరతి పాడినపుడు కనీసం కొంతమటుకైనా, మన మనస్సులు విస్మృతమవ్వాలి. అదీ నిజమైన ఆరతి.

**భక్తుడు:**

గురువుగారూ! మీరు శిరిడీలో ఆరతులకు వెళుతూండేవారా?

**గురువుగారు:**

అవును, నేను మొదటి రోజుల్లో ఆరతులకు వెళుతూండేవాడిని. నాకు ఆరతులంటే ఇష్టం, నేను వాటిని ఆస్వాదిస్తాను. అలాగని నాకు ఆరతుల పట్ల అనురక్తి అంటూ ఏమీ లేదు. నిజానికి ఆరతి ఇవ్వడం నాకు కూడా ఇష్టమే. బాబాకు సంబంధించింది ఏదైనా నాకు అభ్యంతరం లేదు. ఆరతులన్నింటిలోకెల్లా దాసగణు మహరాజ్ ఆరతులంటే నాకు ఎక్కువ ఇష్టం. ఒక విధంగా, నాకు *"సాయి రహమ్ నజర్ కర్‌నా..."*తో ప్రారంభమయ్యే ఆరతి ఎంతో మనోహరంగా

ఉంటుంది. అందుకనే, సత్సంగాలలో ఏమి చేసుకోవాలి అని అందరూ అడిగినపుడు – అన్ని ఆరతులూ అవసరం లేదు, మీకు కావాలనిపిస్తే, “సాయి రహమ్ నజర్ కర్‌నా” మాత్రం పాడుకోవచ్చు అని చెప్పాను. అది అప్పుడలా ప్రారంభమైంది. అంతేగానీ నేను దానిని నిర్దేశించలేదు.

**భక్తుడు:**

మీరు ఈ రెండు ఆరతులను ఎందుకని అంతగా ఇష్టపడతారు?

**గురువుగారు:**

నాకు ఆ ఆరతులలోని ప్రతి విషయం నచ్చుతుంది. వాటిలో ప్రకటమయ్యే మొత్తం భావం... ఆ శైలి... దానిని వ్యక్తం చేసిన వారు... వారు దానిని వ్యక్తం చేసిన విధానం... ఇలా అన్నీ!

**భక్తుడు:**

మీరు చెప్పేది దాసగణు మహరాజ్ గురించేనా?

**గురువుగారు:**

అవును, దాసగణు మహరాజ్ గురించే! బాబా ముస్లిం అనే భావనతో వారి చేతుల మీదుగా ప్రసాదాన్ని తీసుకోవడానికి కూడా కాస్త సంకోచించిన ఒక సాంప్రదాయ బ్రాహ్మణుడాయన. అయినప్పటికీ “మసీదులో నేను చీపురును” అని చెప్పడానికి సిద్ధపడ్డాడు. గడచిన కాలంలో, ముస్లింలు అంటే పరజాతివారు, కడజాతివారు, అంటరానివారు అనే భావనను బ్రాహ్మణులు కలిగివుండేవారు. అందుచేత వారిని తాకడానికి కూడా సంకోచించేవారు. మురికిని తాకుతూ ఆ దుమ్ము, ధూళిని ఊడ్చే చీపురును కూడా అంటరాని

వస్తువుగా భావిస్తారు. దాసగణు మహరాజ్ చీపురును ఉపమానంగా తీసుకొని ఇలా పోల్చి చెబుతున్నారు: "నేను ఇక్కడున్నది మీ పాదధూళి కోసమో లేక అనుగ్రహం కోసమో కాదు. నా దృష్టి వాటిపై లేదు. నీ భక్తుల పాదధూళిని ప్రోగు చేసుకోగలిగితే అదే పదివేలు. ఇదే నేను చేసే పూజ, ఇదే నాకు ఆనందాన్నిస్తుంది" అని. ఇటువంటి వ్యక్తీకరణలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు, "సాథీ ఆఖర్‌కా" (జీవితాంతం తోడునీడై ఉండేవాడు), "రహమ్ నజర్ కర్‌నా"... వాస్తవానికి ఆయన వాడిన పదాలు ఇస్లాంకు సంబంధించినవి. ఒకవేళ ఆయనే గనుక హిందూ పద్ధతిలోనే వ్రాయాలనుకుంటే హిందీ పదాలను వాడి ఉండవచ్చు. "నజర్" అనే పదమూ, ఇంకా ఆయన వాడిన ఇతర పదాలు ఆయన పాండిత్యాన్ని కూడా తెలియ చేస్తున్నాయి. మనోహరమైన ఆ అనుభూతి ఎంత అందంగా ఆయన వ్యక్తపరచారు! ఆయన అలా అనుభూతి చెంది ఉండకపోతే అలా వ్రాయడం సాధ్యపడదు.

భక్తుడు:

దాసగణు మహరాజ్, బాబాను ముస్లింగా గౌరవించడానికి "నజర్" అనే పదాన్ని ఎంపిక చేసుకున్నారా?

**గురువుగారు:**

బాబా ముస్లిమేనని ఆయనకు గట్టి నమ్మకం. అందువల్ల ఆయన ముస్లిం పద్ధతిలో వ్యక్తం చేయాలనుకున్నాడు. దానికనే ఆయన ఇస్లామిక్ పదాలను ఉపయోగపెట్టాడు.

భక్తుడు:

ఇస్లాంపట్ల ఆయనకు గల గౌరవభావంతోనా?

**గురువుగారు:**

ఆయనకున్న భక్తి వల్ల!! బాబా ఆయనకు సద్గురువు. దానిని నువ్వు "గౌరవం" అని చెప్పలేవు, అది భక్తి. ఎంత గాఢమైన భక్తంటే, బాబా మసీదులో ఆయన చీపురు కావాలనుకున్నాడు. దానిని నువ్వు గౌరవం అంటావా? అది చాలా తేలికైన పదం. బాబాను ఆయన గౌరవించలేదు, ఆయన కేవలం గౌరవించేవాడు మాత్రమే కాదు. అది గౌరవం కన్నా చాలా చాలా ఎక్కువ.

మీరు **"ఆరతి సాయిబాబా"** చదివారా? నేను అనుభూతి చెందిన కొన్ని విషయాలను అందులో వివరించడానికి ప్రయత్నించాను. పరిమితమైన నా స్వంత పరిధిలో **"ఆరతి సాయిబాబా"**లో వీటిపై వ్రాసిన వ్యాఖ్య ద్వారా ఈ రెండు ఆరతుల పట్ల నాకు గల అభిమానాన్ని పంచుకోవడానికి ప్రయత్నించాను. అసలు నేను వాటిని ఎందుకు ఇష్టపడతాను అనే దానికి గల అనేక కారణాలలో అది (**"ఆరతి సాయిబాబా"** లోని వివరణ) కేవలం ఒక అంశం మాత్రమే.

**భక్తుడు:**

బి.వి. నరసింహస్వామిగారు "సాథీ ఆఖర్‌కా"ను "చివరి క్షణాలలో సహాయం చేసేవారు" అని అనువదించారు.[1]

**గురువుగారు:**

నిజానికి, సాథీ అనంటే "సహచరుడు / వెంటనుండేవాడు" అని; "సహచరుడు" అనేది ఖచ్చితమైన అనువాదం. బహుశా నరసింహ

[1] *శ్రీబి.వి. నరసింహస్వామి విరచిత "లైఫ్ ఆఫ్ సాయిబాబా" (నాలుగు భాగాల సంకలన గ్రంథం, ప్రథమ ముద్రణ: 2002) పేజీ నెం: 363*

స్వామిగారు బాబాను ఉద్దేశించి సహచరుడు అనే పదాన్ని వాడటానికి ఇష్టపడి ఉండకపోవచ్చు. ఎందుకంటే, బాబాను 'సాథీ' – సహచరుడు, స్నేహితుడు అనడం బాబాను అగౌరవపరచడంగా ఆయన భావించి ఉండవచ్చు. అందుకనే ఆయన దానిని "సహాయకుడు"గా మార్చి ఉండవచ్చు. అయినా, ఆయన అందుకే అలా చేశారా లేదా అనే విషయం నాకు తెలియదు. కానీ వాస్తవికంగా చూస్తే 'సాథీ' అంటే 'సహచరుడు', 'ఆఖర్‌కా' అంటే 'చివరి వరకు'. నిజానికి, కేవలం చివరలోనో లేక చరమావస్థలోనో కాదు, మొదటి నుండి చివరిదాకా ఆయనుంటారు. ఆఖరి సన్నివేశంలో వచ్చే తెలుగు సినిమా పోలీసులా కాదు, దానివల్ల ఎలాగూ ఎటువంటి ప్రయోజనముండదు. బాబా అలా కాదు, మొదటి నుండి చివరి దాకా ఆయన మన కోసం ఉంటారు.

భక్తుడు:

గురువుగారూ! అందరితో కలసి ఆరతి చేయడం వలన ఏదైనా అంతర్గత ప్రయోజనం ఉంటుందా?

**గురువుగారు:**

అదో వ్యక్తీకరణ మాత్రమే. అందులో అంతర్గత ప్రయోజనమంటూ ఏమీ లేదు. దానిని నువ్వు వ్యక్తం చేసేటటువంటి విధానం, అది నీకు ఎలాంటి అనుభూతిని కలుగజేస్తున్నది అనేదే అందులోని ఏకైక అంతర్లీనమైన ప్రయోజనం. ఒకవేళ ప్రేమను మీరు స్వతహాగా వ్యక్తపరచలేనపుడు, అందరితో కలసి ఆరతిని చెయ్యడం తగిన వ్యక్తీకరణ అని అనిపిస్తే ఆరతిని చెయ్యండి. అందులో ఇబ్బందేం లేదు. అంతేకానీ తప్పకుండా చెయ్యాలనిగానీ చెయ్యకూడదనిగానీ

లేదు. కొంతమందికి, "ఆరతి పాడుతుంటే బాగుంది, ఆరతి చెయ్యడం నాకు ఇష్టం. దానివల్ల నేను ఏదో అనుభూతి చెందుతున్నాను, నాకు ఆనందంగా ఉంటుంది" అనిపిస్తుంది. అలాంటప్పుడు చెయ్యండి. అంతేగానీ బాబాకు ఆరతి అలానే చెయ్యాలి లేకపోతే ఆయన అనుగ్రహం మనపై వర్షించదని అనుకోవడం తప్పు. అది ఓ వ్యక్తీకరణ మాత్రమే. దానిని అప్రయత్నంగా జరగనివ్వండి. మీరు స్వతఃసిద్ధంగా అలా వ్యక్తపర్చలేనపుడు మీ చుట్టుప్రక్కల అందుబాటులో తయారుగా ఉన్నవాటిని ప్రయత్నించండి. మీకు తగిన దానిని ఎంపిక చేసుకోండి. ఉదా॥కు, మీ స్నేహితునికి శుభాకాంక్షలు చెప్పాలనుకున్నప్పుడు, కవిత్వంతో కూడిన ఆలోచన కానీ, వాక్యంగానీ మీకు తట్టనపుడు ఏం చేస్తారు? మీరు ఒక షాపుకెళ్ళి రకరకాల కార్డులు చూస్తూ, కార్డులన్నింటిలో మీకు నచ్చింది, మీరు చెప్పాలనుకున్న భావం గలది దొరికేవరకు వెతికి దాన్ని ఎన్నుకుంటారు. దానిని కొని అతని పుట్టినరోజునాడో, క్రిస్‌మస్‌కో, క్రొత్త సంవత్సరంనాడో, అది ఏదైనాగానీ అతనికి (కార్డు) పంపుతారు. ప్రతి ఒక్కరూ వాళ్ళ ప్రేమను ఆరతులలో మాదిరిగానే వ్యక్తం చేయాల్సిన అవసరం లేదు. అందమైన కవిత్వం, చిత్రాలు, డిజైన్లు ఇలా ప్రపంచంలో వేరే పద్ధతులు చాలా ఉన్నాయి. మీకు బాగా సరిపోయే దానిని తీసుకుని ఉపయోగపెట్టుకోండి.

**గురువుగారు:**

బాబా ఆరతులు ప్రతి ఒక్కరికీ తెలియకపోవచ్చు. ఆ విషయం నాకు తెలుసు. కానీ అక్కడ కూర్చొని ఆనందంగా దానిని ఆస్వాదించడం,

బాబాను పూజ్యభావంతో అలా చూస్తూ ఆరతిని వినడం, అదీ పాల్గొనడమే. ఆ భాష తెలిసినవాళ్ళు, మాట్లాడడం వచ్చినవాళ్ళు పాడితే పాడవచ్చు. అంతేగానీ ఆరతిలో పాల్గొనడమంటే ప్రతి ఒక్కరూ పాడాలని కాదు: అందరి మధ్యలో అక్కడ నిలుచుని, ఆ మొత్తం సందర్భాన్ని ఆనందంగా అనుభూతి చెందడం – అదీ ఆరతులలో పాల్గొనడమంటే. నేను అలానే అనుకుంటాను. ప్రతి ఒక్కరూ ఆరతి పాడాలని నేననుకోను. కానీ మీరు అక్కడుండటం, మీదైన మార్గంలో మీ ప్రేమను వ్యక్తం చేయడం నేను ఇష్టపడతాను. ఎందుకంటే అక్కడ ఉండటం వల్ల బాబాను ప్రేమించే మిగతావారితో కలవడమనే ప్రయోజనం కలుగుతుంది. ఎవరైనా వ్యక్తి వేరొక వ్యక్తిని ప్రేమించినపుడు, తన మాదిరిగా ఆ వ్యక్తిని ప్రేమించే వాళ్ళతో కలసి ఉండటానికి ఇష్టపడతాడు. నన్ను ఇష్టపడేవాళ్ళు, నేను ఇంటి దగ్గర ఉన్నప్పుడు (అందుబాటులో ఉన్నప్పుడు), వ్యక్తిగతంగా కలుసుకోవాలనుందని నాకు చెప్తూంటారు. కానీ వీళ్ళే, నేను విగ్రహప్రతిష్ఠ కోసం వెళ్ళినపుడు అక్కడ వేలమంది ఉన్నప్పటికీ వాళ్ళు కూడా అక్కడ ఉన్నందుకు మరింత ఆనందంగా ఉంటారు. ఎందుకని? ఎందుకంటే వాళ్ళు తమలాగే నన్ను ఇష్టపడేవారి మధ్యలో, తమలాగే నన్ను ప్రేమించే సాటివారి మధ్యలో ఉన్నారు. ఎప్పుడైతే ఒకరికి ఇష్టమైన విషయం చాలామందికి ఇష్టమైనపుడు, ఆ సమిష్టి ప్రేమ ఆ ప్రదేశమంతటా వ్యక్తమవుతూ ఉంటుంది, అది ఆ ఆనందాన్ని మరింత పెంచుతుంది. ఆరతిలో ఏం జరుగుతుందంటే అక్కడ చాలామంది తమ ప్రేమను వ్యక్తం చేస్తూ ఉంటారు – ఎవరి పట్ల? మన ఆరాధ్య దైవం పట్ల! శిరిడీలో సమాధి మందిరంలో ఎవ్వరూ లేనపుడు బాబాను చూడటం అనేది ఒక అంశం,

అందరూ భజనలు పాడుతూంటే, పూజారి ఆరతి చేస్తున్నపుడు బాబాను చూడటమన్నది మరో అంశం – ఇదీ మనకు ఆనందాన్ని కలిగిస్తుంది – కారణం మనకు ఆరాధ్యదైవమైన బాబా అక్కడున్న అందరితో ఎంతగానో ఆరాధింపబడుతున్నారు.

అప్పుడు నీకు ఎక్కడ చూసినా ప్రేమ, ఆ ప్రేమను వెలిబుచ్చడం, రకరకాలుగా ప్రేమను వెలిబుచ్చడం కనిపిస్తుంది. అది మీకు సంతోషాన్ని కలిగించాలి, మీ ఆనందాన్ని ఇనుమడింపజేయాలి. ఆరతికి వెళ్ళండి, అక్కడ అందరూ కలసి ఆరతి చేసే విధానాన్ని ఆస్వాదించండి. చాలామందితో కలసి ఉండటం కూడా మేలు కలిగిస్తుంది, అది మీ మనస్సుపై సత్ప్రభావాన్ని కలుగజేస్తుంది. సత్సంగం విషయంలో కూడా ఇది వాస్తవం. మనకు తెలియకుండానే కొన్నిసార్లు మనస్సులో ఆర్ద్రత లోపిస్తుంది. పదిమందితో కలిసి ఉండటం వలన, అంతమంది ప్రేమ మధ్యలో కూర్చొనుండటం వలన ఆ రసహీనత పోయి, ఆ చుట్టూ వున్న ప్రేమతో మన హృదయాలు ఆర్ద్రమవుతాయి. ఆరతిలోగానీ, సత్సంగంలోగానీ అందరితో కలిసి ఉండటం ఇటువంటి ప్రభావాన్ని కలిగివుంటుంది. కాబట్టి ఇటువంటి ప్రభావానికి మీరు లోబడి ఉండండి, సిద్ధపడండి, దాని ఫలితాన్ని పొందండి. సమిష్టిగా ప్రేమను వ్యక్తం చేయడంలో ఈ ప్రయోజనం వుంది. అందుకే నేను దానిని ప్రోత్సహిస్తాను.

**గురువుగారు:**

నువ్వు గొప్ప పేరున్న వ్యక్తివి (వి.ఐ.పి.) కావచ్చు, చాలా చాలా పేరున్న వ్యక్తివి (వెరీ వెరీ వి.ఐ.పి.) కావచ్చు – కానీ సాయిభక్తునివి

కాలేవు. ఆ అహంకారరహిత భావన లేకపోతే ఒక భక్తునివి కాలేవు!! కబీరు, *"మై రామ్ కా కుత్తా హూం!"* అంటే "నేను రాముని కుక్కను" అంటాడు. ఆయన్ని ఆయన దానితో (కుక్కతో) పోల్చుకున్నాడు, ఆయన తన రామునితో తన సంబంధాన్ని అలా చెప్పుకున్నాడు. కానీ మనకు బాబా ఫోటోకు రెండు మూడుసార్లు నమస్కారం చెయ్యడం కూడా సమస్యే! "బాబాను ఒక స్నేహితునిగా ఎందుకు చూడకూడదు?" అని అడుగుతాం. నిజానికి కబీరు రామునికి స్నేహితునిగా ఉండి ఉండవచ్చు. కానీ ఆయన తనను రాముని కుక్కగా చెప్పుకున్నాడు. ఓ కుక్కలాగా! కుక్కకు ఒక బిస్కెట్ వేస్తే తోక ఊపుకుంటూ వెళుతుంది, ఎప్పుడూ నీ చుట్టూనే తిరుగుతూ ఉంటుంది – అది కేవలం ఒక్క బిస్కెట్ కోసమే కావచ్చు, అలా భావించండి! "అతను నాతో అలా మాట్లాడాడు, నాకు కోపం తెప్పించాడు లేదా ఇతను నన్ను కొంచెం అగౌరవంగా చూశాడు!" అని ఎప్పుడూ ఇటువంటి అహంకార ధోరణి కలిగి ఉండవద్దు. ఇటువంటి విషయాలను పట్టించుకోవద్దు. మనం ఇక్కడికి ఎందుకు వచ్చాం? దాని మీద దృష్టి పెట్టండి! అహాన్ని గౌరవించడం లాంటి విషయాలు అక్కడ ఉండకూడదు. మీరు శిరిడీలో వున్నా, బాబా ఫోటో ముందరున్నా అలానే భావించండి. ఆ భావం మీలో కలగాలి. దాసగణు మహరాజ్ *"అపనే మస్‌జిద్ కా ఝూడూ గణూ హై"* *("గణూ నీ మసీదునూడ్చే చీపురు")* అన్నారు. ఎంత చక్కని వ్యక్తీకరణ అది! ఆయన ఎన్నడూ బాబాకు ఎప్పుడూ ప్రక్కనే నిలబడి ఉండే వ్యక్తిగత కార్యదర్శి కావాలనుకోలేదు, ఒక చీపురు కావాలనుకున్నాడు! ఆ భావం నాకెంతగానో నచ్చుతుంది. కబీరు దానిని ఒక రకంగా వ్యక్తం చేశాడు. దాసగణు ఇంకో రకంగా వ్యక్తం చేశాడు.

**భక్తుడు:**

'ఝాడూ' అంటే ఏమిటి?

**గురువుగారు:**

'ఝాడూ' అంటే చీపురు. నిజానికి అదొక అంటరాని వస్తువు. సాధారణంగా ఎవరూ దానిని తాకరు. భారతదేశంలో, ఒకవేళ ఎవరైనా దానిని ముట్టుకుంటే వాళ్ళు కనీసం కాళ్ళూచేతులన్నా కడుక్కోవాలి. ఇంట్లో అది ఒక అంటరాని వస్తువు. కానీ ఆ చీపురు మాత్రమే మసీదులోని బాబా పాదధూళినే కాకుండా, బాబా భక్తుల పాదధూళిని కూడా ప్రోగుచేసుకునే భాగ్యాన్ని కలిగివుంది. ఆ అదృష్టం, అవకాశం కేవలం చీపురుకు మాత్రమే వుంది. అందుకే ఆయన (దాసగణు మహరాజ్) దానిని ఎంచుకున్నారు. ఆ పాదధూళిని ప్రోగు చేశాక అది అక్కడే ఓ మూలన ఉంటుంది! ఎవ్వరూ దానిని తాకరు, అది అంటరానిది. అదీ (తను బాబా మసీదును ఊడ్చే చీపురుననేది) దాసగణు యొక్క వ్యక్తీకరణ! మీరు దీనిని ప్రతిరోజూ ఆరతిలో పాడుతారు. కానీ కొంతమంది, "ఆయనెందుకు ఆరతిస్తున్నాడు, నేనెందుకు ఇవ్వకూడదు? రేపటి నుండి నేను ఆరతివ్వాలి" అనో, "ఇక్కడ ఇంతటి ముఖ్యమైన వ్యక్తిని నేను సత్సంగంలో ఉన్నప్పుడు, ఆరతినివ్వడానికి ఆయననెందుకు అతను పిలుస్తున్నాడు?" అనో అంటూంటారు. మళ్ళీ "*అపనే మస్జిద్ కా ఝాడూ గణూ హై*" అని పాడుతుంటారు. అది ఎంత అర్థరహితమో కదా! అందుచేత ఆరతిని అర్థవంతంగా చెయ్యడానికి ప్రయత్నించండి! దాసగణు మహరాజ్ ప్రారంభంలో ఆచారాలు, సాంప్రదాయాలలో ఎంతో సనాతన భావాలు కలిగివుండేవారు. ఎంతగా అంటే – బాబా పాదాల వద్ద నుండి వచ్చిన పవిత్రజలాన్ని కూడా త్రాగలేదాయన. "నేను

*అగ్రకులానికి చెందిన బ్రాహ్మణుణ్ణి. బాబా ముస్లిం"* అని ఆయన అనుకున్నారు. ఇలా ఇంకా చాలా అడ్డంకులున్నాయి ఆయనకు. గడచిన కాలంలో, భారతీయ సమాజంలో పాకీపని చేసేవారిని నిమ్నకులాలకు చెందినవారుగా, అంటరానివారుగా భావించేవారు. వస్తువులన్నింటిలోకి పాకీపని చేసేవాళ్ళ పనిముట్టు – ఊడ్చడానికి వాళ్ళు వాడే చీపురు – అత్యంత అంటరాని వస్తువు. తరువాత ఆయన ఎంతగా పరివర్తన చెందాడంటే, ఏమాత్రమూ ప్రాముఖ్యత లేని ఆ వస్తువు (చీపురు) తను కావాలనుకున్నాడు. కాబట్టి ఇంకో రకంగా చూస్తే, తనను తాను సమాజంలో పాకీపని చేసేవారితో పోల్చుకున్నారాయన. చూడండి! ఆయన ప్రారంభంలో ఎలా ఉన్నారు, చివరికి ఎలా పరివర్తన చెందారు!!



బోధన్, 2000



# రసానుభూతి

**భక్తుడు:**

గురువుగారూ! మమ్మల్ని మీరు మా లక్ష్యంపై దృష్టి పెట్టమని, మేము వేసే ప్రతి అడుగు మమ్మల్ని ఆ లక్ష్యం వైపుకు తీసుకెళుతోందా లేదా అని తరచి చూసుకోమని, మేము చేస్తున్న పనుల్లో మాకు ఉపయోగపడనివి ఏమైనా ఉంటే అటువంటి వాటిని వదలిపెట్టమని చెప్తూంటారు కదా, మరి కళల సంగతి ఏమిటి, మా జీవితాలలోని సౌందర్యం గురించి ఏమిటి, అవి కూడా మా అవసరంలో (లక్ష్యంలో) భాగమే కదా?

**గురువుగారు:**

మీరు మీ జీవితంలో, మనస్సులో, శరీరంలో గల రసానుభూతిని ఆస్వాదించగలిగితే అంతకు మించి మనకు కావలసిన కళాఖండాలు ఏమున్నాయి? మనం చూస్తున్నాం, మనం ఆలోచిస్తున్నాం, మనం

శ్వాసిస్తున్నాం, మనం ఎన్నో విషయాలను అనుభవిస్తున్నాం. అలా శ్వాసిస్తున్నది ఏమిటి? అలా చూస్తున్నది, ఆలోచిస్తున్నది, అలా అనుభవం పొందుతున్నది ఏమిటి? ఇక్కడ ఏమి జరుగుతోంది? ఎంత అద్భుతం (మిస్టరీ) అది! ఉన్నట్టుండి మనలో సంతోషం, అంతలోనే విచారం. మనలో పూర్తి అపనమ్మకం, మరుక్షణం అప్పటికప్పుడు మనకు ఎంతో నమ్మకం. కొంతమంది మనకు ఆనందాన్ని కలిగిస్తారు, కొంతమంది అయిష్టతను కలిగిస్తారు. ఇవన్నీ ఏమిటి? వీటిలోని సౌందర్యాన్ని చూడండి. నా వరకు, మీలో ప్రతి ఒక్కరూ ఓ గొప్ప కళాఖండం! మనం బయట చూసే కళాకృతులన్నీ కేవలం మన స్వీయ (అంతరంగపు) ప్రతిబింబాలే. అవి దానిని (అంతరంగాన్ని) వివరిస్తాయి, దానికి అవి నీడలవంటివి. మన అంతరంగాన్ని అవి చక్కగా ప్రతిబింబించినప్పుడు, దానికవి ప్రతిరూపాలైనపుడు, వాటిని అందమైన కళలుగా భావించడం జరుగుతుంది. ఎందుకంటే మనం వాటిని చూసినపుడు, మన స్వీయ జీవితపు సౌందర్య అస్తిత్వాన్ని వాటిల్లో చూస్తాం.

నేను ముఖ్యంగా చెప్పేదేమిటంటే, మిమ్మల్ని మీరు తెలుసుకోవడానికి ప్రయత్నించండి. ప్రతి ఒక్కరి మనస్సు, ప్రతి ఒక్కరి ఆలోచన, ప్రతి ఒక్కరి జీవితం ఇలా అన్నీ కళారూపాలే. నాకు, మీరందరూ అందమైన వివిధ రకాలైన కళాకృతుల మాదిరిగా కనిపిస్తారు – మైకలాంజిలో, లియోనార్డొ డావెన్సీ సృజించిన వాటికంటే కూడా అందంగా!! (గురువుగారు నవ్వుతూ...) అవును, అవి అందమైన కళాకృతులే. కానీ మనం కాన్వాసు మీద రూపుదిద్దుకున్న దానిని చూసి ఆనందించినంతగా, దీనిని ఇక్కడ (తమ హృదయానికేసి చూపిస్తూ...) ఎందుకని అనుభూతి చెందలేక

పోతున్నాం? ఇది ఎంతో వాస్తవమైనది. ఇదే కళ! ఇదే సౌందర్యం! ఇదే రసానుభూతి!

మైకలాంజిలో రూపొందించిన కళాకృతుల కంటే, ప్రతి ఒక్కరూ మైకలాంజిలో లాగా తమ స్వంత కళను (జీవితాన్ని) అనుభూతి చెందడానికి ప్రయత్నించడాన్ని నేను ఎక్కువగా ఇష్టపడతాను. (గురువుగారు నవ్వుతూ...) మైకలాంజిలో తన కళను ఎంతగా అనుభూతి చెందివుంటాడో ఒక్కసారి ఆలోచించి చూడండి! అలాగే మీరూ మీ సృజనలను అనుభూతి చెందండి. ఇక్కడ ఎంతో కళ ఉంది – ఎంత అందం, ఎన్ని మనస్సులు!! నేనిలా చెబుతున్నప్పుడు, ప్రతి మనస్సు వివిధ రకాలుగా ఆలోచిస్తుంది. ఒకరికి అర్థమవుతుంది, ఒకరికి "ఏమిటది?" అని ఓ సందేహం, ఒకరికి ప్రశ్నించాలంటే భయం, మరొకరు నిద్రమత్తుగా... దీనిలోని సౌందర్యాన్ని చూడండి.

**భక్తుడు:**

బాబా మాకు జీవితంలో ప్రతిదీ ఇస్తున్నారు. ఇలా ఇస్తున్నప్పటికీ నేను కొన్నిసార్లు "ఇవన్నీ ఏమిటి? నేను ఇక్కడ ఉండకూడదు, నేను దూరంగా వెళ్ళిపోవాలి, ఈ సాంసారిక విషయాలన్నింటి నుండి తప్పుకొని గురువుగారి దగ్గర ఉండిపోవాలి" అనుకుంటూ బాబా ఇచ్చిన వాటన్నింటి నుండి దూరంగా వెళ్ళిపోవడానికి ప్రయత్నిస్తుంటాను. ఇది నిజమైన భావనో లేక నేను చదివిన విషయాల నుండి ప్రోగు చేసుకున్న భావాల వలన కలిగిందో నాకు తెలియదు. లేకపోతే, ఇది జీవితంలో నాకు లభించిన వాటిలోని సౌందర్యాన్ని చూడకుండా ఉండే ఒక రకమైన వ్యతిరేక భావమా?

**గురువుగారు:**

అది ఏదైనా సరే, వేదాలంతటి గొప్పదైనా సరే – అది గనుక ఒకవేళ మిమ్మల్ని నిస్తేజంగా, శుష్కంగా, రసానుభూతి లేకుండా చేస్తుంటే దానిని వదలిపెట్టేయండి, దాని మీద నుండి దృష్టి మరల్చండి! అలాగని అదేదో చెడ్డదని కాదు, కానీ అది మీలో జీవితపు సౌందర్యం యొక్క ఎఱుకను కోల్పోయేలా చేస్తుంటే దానివల్ల ఎటువంటి ఉపయోగంలేదు.

సమస్త శాస్త్రాలూ ప్రేమకు వ్యక్తీకరణలే! ఆ ప్రేమను చూడటానికి ప్రయత్నించండి. వేదాలు, మంత్రాలు ఏమిటి? అవన్నీ ఋషులు, తత్త్వదర్శనులు తమ పారవశ్య బ్రహ్మానుభూతిలో వారు చేసిన ఉద్ఘోషలు, వారు పలికినటువంటి పలుకులు! ఆ అనుభూతిలో వారు నర్తించారు, కీర్తించారు. అవే మంత్రాలయ్యాయి. కాబట్టి యథార్థంగా చూస్తే, అవన్నీ ఏమిటి? అవి వారి తన్మయత్వానికి, పారవశ్యంతో కూడిన ప్రేమకు, పరబ్రహ్మస్వరూపం పట్ల వారి ప్రేమకు – ఆ అనుభూతికి – సమస్త శాస్త్రాలూ వ్యక్తీకరణలే.

మీరు వాటినలా చూస్తే వాటిల్లోని సౌందర్యాన్ని చూడగలుగుతారు. అలా కాకుండా కేవలం శాస్త్రాలను ప్రావీణ్యం కోసం అధ్యయనం చేస్తే మనం వాటిని రసహీనం చేస్తాం. ఇంకా మన అంతరంగాన్ని అర్థరహితంగా, ఉదాసీనంగా, అందాన్ని, ప్రేమను, పారవశ్యాన్ని, కళాత్మకతను అభినందించడానికి, ఆస్వాదించడానికి పనికిరాకుండా తయారుచేస్తాం. అది విజ్ఞానశాస్త్రంగా కాదు, నేను దానిని ఓ కళగా చూస్తాను. మహాత్ములు, ఋషులు వీరందరూ కళాభిజ్ఞులు. చివరికి భగవంతుణ్ణి కూడా ఓ కళాకారునిగా – "కవిహి"గా పేర్కొన్నారు.

కాబట్టి ప్రతిదీ ఓ కళారూపమే. ఏదైతే హృదయాన్ని కదిలిస్తుందో అదే నిజమైన కళ!

**గురువుగారు:**

దీనిని ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి: ఇక్కడ ఇలా శిరిడీలో ఉండే సందర్భంగానీ, లేదా మరెక్కడున్నా సరే – మీకు ఎంత మంచి అవకాశం లభ్యమయిందో తెలుసుకోవడానికి ప్రయత్నించండి. చాలావరకు మీ చింతలు, కష్టాలు మీరు సృష్టించుకున్నవే, వాటికి అసలు అర్థమంటూ ఏమీ లేదు!

జీవితం చిన్నది. మీరు ఇక్కడ ఎందుకున్నారు అన్నదానికి ఎంత మాత్రమూ సంబంధం లేని విషయాలతో దానిని (జీవితాన్ని) వృథా చేసుకోవద్దు. మీ లక్ష్యాన్ని గుర్తుపెట్టుకోండి. అప్పుడు మీ జీవితమనే పుస్తకం మనస్సును రంజింపజేసే మంచి నవలలా కనిపిస్తుంది. లేకపోతే అది పాఠ్యపుస్తకంలా ఉంటుంది. దానిని పాఠ్యపుస్తకంలాగా చదవకండి – అది పాఠ్యపుస్తకమయితే అప్పుడు దానిలోని ప్రతి పదము, ఆ పదానికి అర్థము తెలుసుకోవాలి, దానిని వివరించాలి, మళ్ళీ తిరిగి ఒప్పజెప్పాలి, అలా చెయ్యకపోతే మనం ఫెయిల్ అవుతాము (తప్పుతాము), కాబట్టి అక్కడ తప్పక చేయాలనే భావం ఉంటుంది. కానీ అదే ఒక నవలనుకోండి, దానిని ఎలా చదువుతాం? మనం ప్రతిదీ గుర్తుపెట్టుకుంటాం, దానిని ఆస్వాదిస్తాం, మనం దానిని ఇంకా గొప్పగా తిరిగి చెప్పగలం.

ఈ జీవితం ఒక నవలవంటిది, ఓ అందమైన నవల! దీనిని ఎవరు వ్రాశారు? బాబా వ్రాశారు. మన జీవితానికి రచయిత ఆయన.

దానిని చదవడానికి, ఆస్వాదించడానికి ప్రయత్నించండి – దానిని పాఠ్యపుస్తకం చెయ్యకండి.

**గురువుగారు:**

మీరు ఏదో ఒక విషయంతో తాదాత్మ్యం చెంది, మిమ్మల్ని మీరు మర్చిపోయినపుడు – అక్కడ మీరు పొందే ఆ అనుభూతే రసానుభవం. సంస్కృతంలో దానిని రసానుభూతి అంటారు. ఉదాహరణకు, మీరు ఒక సినిమానో, నాటకాన్నో చూస్తున్నప్పుడుగానీ, మంచి ఆసక్తికరమైన పుస్తకాన్ని చదువుతున్నప్పుడుగానీ ఏం జరుగుతుందంటే మీరు అందులోని పాత్రలతో తాదాత్మ్యం చెందుతారు. ఆ పాత్రలతో కలసి నవ్వుతారు, ఏడుస్తారు. మీరు ఫలానా అన్న విషయం మర్చిపోతారు. అలా అనుభవాన్ని పొందడం రసానుభూతి.

నేను తరచుగా విషాదభరితమైన సినిమాను దీనికి ఉదాహరణగా చెప్తుంటాను. రక్తసంబంధం అనే తెలుగు సినిమాను తీసుకుందాం. అది ఒక అందమైన విషాద గాథ. నాకు తెలిసినంతవరకు మామూలు మనిషన్నవారెవ్వరూ, చివరికి బండరాయిలాంటి మనస్సున్నవారైనా, అసలు భావోద్వేగాలే లేని విరాగులైనా సరే – ఆ సినిమాను చూసి ఏడవకుండా బయటకు రారు. ఆ సినిమాను చూడటానికి వెళ్ళి అక్కడ వెక్కి వెక్కి ఏడుస్తుంటారు. బయటకు వచ్చిన తర్వాత వాళ్ళే "ఆ సినిమాను చూడటానికి మళ్ళీ వెళ్ళాలి" అని చెబుతూ వుంటారు. (నవ్వులు...)

ఆ సినిమాను రెండు వందలసార్లు చూసిన ఒక వ్యక్తి నాకు తెలుసు. ఊరకనే అలా ఏడవటానికే అక్కడకు వెళ్ళేది. (నవ్వులు...)

అది ఏమిటి? ఏడవటమన్నది అప్రియమైన అనుభవం. మరి ఆయన దానిని ఎందుకు కావాలనుకుంటున్నాడు?

కారణం ఏమిటంటే అక్కడ ఆయన ఏడుస్తున్నప్పటికీ ఆ రసానుభూతిని పొందుతున్నాడు, ఆ అనుభూతి ఆయనకు అంత గొప్ప ఆనందాన్నిస్తోంది. అదే అందులోని అద్భుతం (మిస్టరీ). ఎవరైనా ఏడవాలని ఎందుకనుకుంటారు?

షేక్స్‌పియర్ వ్రాసిన హాస్యరచనలకన్నా విషాదాంత రచనలు ఎందుకంత ఎక్కువ ప్రాచుర్యం పొందాయి? ఎవరైనా షేక్స్‌పియర్ వ్రాసిన గొప్ప రచన గురించి చెప్పాలనుకుంటే విషాదాంత రచనలనే ఎందుకు ప్రస్తావిస్తారు? విషాదాంతాలే ఎందుకని? ఇతరులు బాధపడుతుంటే మనం సంతోషపడే మనుషులలోని క్రూరమైన స్వభావమా అది? కాదు. దానికి కారణం మనలోని క్రూరస్వభావం కాదు, అది ఒక రసానుభూతి కావడమే దానికి కారణం. ఎందుకంటే ఆ సినిమాను ఎవరైతే చూస్తున్నారో అతనూ ఏడుస్తున్నాడు... ఇతరులు బాధపడుతుంటే క్రూరుడైనవాడెవడూ ఏడవడు. అదే అందులోని తేడా!

**భక్తుడు:**

నాకు ఏదైనా ఒక అందమైన అనుభూతి కలిగినపుడు, నేను దానిని అందరితో పంచుకోవాలనుకుంటాను. దాని గురించి ఎవరికైనా చెప్పాలి, దాని గురించి మాట్లాడాలి అని అనిపిస్తుంది. కానీ, నాకు సరైన పదాలు దొరకకపోవడంవల్ల దానిని పంచుకునేందుకు నాకక్కడ ఏమార్గమూ కనిపించడం లేదు.

**గురువుగారు:**

కేవలం ప్రయత్నించడం మాత్రమే మీరు చేయవలసింది. అవును, మనం ప్రయత్నించాలి. ఆ ప్రేమను, రసానుభూతిని పొందినటువంటి వారు – వారు కూడా అలానే ఎంతగానో ప్రయత్నించారు. ఈ వేదశాస్త్రాలన్నీ కూడా ఆ ప్రయత్నమే. వారి అనుభవాన్ని వారు వర్ణించడానికి ప్రయత్నించారు, కానీ వారికది సాధ్యపడలేదు. నేను దానిని వర్ణించలేను అని చెప్పారు, కానీ ప్రారంభంలోనే ఆ మాట చెప్పలేదు. ఆ అనుభవం వర్ణింపశక్యం కాదని వారికి తెలుసు. అయినప్పటికీ వారు దానిని వ్యక్తం చేయడానికి ప్రయత్నించారు. ఎవరైనా కవిత్వం వ్రాశారంటే దానర్థం అసలైన ఆ కవితాత్మకమైన అనుభూతిని వారు నిజంగా వర్ణింపగలిగారనిగానీ, ఆ అనుభవాన్ని నిజంగా పంచుకోగలిగారనీ కాదు. కానీ వాళ్ళు ప్రయత్నించారు. హృదయపూర్వకమైన ఆ ప్రయత్న ఫలితమే కవిత్వం.

హిమాలయాలను చూస్తూ "అద్భుతం. ఎంత మనోహరంగా ఉన్నాయి? నేను వివరించలేను" అంటూ ఇలా ప్రారంభంలోనే చేతులెత్తేసేవాడు కవి కాలేడు. దానిని వర్ణించడానికి ప్రయత్నించేవాడే కవి. "నిజంగా చెప్పాలంటే నేను దానిని వివరించలేను, కానీ నేను ప్రయత్నిస్తాను" అంటూ అతను తన కలాన్ని అందుకుంటాడు. అప్పుడతను ఒక వర్డ్స్‌వర్త్ (ఈయన ఒక ఆంగ్లకవి) గా మారతాడు. ఆయన పదాలు ఎప్పుడూ విలువైనవిగానే ఉంటాయి. అందుకనే ఆయన వర్డ్స్ – వర్త్. (నవ్వులు...)

ఆ పదాల వెనుక గల ఆ ఆర్తి, ఆ స్ఫూర్తి, ఆ మధనం, ఇవి ఉంటే చాలు. ఈ పరితాపమంతా పసిపాప ఏడవడం లాంటిది. ఆ ఏడుపుకు కారణం – అది చీమల్లాంటివి ఏవైనా కుట్టడంవల్లనా, పాల

కోసమా, నిద్రలేకపోవడమా, బాగా ఉక్కగా ఉండటమా, పశ్చిమ దేశాలలో అయితే బాగా చల్లగా ఉండటమా – ఇలా అది ఏదైనా సరే అదేమిటో తల్లికి తెలుసు. పసిపాప ఊరకనే అలా ఏడవాలని ఏడుస్తున్నా తల్లికి తెలుస్తుంది. దానర్థం ఏమిటి? అక్కడ పదాలేమన్నా ఉన్నాయా? “క్యార్..క్యార్..” (గురువుగారు పసిపాప ఏడుపును అభినయిస్తూ) అని వివిధ రకాల పద్ధతులలో, రాగాలలో సాగే ఏడుపుల వెనుక గల కారణం తల్లికి తెలుసు. “ఆ క్యార్..మనడం దాని కోసం, ఈ క్యార్..మనడం దీని కోసం”. (నవ్వులు...) నిజానికి, మొత్తం కవిత్వమంతా ఇటువంటి క్యార్..లే. దాని వెనుక గల ఆర్తిని తల్లి అర్థం చేసుకుంటుంది.

**భక్తుడు:**

మనం ఎంపిక చేసుకునేదంటూ ఏమీ ఉండదు అనే అవగాహన కలగడానికి మనం గట్టిగా ప్రయత్నించాల్సిన అవసరముంది అని చెప్పడం సరైందేనా? అది పరస్పరం విరుద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది.

**గురువుగారు:**

నిజానికి ఆ పరస్పరవైరుధ్యాన్ని నువ్వు అనుభవించగలిగితే అది మంచిదే. అవును, అది పరస్పరం విరుద్ధమే. అందులో చాలా అందం ఉంది. అందులో అందం లేదా? అందుకనే కవిత్వంలోని అందమైన అంశాలలో అదీ (పరస్పర వైరుధ్యం) ఒకటి.

జీవితమనేది ఓ పుస్తకం, ఓ అందమైన కవిత. జీవితం యొక్క సౌందర్య రసానుభూతిని అనుభవంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించండి. మనం దానిని అలా చూసినపుడు జీవితమంతా

అందమైన కవిత్వమవుతుంది. అవును! అది పరస్పరం విరుద్ధంగానే ఉంటుంది. అంతమాత్రాన అందులో వాస్తవం లేదని కాదు. అది వాస్తవమే. అది మీకు అంతటా కనిపిస్తుంది. ఉదాహరణకు, "అరుణాచలము" అనే పదం. అది పరస్పర విరుద్ధమే. 'అరుణ' అంటే గతిశీలము; 'అచల' అంటే స్థిరంగా ఉండేది. స్థిరంగా ఉంటూనే గతిశీలం కావడం ఏమిటి? అది పరస్పర విరుద్ధం. కాబట్టి ఆ పరస్పర వైరుధ్యాన్ని అనుభూతి చెందండి, ఆస్వాదించండి. దాన్ని ప్రతిఘటించవద్దు. అది మీకు ఎన్నో అందమైన అనుభూతులను ఇస్తుంది. ఎన్నో అందమైన అనుభవాలను ఇస్తుంది. మీ జీవితాన్నంతా ఓ అందమైన కవితలాగా ఆస్వాదించండి. రమణమహర్షి ఎవరూ అడగకుండానే తమంతట తాముగా రచించిన **"అరుణాచల పదికం"** చదవండి. సాధారణంగా ఆయన ఎవరైనా అడిగితేనో లేదా ప్రశ్నించినప్పుడో మాత్రమే వ్రాసేవారు. కానీ ఒక్క **"అరుణాచల పదికం"** మాత్రం ఆయనకు వ్రాయాలనిపించి వ్రాశారు. నాకు అదే ఆయన నిజమైన కవిత, అదే ఆయన హృదయం అనిపిస్తుంది. అందులో ఎన్ని పరస్పర వైరుధ్యాలు కనిపిస్తాయో చూడండి! ఆయన దానిని ఆస్వాదించారు.

మనం ఓ మహోన్నత పర్వతాన్ని చూసినపుడు ఎలా ఉంటుందో అది అలా ఉంటుంది. పర్వతం మహోన్నతమైనదే, కానీ మీ సంగతేంటి? మనం చాలా చిన్నవాళ్ళం, కానీ అలా చిన్నగా ఉండటం దుఃఖదాయకమమైన విషయమా? దానికి సిగ్గుపడాలా? కాదు, అక్కడ మనం దానిని ఆనందిస్తాం! మనల్ని మనం మరచిపోయి అక్కడున్న మహోన్నతత్వాన్ని అనుభూతి చెందుతాం. మనం సద్గురు సన్నిధిలో ఉన్నప్పుడు జరిగేది సరిగ్గా అదే – మనం అల్పులం

అనే అనుభూతిని ఆనందించడం. అందుకే ఆయనను 'గురువు' అని పిలుస్తారు. 'గురు' అంటే పెద్దది అని. ఎంత పెద్ద అనంటే మనం చాలా అల్పం అనే భావన కలిగిస్తారు, అలా అని మనల్ని తక్కువ చేస్తారని కాదు. మనం దానిని ఆస్వాదిస్తాం. మళ్ళీ అది కూడా పరస్పర విరుద్ధమే. ఆ ఆనందభావన, దాని రసానుభూతి, అదే మనకు, మన సద్గురువుకు గల సంబంధం. ప్రతి చోటా సౌందర్యముంది, ప్రతి చోటా కవిత్వముంది!



శిరిడీ, 2004



# నీ లక్ష్యాన్ని నీవే తెలుసుకో

**గురువుగారు:**

మీకు ఏం కావాలో మొదట తెలుసుకోండి. అప్పుడు మన జీవితాన్నంతటినీ మలచుకోవడానికి అది ఒక కేంద్రబిందువుగా అవుతుంది. కాబట్టి ముందు మీకు ఏం కావాలో దానిని తెలుసుకోవడానికి ప్రయత్నించండి. "నేను దేని కోసం తపన పడుతున్నాను? అసలు నాకు నిజంగా కావాల్సిందంటూ ఏదైనా ఉందా?" అని ప్రశ్నించుకోండి. ఒకవేళ మీకిక ఏమీ అవసరం లేకపోతే, మీరు బాధపడుతూ నిస్పృహకు గురికావాల్సిన అవసరమేముంది? విచారిస్తూ, చింతిస్తూ, దారి తప్పామనుకోవడం, సరైన దారిలో లేమనుకోవడం – ఇలాంటివన్నీ ఎందుకు? ఆ అవసరం లేదు. ఇటువంటివన్నీ ఉన్నాయనంటే మనకు కావాల్సినదేదో మనం పొందటం లేదని అర్థం. అలా అయినపుడు మనకు కావాల్సిన 'అది'

ఏంటి? దానిని మన అన్వేషణకు మొదటి అడుగు కానివ్వండి.

**భక్తుడు:**

ఏదైనా కోరిక నెరవేరినపుడు దాని వలన కలిగే ఆనందం తాత్కాలికంగానే ఉంటుందనేది నా అనుభవం. కాబట్టి నా ప్రశ్న ఏమిటంటే, ఫలానా కోరిక తీరడం వలన శాశ్వతమైన ఆనందం కలుగుతుంది అనేటటువంటి కోరికంటూ ఏదైనా ఉందా, లేదా అసలు కోరికలంటూ లేకపోతే తత్ఫలితంగా శాశ్వతమైన ఆనందం కలుగుతుందా?

**గురువుగారు:**

ఇక్కడ సమస్యల్లా, మనకు కోరికలున్నాయి! మీకు ఎటువంటి కోరికలూ లేకపోతే – అసలు సమస్యే లేదు! అప్పుడు మీకు ఇంకేమీ అవసరంలేదు, మీరు శాశ్వతమైన ఆనందంలో ఉంటారు. మిమ్మల్ని శాశ్వతమైన ఆనందాన్ని పొందనీయకుండా అడ్డుకునేవి – కోరికలు (అనుకుందాం). మీరు ఇప్పుడు పొందేటటువంటి కాస్త ఆనందం మీ చేతిలో ఉన్న ఒక పక్షి లాంటిది; వేదాంత గ్రంథాలు పేర్కొనేటటువంటి ఆ శాశ్వతమైన ఆనందం పొదలో ఉన్న జంట పక్షుల వంటిది! "నేను చేతిలో ఉన్నటువంటి పక్షిని వదిలిపెట్టను, పొదలో ఉన్నవాటిని కూడా సాధిస్తాను!" అని అనుకోవడంలో తప్పేముంది? కనీసం నేను ఏదో తాత్కాలికమైన ఆనందాన్నైనా పొందుతున్నాను, కేవలం పొదలో ఉన్న ఆ రెండింటి కోసం మాత్రమే ఆలోచించేవాళ్ళు, చేతిలో ఉన్న ఆనందాన్ని (పక్షిని) కోల్పోతున్నారు, వాళ్ళకు కనీసం ఆ ఆనందం కూడా లేదు! ఖచ్చితంగా మనం వాళ్ళకన్నా చాలా నయం; కనీసం,

మనం ఈ క్షణంలో ఆనందంగా ఉన్నాం. అందువల్ల కేవలం గమ్యం మాత్రమే కాదు చేరే మార్గాన్ని కూడా ఆనందమయం కానివ్వండి! ఆనందాన్ని చేరుకునేందుకు దుఃఖమనేది మార్గమెందుకు కావాలి? మార్గం కూడా ఆనందమే కానివ్వండి! మనం సంతోషంగా, ఆనందంగా ఆ పారవశ్య అనుభూతిలో నర్తిస్తూ, ఇంకా ఇంకా మరింత ఆనందంవైపు సాగిపోతాం. ఆ తృప్తిలో, ఆ ఆనందంలో మనం పరిణతి చెందుతాం. తాత్కాలికమైన ఆనందం ఒకటి, రాబోయేటటువంటి శాశ్వతమైన ఆనందమనేది వేరొకటి – ఇలా రెండు విషయాలు లేకుండా ఈ తాత్కాలికమైన ఆనందాన్నే శాశ్వతమైన ఆనందంగా విస్తృతం కానివ్వండి. అవి రెండూ వేర్వేరు కాదు. ఎలాగంటే, నీ చేతిలో ఉన్నా లేదా పొదలో ఉన్నా అవి పక్షులే కదా!

ఈ శాశ్వతానందం అనే భావన వినడానికి బాగానే ఉన్నట్లు అనిపించినా ఇందులో మరొక ప్రమాదం ఉంది. అదేమిటంటే కోరికలను లేకుండా చేసుకోవడం మనకు సాధ్యపడదు, అది మన యథార్థస్థితి కాదు: మనకు చాలా కోరికలున్నాయి. శాశ్వతం అని మనం అనుకొనే ఆ ఆనందం కోసం మనం చేసే ప్రయత్నానికి ఓ చిన్న ఆరోగ్య సమస్య సైతం భంగం కలిగిస్తుంది. ఆ ఆనందం కోసం మనం చేసే ప్రయత్నం సఫలమయ్యేవరకు ఇలాటి అడ్డంకులొస్తూనే ఉంటాయి! ఇటువంటి చిన్న చిన్న సమస్యలు ఎదురవుతూ ఉంటాయి! మనం మాత్రం కోరికలు మంచివికాదు, మనకు కోరికులు ఉండకూడదు అంటూ ఎప్పుడూ శాశ్వతానందం గురించి మాట్లాడుతుంటాం. కానీ ముందు, “నా ఆరోగ్యం కుదుటపడాలి!” ఇంకా, “నాకు ఆరోగ్యం కుదుటపడితేనే నేను శాశ్వతానందం కోసం ప్రయత్నం చేయగలను, కానీ నాకు ధ్యానానికి కూర్చోవడమంటే

ఎంతో ఇష్టం, నేను కనీసం ధ్యానానికి కూడా కూర్చోలేకపోతున్నాను, నేను ధ్యానం చేసుకోవడం కోసం మరణించడానికైనా సిద్ధం!! కానీ భగవంతుడా, నేను ఈ మెడనొప్పితో చచ్చిపోతున్నాను, నాకు నడుంనొప్పిగా ఉంది, తలనొప్పిగా కూడా ఉంది, కళ్ళు కూడా బాధిస్తున్నాయి! నేను నిద్రలేకుండా ఉండలేను, నేను పదిగంటలకు పడుకోవాలి!”... అని మనమే అంటాం. (వాస్తవస్థితి ఇలా ఉంటే) మనమేమో ‘శాశ్వతమైన ఆనందం’ గురించి, దానిని ‘పొందడం’ గురించి, ‘కోరికలను అణచివేయడం’, ‘అహాన్ని నాశనం చేయడం’ (గురువుగారు నవ్వుతూ...) ఇటువంటి లోతైన విషయాల గురించి మాట్లాడుతూ ఉంటాం. ఇవన్నీ డాంబికమైన మాటలు. అది నిజం కాదు, ఆచరణసాధ్యమూ కాదు.

దానికంటే, మనం ఎక్కడున్నామో అక్కడి నుండే ప్రారంభిద్దాం. అది ఏదైనా కానివ్వండి, మనమేమిటి అనేటటువంటి ఆ వాస్తవికతలో అక్కడినుండి ఎదుగుదాం. అన్నింటికంటే ముందు, మన గురించి మనం స్పష్టంగా తెలుసుకోవడం: మనమేమిటి, మనం ఎక్కడున్నాం, మనకేం కావాలి, మన సమస్యలేంటి, మనకు ఆనందాన్ని కలిగించేది ఏమిటి, మనకు సరిగ్గా ఏం కావాలి? అక్కడ నుండి ప్రారంభించండి! ఆ తరువాత మీరు పొందేది ఏదైనా – అది కనీసం ఒక్క శాతమైనా సరే – అది వాస్తవం! అలా కాకపోతే మనకు నిజంగా అవసరంలేని దాని కోసం ప్రయత్నిస్తూ, మన జీవితమంతా పామును వదిలి పుట్టను కొట్టడంలాగా ఉంటుంది.

మీరు ఇక్కడెందుకు కూర్చుని ఉన్నారు? ఇవన్నీ ఎందుకు చేస్తున్నారు? అని మిమ్మల్ని అడిగితే, “నిర్వాణం పొందడానికి, ముక్తి పొందడానికి, ఆత్మసాక్షాత్కారం పొందడానికి, సటోరీ (– అనగా

జపనీస్ బుద్ధిజం పరిభాషలో ఆత్మసాక్షాత్కారం) పొందడానికి, దీన్ని పొందడానికి, దాన్ని పొందడానికి!" అని మీరు చెప్తారు. వినడానికి చాలా బాగుంది, కానీ మీకు ఇవన్నీ నిజంగా అవసరమా? ఊరకే అలా మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి, పరిశీలించుకోండి. అది అంత అత్యవసరమా? నిజానికి అంత అవసరం కాదు. చాలామందికి జీవితంలో అన్నీ ఉంటాయి – మంచి తిండి, మంచి భద్రత, మంచి బ్యాంక్ బ్యాలెన్స్, మంచి తల్లిదండ్రులు – ఇలా అన్నీ ఉంటాయి. ప్రాపంచికంగా వాళ్ళకు ఏ కొరతా కనిపించదు, అయినప్పటికీ ఏదో లేదు అనేటటువంటి అనుభవం కలుగుతూ ఉంటుంది. వాళ్ళకు ఏదో కావాలి. వాళ్ళు ఆనందంగా లేరు. వారిని "ఎందుకు మీరు సంతోషంగా లేరు? మిమ్మల్ని అసంతృప్తికి గురిచేసేది ఏమిటి?" అని మీరడిగితే వాళ్ళ దగ్గర సరైన స్పష్టమైన సమాధానముండదు. "అలాంటిదేం లేదు, ఏదో... తెలియని అసహనం, ఉన్నట్టుండి చెప్పలేని విచారం ఆవహిస్తుంది. జీవితంలో ఏదో కోల్పోతున్నామనే భావన కలుగుతోంది" అంటారు. ప్రతి ఒక్కరికీ ఏదో కావాలనిపిస్తూ ఉంటుంది, కానీ అదేంటో వారికి తెలియదు. మీరు 'ఏదో కొరతగా ఉంది' అంటారు. మంచిది – అయితే ఆ కొరత ఏమిటి? అని అడిగితే అది మనకు తెలియదు.

కాబట్టి ఇది మీ అన్వేషణకు మొదటి అడుగు కావాలి, ఆ కొరత ఏమిటో తెలుసుకొని దానికోసంగా, దానిని తీర్చుకోవడం కోసంగా అన్వేషణ సాగాలి. మీరు పుస్తకాలు చదవడంతో, ఉపన్యాసాలు వినడంతో ప్రారంభిస్తారు. అప్పుడు ఎవరో, "మీకు కావాల్సింది, మీకు లేనిది – ముక్తి! మీలో ఉండేది? – అహం! అందుకని అహాన్ని చంపుకుంటే మీరు ముక్తిని పొందుతారు" అని చెప్తారు. దానికి మీరు

"ఇంతేనా, ఇది చాలా సులభం!" అనుకుంటారు. అంతే, మనల్ని భ్రమింపజేసే ఆ మొత్తం ఘట్టం అక్కడ ప్రారంభమవుతుంది. మనల్ని మనం మోసం చేసుకుంటూ మనల్ని మనం స్వయంగా ఓ భ్రాంతికి గురిచేసుకుంటాం! "అవును, ముక్తి మంచిది. మనకు ముక్తి కావాలి, మనకు సాక్షాత్కారం కావాలి" అని ఇలా ఆలోచించడం మొదలుపెడతాం. కాబట్టి ముక్తికి సంబంధించిన వాటన్నింటినీ చదువుతాం, దాన్ని పొందడానికి ప్రయత్నాలు ప్రారంభిస్తాం, దాని కోసం ప్రయత్నిస్తూ.. ప్రయత్నిస్తూ.. మనం ఎక్కడ బయలుదేరామో అది మరచిపోతాం.

మీరు దేనికోసం మొదలుపెట్టారో దానిని వదలిపెట్టవద్దు! ప్రతి ఒక్కరికీ ఒకే విధమైన, ఒకే రకమైన కొరత ఉండాల్సిన అవసరంలేదు! ముందు మనలో ఆ కొరత ఏమిటో దానిని తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం. మీ అన్వేషణను మీ వ్యక్తిగతం కానివ్వండి, మీ మార్గం మీదే కానివ్వండి. మీ లక్ష్యం మీదే కానివ్వండి, మీరు పొందేది ఏదైనా అది (కూడా) మీదే కానివ్వండి. మీ లక్ష్యం – మీరు దాన్ని ముక్తి అని పిలిచినా సరే, నిర్వాణం అని పిలిచినా సరే – పేరుతో ఏం ఇబ్బంది లేదు – అయినా పేరులో ఏముంది? కానీ ఆ నిర్వాణం మన నిర్వాణం కావాలి, మన వ్యక్తిగత నిర్వాణం కావాలి. అది బుద్ధుడి నిర్వాణమో, సాయిబాబా నిర్వాణమో, రమణమహర్షి నిర్వాణమో కాదు – మీ నిర్వాణం కావాలి! "ఆయన నిర్వాణం ఆయన పొందారు, మన నిర్వాణం మనం పొందాలి. ఆయన స్వంతమార్గాన్ని ఆయన అనుసరించారు, నా స్వంతమార్గాన్ని నేను అనుసరిస్తాను" – ఇలా అయినపుడే మీరు నిజంగా బుద్ధుణ్ణి అనుసరించినట్లవుతుంది. "మీ మార్గాన్ని మీరే ఏర్పరుచుకోండి" అని ఆయన (బుద్ధుడు) చెప్పారు

కదా!? లేకపోతే, మనం మాయలో పడిపోతాం. ఒక వ్యక్తిగతమైన సమస్యను మనం అస్పష్టమైన సిద్ధాంతాలతో పరిష్కరించాలని ప్రయత్నిస్తాం. మనకు వ్యక్తిగతమైన దానిని మరింతగా మరింతగా అస్పష్టంగా చేసుకుంటాం, అయితే అది సత్ఫలితాన్నివ్వదు. ఆ అస్పష్ట సిద్ధాంతం ఓ మాయలాగా మారుతుంది. మనల్ని మనం భ్రాంతిలో ఉంచుకోవడం మొదలుపెడతాం. అది మనల్ని మన యథార్థస్థితి నుండి దూరంగా తీసుకెళుతుంది. కొంతమంది అదుపు తప్పి, మతిస్థిమితం కోల్పోయి పిచ్చివాళ్ళు కూడా కావచ్చు, వాళ్ళు తమ వాస్తవస్థితిని చూడలేరు.

అది అంతులేని భ్రమగా మారొచ్చు. కాబట్టి దాన్ని ఆపండి! ముందు మీ వాస్తవస్థితిని తెలుసుకోండి. మీ వాస్తవస్థితిని అంగీకరించండి, అది ఎంత గొప్ప సిద్ధాంతమైనా సరే, ఎవరు చెప్పినా సరే – మీ అనుభవాన్ని తప్ప మరే ఇతరమైన దానిని అంగీకరించవద్దు. మీ అనుభవాన్ని ఆధారంగా చేసుకుని, అక్కడ నుండి మొదలుపెట్టండి! ముందు మీకున్న లోటు ఏమిటో తెలుసుకోవడానికి ప్రయత్నించండి. అది (ఆ కొరత) అస్పష్టంగా ఉంటుంది కాబట్టి, అది తీరే పద్ధతి కూడా మొదట అస్పష్టంగానే ఉంటుంది. అది (ఆ ఆనందం) ఫలానా సందర్భంలో కలుగుతుందని మీకు అనిపించవచ్చు. ఉదాహరణకు, "నేను బాబా రూపాన్ని చూసినపుడు, ఏదో జరుగుతుంది, అదేంటో నాకు తెలియదు! కానీ ఎందుకనో నాలో ప్రేమ కలుగుతుంది. నేను సంతోషంగా ఉంటాను, ఎంతో భద్రతాభావాన్ని పొందుతాను, అంతేకాకుండా నాలోని 'కొరత' అప్పుడు అనుభవంలోనికి రాదు. బహుశా ఇదే నాకు సరిపోయే మార్గంకావచ్చు". (మనలో) ఇలాంటి భావనను కలిగించేది అక్కడ ఏదో ఉంది. అప్పుడు మనం దాని

మీద దృష్టి పెట్టి దానిని ఇంకా ఇంకా స్పష్టం చేసుకోవడానికి, ఇంకా ఇంకా నిర్దిష్టం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం. అలా అయితే, మంచిది! అలానే ముందుకెళ్ళండి. లేదూ, కొంతమంది దానిని వేరే మార్గాలలో పొందుతారు, అది ఏదైనా కానివ్వండి. ఎలా అయినా సరే, మీరు ఎక్కడున్నారో అక్కడి నుండి ప్రారంభించండి, మీ అనుభవం అనే వాస్తవికతలో నుండి మొదలుపెట్టి, అక్కడి నుండి "దానిని పొందడానికి" ప్రయత్నించండి. అప్పుడు మీరు పొందేది మీ యథార్థమవుతుంది – మీ వాస్తవమవుతుంది.

**భక్తుడు:**

మీరు మాకు సరైన మార్గాన్ని చూపడానికి ప్రయత్నిస్తున్నారా, గురువుగారూ?

**గురువుగారు:**

నేను మీకు ఏ మార్గమూ సూచించడంలేదు. మీ మార్గం ఏమిటో, మీ లక్ష్యం ఏమిటో తెలుసుకుని, ఆ తర్వాత ఆ మార్గంలో వెళ్ళమంటున్నాను. నేనేదీ నిర్దేశించడం లేదు. ఎవ్వరూ మరొకరి లక్ష్యాన్ని నిర్దేశించకూడదు. ముఖ్యమైన విషయమేమిటంటే – అది మీ లక్ష్యం, మీ అవసరం! కాబట్టి నేను మీకు ఏ లక్ష్యాన్నీ సూచించడం లేదు, నేను కేవలం ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాను. నేను చెప్పాలని ప్రయత్నిస్తున్న ముఖ్యమైన విషయమిది: మీ లక్ష్యం ఏమిటి? ప్రతి ఒక్కరికి తమదైన లక్ష్యం ఉంటుంది; అవి అందరికీ ఉమ్మడిగా ఉండే లక్ష్యాలు కావు. మీ లక్ష్యంలాగే మీ మార్గం కూడా మీ వ్యక్తిగతమైనదై ఉండాలి. మీకు మీ గమ్యం ఏమిటో తెలిస్తే,

దానిని చేరుకోవాలనే అవసరం మిమ్మల్ని – మీదైనటువంటి ఆ గమ్యానికి మీదైన మార్గాన్ని కనుగొనేలా చేస్తుంది. అప్పుడు మీరు నడిచే దారి మీ స్వంతమైనదిగా అవుతుంది. మీరు ఇంకొకరి మార్గంలో నడవాల్సిన అవసరం లేదు, మీరు వేరొకరి గమ్యాన్ని చేరుకోవలసిన అవసరమూ లేదు. గమ్యం, మార్గం ప్రతిదీ మీదే కానివ్వండి. అప్పుడు మీరు ఏం చేసినా అది మీ లక్ష్యానికి ముడిపడి ఉంటుంది. అదే నేను చెప్పేది – అర్థవంతంగా ఉండటం. మీ మార్గం అంత అర్థవంతమైనది కానివ్వండి!!!!



*హైదరాబాద్, 1998*



# సద్గురు ప్రేమకక్ష్యలో

**గురువుగారు:**

మీరు ఈ ప్రశ్నను చాలాసార్లు అడిగారు – “అసలు ఇక్కడ ఏమి జరుగుతుంది? మీ మార్గం ఏమిటి? ఇది శరణాగతి పథమే కదా? ఇది ప్రేమ మార్గమే కదా? అలా కాకపోతే మరి ఈ మార్గమేమిటి? అసలు ఏమి జరుగుతోంది?” అని. (గురువుగారు నవ్వుతూ...) ఏమీ జరుగుతున్నట్లు కనిపించడం లేదు కదూ – అది నిజమే! అయస్కాంతానికి, ఇనుపముక్కకు సంబంధించిన ఉదాహరణను నేను మీకు ఇంతకు ముందు చెప్పాను. మళ్ళీ మరొకసారి చెబుతాను. మనమంతా ఆ ఇనుపముక్కల్లాంటి వాళ్ళం. అయస్కాంతానికి, ఇనుపముక్కకు ఉన్న తేడా ఏమిటి? అయస్కాంతం విషయంలో దానిలోని అణువులన్నీ క్రమపద్ధతిలో సరిగ్గా ధృవీకృతమై ఉంటాయి. ప్రతి అణువుకు ఉత్తరధృవం, దక్షిణధృవం ఉంటాయి – వాస్తవానికి

అవి అలా ధృవీకృతం కావించబడివుంటాయి. అయితే ఇనుపముక్కలో అణువులు ధృవీకృతమై ఉండవు, అక్కడ ధృవాలుగానీ, క్రమంగానీ ఉండదు, కాబట్టి ప్రతి అణువు యొక్క అయస్కాంత క్షేత్రానికి మరొక అణువు అయస్కాంతక్షేత్రం ప్రతికూలంగా పనిచేస్తుంది, ప్రతిఘటిస్తుంది. నిజానికి ఇనుములోని ప్రతి అణువు అయస్కాంతత్వాన్ని కలిగివుంటుంది. అక్కడ అయస్కాంతశక్తి ఉంటుంది కానీ అది వ్యక్తం కాదు, నిరోధింపబడుతుంది; అది అణిచివేయబడుతుంది. అయస్కాంతంలో అది వేరే విధంగా ఉంటుంది. పైకి చూస్తే అది సరిగ్గా ఇనుము మాదిరిగానే ఉంటుంది, మార్పేమీ ఉండదు. కానీ ప్రతి అణువు ఓ క్రమపద్ధతిలో, అమరికతో ఉత్తరం నుండి దక్షిణంవైపుకు ధృవీకృతమై, కేంద్రీకరింపబడి ఉంటుంది. మన అంతరంగంలో, మనం కూడా ఆ ఇనుప అణువుల మాదిరిగానే ఉంటాం. మనలో ఓ క్రమంగానీ, కూర్పు కానీ లేని చాలారకాల ఆకర్షణలున్నాయి – ఈ ఆకర్షణలు, కోరికలు అన్నీ ఒకదానితో ఒకటి సంఘర్షించేటటువంటి అణువులవంటివి. “నాకు డబ్బు కావాలి, నాకు సౌఖ్యాలు కావాలి, మంచి ఇల్లు కావాలి, నేను కుటుంబంతో కలిసుండాలి, పాశ్చాత్య దేశాలలోని సౌకర్యాలను నేను అనుభవించాలి, నాకు ఆధ్యాత్మిక ఆనందానుభూతి కావాలి, నాకు నిర్వాణం కావాలి”... ఇలా మనకు ఒకదానితో ఒకటి సమన్వయపడని ఎన్నో కోరికలు పరస్పరం వ్యతిరేక దిశలనుండి మనల్ని లాగుతుంటాయి. ఇలా వివిధ రకాల పాశాలు మనల్ని వివిధ దిశల నుండి లాగుతూ ఉండటం వలన ఆ అయస్కాంతత్వం లేకుండా పోతుంది. కాబట్టి ఓ ఇనుపముక్కను అయస్కాంతం చేయడం ఎలా? దానిని నిరంతరం అయస్కాంతాన్ని (సద్గురువును) అంటిపెట్టుకుని ఉండేలా చేయడం ద్వారా,

అయస్కాంతం మీద తిరిగి తిరిగి రుద్దడం ద్వారా దానిని అయస్కాంతంలా చెయ్యవచ్చు. సద్గురువులో నిబిడీకృతమైన అయస్కాంతత్వం క్రమంగా మనలో ఉన్న వివిధ రకాల ఆకర్షణలను క్రమబద్ధం చేస్తుంది. అంతేకానీ అణువుల సంఖ్యలో ఎటువంటి మార్పు ఉండదు. ఒకవేళ ఆ ఇనుపముక్కలో పదిలక్షల అణువులు ఉన్నాయనుకుంటే వాటి సంఖ్య ఒక్కటి కూడా పెరగదు, ఒక్కటి కూడా తరగదు. అక్కడ సరిగ్గా అదే సంఖ్యలో అణువులుంటాయి, కానీ వాటి దిశ మారుతుంది, వాటి దృక్పథం మారుతుంది, అవి సరైన పద్ధతిలో ధృవీకృతమవుతాయి, సమన్వయం పొందుతాయి. అవి ఓ క్రమంలో కూర్చబడుతాయి. అక్కడ ఈ ఇనుపముక్క ఎటువంటి ఆధ్యాత్మిక అభ్యాసాలు, పద్ధతులు, సాధనలు చేసింది? అసలు ఏమైనా చేసిందా? ఏమైనా మారిందా? నిజం చెప్పాలంటే అది మార్పు చెందింది, అది ఒక అయస్కాంతంగా మారింది. కానీ ఆ మార్పు ఎక్కడ సంభవించింది? ఏం జరిగింది? మార్పుకు కారణం ఇనుపముక్కా లేక అయస్కాంతమా? మనం బట్టలు ఉతికి ఎండలో దండెంపై ఆరేస్తాం. అవి ఆరిపోతాయి, ఎలా? ఎండలో ఉంచడం వలన, అంతే. అవి ఎండలోనే ఉండాలి. మీరు వాటిని ఇంట్లోనో, లేకపోతే ఓ నీళ్ళ బక్కెటలోనో ఉంచితే అవి ఆరతాయా? ఆరవు. మన ప్రయత్నమంతా వాటిని బయట ఎండలో తీగపై వేయడం వరకే. ఇక్కడ కూడా ఇనుపముక్క చేయాల్సిన ప్రయత్నమల్లా అయస్కాంతంతో నిరంతర సాంగత్యంలో ఉండటమే, ఒక్కసారి మాత్రమే కాదు తరచుగా ఉండాలి, "నేను ఓసారి చేశాను, కానీ ఏం జరగలేదు!" అనుకుంటే, అది అలా జరగదు మరి! ఆ పరిణామక్రమంలో ఇనుపముక్క కొంత అసౌకర్యానికి లోనై, "అయ్యో భగవంతుడా, ఇది బాగా ఇబ్బందిగా

ఉంది, నాకది అవసరంలేదు" అనవచ్చు. మళ్ళీ మీరు ప్రయత్నిస్తారు. ముందు ఏదో కోల్పోతున్నట్లు అనిపించవచ్చు. కానీ కొంతకాలం తర్వాత ఇనుపముక్క ఏమీ కోల్పోవడంలేదని మీరు తెలుసుకుంటారు. ఇంకా అదనంగా ఏదీ తోడవడం లేదు – గోళ్ళుకానీ, వెంట్రుకలు కానీ ఏమీ కొత్తగా తోడవడం లేదు (గురువుగారు నవ్వుతూ...) మీరు అంతకు ముందు ఎలా ఉన్నారో అలానే ఉన్నారు, కానీ ఏదో మార్పు కలిగింది. మీరు అయస్కాంతంలా అయిపోతున్నారు.

భక్తుడు:
అంటే (మనలో) ప్రతి కోరిక తప్పనిసరిగా సద్గురు ప్రేమ కోసమై ఉండాలా?

**గురువుగారు:**
అక్కడ జరిగేది అదే. మీకు ఉద్యోగం కావాలి, మీకు బాబా పట్ల గల ప్రేమకు అది అడ్డంకాదు. "బాబా, నాకు ఉద్యోగం కావాలి" అని మీరు అడుగుతారు. ఉద్యోగం వచ్చినపుడు బాబా పట్ల మీకు గల ప్రేమ పెరుగుతుంది. "బాబా నాకు ఉద్యోగం ఇచ్చారు" అనంటారు. మీకు ఆరోగ్యం బాగాలేదు, "నాకు ఆరోగ్యం కుదుటపడాలి" అని మీరు బాబాను అడుగుతారు. మీరు ఆరోగ్యవంతులవుతారు. "బాబా నాకు ఆరోగ్యం ఇచ్చారు" అంటారు. అక్కడ ఎటువంటి సంఘర్షణ ఉండదు. మీ ఆరోగ్యం, మీరు అడగడం, బాబా ఇవ్వడం... ఇవన్నీ ఓ చక్కని కూర్పుతో ఉంటాయి. అవి చక్కని పొందికతో అమరి ఉంటాయి. కాబట్టి మన జీవితం మొత్తం, మనం చేసే ప్రతిదీ, అన్నీ క్రమంగా మార్పు చెంది ఆ వైపుకు (బాబా వైపుకు) కేంద్రీకరించబడుతాయి. మనం కోల్పోయేది ఏమీ ఉండదు. మారేది కూడా ఏమీ ఉండదు. కానీ మొత్తం బాబా వైపుకే కేంద్రీకృతమై ఉంటుంది. అప్పుడు

మనం అనుకునే ఆ ఆధ్యాత్మిక పరిణతీ, మనం అనుకునే ఆ అయస్కాంతత్వం కూడా వస్తాయి. కానీ అది ఏదో కోల్పోవడం వలన మాత్రంకాదు. కాబట్టి మార్గం ఆనందంగా ఉంటుంది – ఇదీ నేను చెప్పేది. నువ్వు దానిని ఇనుపముక్క అయస్కాంతానికి శరణాగతి కావడం అంటావా? లేకపోతే అది కేవలం తాను ఇనుపముక్క కావడం మాత్రం చేతనే తనను తాను అయస్కాంతంగా మార్చుకుంది అనంటావా? లేకపోతే ఇనుపముక్క ఏమీ చెయ్యనప్పటికీ కేవలం తాను అక్కడ ఉండటంమాత్రం చేతనే, అయస్కాంతం దానిని ఇంకొక అయస్కాంతంగా చెయ్యగలదంటావా? కానే కాదు, అది ఆ సాంగత్య ప్రభావం – మనల్ని మనం అటువంటి సాంగత్యంలో ఉంచుకోవడమే కావల్సింది.

**గురువుగారు:**

"మీలో స్వతహాగానే దివ్యత్వం ఉంది; మీరది, మీరిది" అని చాలామంది చెబుతూంటారు, కానీ నిజానికది మనకు తెలియదు. అదేదో మనలో ఉంది కానీ మనకది అనుభవంలోనికి రాదు. ఇనుపముక్క స్వతహాగానే ఒక అయస్కాంతం కూడా. కానీ దాని అయస్కాంతత్వాన్ని అది వ్యక్తపరచడంగానీ, అనుభూతి చెందడంగానీ చేయదు. ఓ ఇనుపముక్క అయస్కాంతంగా ఎలా మారుతుందో మన విషయంలో కూడా అలానే ఉంటుంది. దానికి మార్గమేమిటంటే మనం ముందు ఒక అయస్కాంతం కోసం అన్వేషించాలి – మన విషయంలో అయస్కాంతమంటే సద్గురువు. అయస్కాంతానికి, ఇనుపముక్కకు (సాధకునికి) గల తేడా ఏమిటి? మౌలికమైన

తేడా ఏమిటంటే – అయస్కాంతంలోని క్రమత, అది సాధించిన సమన్వయం. అవి ఇక్కడ ఇనుపముక్కలో ఉండవు. అందుకనే సద్గురువు వైపు నుండి చూస్తే ఆయనకంతా సమంగానే ఉంటుంది. ఆయన ఆ పరిపూర్ణ సామరస్యాన్ని సాధించారు, అందుకే ఆయన ఏ భేదాన్నీ చూడరు. కానీ సాధకుని దృక్పథం అలా ఉండదు, “లేదు, లేదు, లేదు! మేమంతా ఇనుపముక్కలం, మీరు అయస్కాంతం” అని అంటారు.

**భక్తుడు:**

ఆ అయస్కాంతశక్తి ప్రేమ వంటిదేనా?

**గురువుగారు:**

అవును ప్రేమే. ఒక ఇనుపముక్క అయస్కాంతం వైపుకు ఆకర్షింపబడినట్టుగానే, సాధకుడు సద్గురువు వైపుకు లాగబడతాడు. మనిషి అనే ఈ ఇనుపముక్కలో ఆ అయస్కాంతత్వం ప్రేమలాగా అనుభవమవుతుంది.

**భక్తుడు:**

సద్గురువు అయస్కాంతత్వాన్ని ఇస్తారా?

**గురువుగారు:**

అది ఇవ్వడం కాదు. అయస్కాంతత్వం ఇనుపముక్కలో అంతకు మునుపే ఉంది. ఆయన దానిని కేవలం ఉత్తేజపరుస్తారు. ఇంకో విధంగా చెప్పాలంటే సద్గురువు కేవలం అణువుల అమరికను ఒక నిర్ణీతక్రమంలోనికి తీసుకురావడం మాత్రం చేతనే సాధకుడు తను మొదటి నుంచే అయస్కాంతమని గ్రహిస్తాడు.

**గురువుగారు:**

ఇనుపముక్కను అయస్కాంతంగా చేసేదెలా? నువ్వు దేనినైతే అయస్కాంతం అనుకుంటావో నిరంతరం దాని సాంగత్యంలో ఉంచడం వలన. మనకు బాబానే ఆ అయస్కాంతం. మానసికంగా ఆయనకు చేరువగా ఉండటానికి ప్రయత్నించండి, వీలైతే భౌతికంగా కూడా ఆయనతో సన్నిహితంగా ఉండండి. రమణమహర్షి వంటి గొప్ప మహాత్ములు కూడా బోధించింది అదే. వాస్తవానికి రమణమహర్షి చాలా రమణీయంగా అరుణాచలాన్ని అయస్కాంత పర్వతం అన్నారు. ఆయన ఎంతగా ఆకర్షితులయ్యారంటే అక్కడకి వచ్చిన తరువాత ఆయన ఆ ప్రదేశాన్ని మరి వదలిపెట్టలేదు, ఆయన తామే ఒక అయస్కాంతంగా మారిన తరువాత కూడా ఆయన దానిని వదలలేదు. అరుణాచలం ఆయన అయస్కాంతం. ఓ ఇనుపముక్కలాగా దానిని ఆయన అంటిపెట్టుకున్నారు. రమణ మహర్షి వంటి గొప్ప సిద్ధులు, మహాత్ముల యొక్క ఆచరణే ఇలా ఉన్నప్పుడు, ఇక మన సంగతేంటి? ఆయన ఎప్పుడూ తమ సద్గురువు పాదాలచెంతనే ఉండాల్సిన అవసరముందా? "ఇది నా గురుస్థానం, నేను ఇక్కడే ఉంటాను" అని బాబా తమ గురువు సమాధి వద్దనే ఉండిపోవాల్సిన అవసరముందా? వారు మనకు దారి చూపించారు: మీ గురువే మీ అయస్కాంతం అని. బాబా మనందరి అయస్కాంతం. మనకు బాబా గురువు. మనమందరం ఇనుపముక్కలవంటి వాళ్ళం. మన చేతలతో, ఆలోచనలతో మనకున్న సమస్తంతో ఆ అయస్కాంతాన్ని అంటిపెట్టుకుందాం – అప్పుడు మనమూ అలా తయారవుతాం! అర్థమైందా?

**భక్తుడు:**

సద్గురువు యొక్క ప్రత్యక్షసన్నిధిలో ఉండలేనివారు, వారి సద్గురువును నిరంతరం అంటిపెట్టుకుని ఉండటానికి గల ఇతర మార్గాల గురించి, వాటిలోని ఆంతర్యం గురించి కాస్త వివరిస్తారా?

**గురువుగారు:**

నిజంగా అంటిపెట్టుకుని ఉండటమంటే ఆ అయస్కాంతక్షేత్రంలో ఉండటమే. నిజానికి ఇనుపముక్కను అయస్కాంతంగా మార్చేది ఆ అయస్కాంతం కాదు, దాని క్షేత్రం. కొంతమందికి సద్గురు సాన్నిధ్యం దొరకనపుడు, వారికి ఓ ఎక్స్‌టెండర్ (Extender, ప్రచోదకం) కావాలి. ఉదాహరణకు, కంప్యూటర్ ఉందనుకుందాం, వైర్‌లెస్ మోడెం ఎక్కడో మొదటి అంతస్తులో ఉందనుకుందాం, మీకిక్కడ క్రింద దాని సిగ్నల్ అందదు, అప్పుడు మీరు ఏం చేస్తారు? ఇక్కడ తరంగశక్తిని పెంచడానికి మరొక మోడెం పెడతారు, అది ఆ తరంగబలాన్ని మరింతగా పెంచుతుంది, అంతే. అది ఏదైనా సరే, మిమ్మల్ని ఆ తరంగక్షేత్రంలో ఉంచగలగాలి. మీరు ఆ క్షేత్రంలో ఉన్నారా లేదా అన్న విషయం ఎవరికి వారు రకరకాల మార్గాల్లో అన్వేషించుకోవాలి. నేను వాటిని ఫలానా అని చెప్పదల్చుకోవట్లేదు. నేను చెప్పేది వినే బదులు మీరే అన్వేషించండి.

**భక్తుడు:**

అంటే మీ ఉద్దేశ్యం ఆ శక్తిక్షేత్రంలో అనా?

**గురువుగారు:**

అవును, ఆ పోలికలో అది శక్తి క్షేత్రమే. అది మరొకటి కూడా కావచ్చు. అది ఓ ప్రేమ క్షేత్రం కూడా కావచ్చు, ఎందుకంటే నిజానికి ఇక్కడ

ప్రభావితం చేసేది ఆ ప్రేమే. ఇనుపముక్కల విషయంలో అయితే అది కేవలం ఆ అయస్కాంతశక్తి యొక్క ఆకర్షణే. కానీ మనం ఇనుపముక్కలం కాదు, మనం మనుషులం. మనకు హృదయముంది, అందులో భావోద్వేగాలున్నాయి. మనలో ప్రేమ ఉంది, మనలో ద్వేషం ఉంది. కాబట్టి మనం ఆ క్షేత్రాన్ని ప్రేమ అనే భావోద్వేగంలా అనుభూతి చెందుతాం. ఎక్కడైతే ఆ భావోద్వేగం మరింతగా ప్రజ్వరిల్లుతుందో, అది మరింత పెరిగి బలీయమవుతుందో, మీరు ఎక్కడైతే దానిని మరింతగా అనుభూతి చెందగలుగుతారో, అదీ ఆ క్షేత్రం.

భక్తుడు:
ప్రతి ఒక్కరికీ సద్గురు ప్రత్యక్షసాన్నిధ్యంలో ఎల్లప్పుడూ ఉండటం అవసరముంటుందా?

**గురువుగారు:**
అది అవసరమైనా, కాకపోయినా – మనకున్న ఇతర వ్యామోహాల వలన మనం అక్కడ ఉండలేము. నిజం చెప్పాలంటే అవసరంలేదు.

భక్తుడు:
మనస్సు సద్గురు రూపంపై లగ్నమయిన తరువాత, ఆయన చాలా దూరంలో ఉన్నా ఆయన సాన్నిధ్య ప్రభావం ఉంటుంది కదా? కొన్ని సందర్భాలలో భక్తుడు దూరంగా వెళ్ళినా, సద్గురు సాన్నిధ్యప్రభావం లోనే ఉన్నామన్న ప్రగాఢమైన గుర్తింపు ఉంటుంది.

**గురువుగారు:**
అలా అయితే వారు సద్గురు సాన్నిధ్యంలోనే (ఆ అయస్కాంతక్షేత్రం లోనే) ఉన్నారు. మీరు చాలా మైళ్ళదూరంలో ఉన్నారు అనుకుంటేనే

మీరు చాలా దూరంలో ఉన్నట్టు. (నవ్వులు...) కానీ మీకు గురువు యొక్క సాన్నిధ్యప్రభావం అక్కడ కూడా అనుభవమవుతుంటే మీరు ఆయననుండి నిజంగా దూరంగా వెళ్ళినట్లు కాదు. సద్గురువు యొక్క శక్తి అంతవరకు వ్యాపించి ఉందా లేదా అనేది కాదు సమస్య, మనం దాన్ని అనుభూతి చెందగలుగుతున్నామా లేదా అనేదే సమస్య. ఒక అయస్కాంతాన్ని ఇనుపముక్కను కొంతదూరంలో పెడితే అక్కడ అయస్కాంత ఆకర్షణ ఉన్నా అది ఇనుపముక్కను దగ్గరకు లాగలేదు. మీరు వాటిని ఇంకాస్త దగ్గరకు జరిపారనుకోండి, అప్పుడు ఇనుపముక్క ఆకర్షింపబడుతుంది. దానర్థం అంతకుముందక్కడ అయస్కాంత ఆకర్షణ లేదని కాదు, ఇనుపముక్కపై మిగతా ఆకర్షణల బలం ఎక్కువగా ఉంది అందుకని ఇనుపముక్క ఆకర్షింపబడలేదు. ఇనుపముక్కను దగ్గరకు తీసుకువచ్చిన ఆ క్షణంలో అది ఆ అయస్కాంతత్వాన్ని అనుభవిస్తుంది. బాబా స్వయంగా చెప్పింది కూడా అదే! ఆయన తమ సద్గురువు మీదనే దృష్టి నిలిపి అలా చూస్తూ పన్నెండు సంవత్సరాలపాటు కూర్చున్నారు. తాము ఎక్కడున్నా సరే తమ గురువు తమను ఎల్లప్పుడూ ప్రేమించేవారని, రక్షించేవారని బాబా చెప్పారు. ఆయన గురువు ఆయనను ఇక బయలుదేరమని చెప్పినపుడు బాబా ఆ అనుభవంతో, ఆ ఎరుకతో బయలుదేరారు.

**గురువుగారు:**

ఒక ఇనుపముక్కకు, అయస్కాంతం పట్ల గల ఆకర్షణ ప్రేమగా అనుభవమవుతుంది. ఆ ఇనుపముక్క అయస్కాంతాన్ని ప్రేమిస్తుంది. అందుకనే అది ఎప్పుడూ అయస్కాంతానికి దగ్గరగా జరుగుతూ

ఉంటుంది. అయస్కాంతం విషయానికి వస్తే, ఇనుపముక్క తనను ప్రేమించిన దానికంటే ఎక్కువగా అది ఇనుపముక్కను ప్రేమిస్తూ ఉంటుంది. అందుకనే ఇనుపముక్కను అయస్కాంతం దగ్గరకు లాక్కుంటుంది. నిజానికి దగ్గరకు లాక్కునేది అయస్కాంతమే, క్రియాశీలంగా ఉండేదీ అయస్కాంతమే. కానీ అయస్కాంతం ఏ కదలికా లేకుండా ఉండి, ఇనుపముక్క దానివైపుకు జరుగుతూ ఉంటుంది కాబట్టి ఇనుపముక్కే క్రియాశీలకంగా ఉన్నట్లనిపిస్తుంది. కానీ దానిని కదిలించేది అయస్కాంతమే. అందువలన అది స్థిరంగా ఉంటూనే క్రియాత్మకమైనదిగా ఉంటుంది.

అందుకనే నాకు, అరుణాచలాన్ని అయస్కాంతమని రమణ మహర్షి చేసిన వర్ణన చాలా చక్కగా సరిపోయిందనిపిస్తుంది. ఆయన దానిని అయస్కాంత పర్వతం అనేవారు, ఓ గొప్ప అయస్కాంతం అని చెప్పేవారు. ఈ దృష్ట్యానే ఆయన అలా చెప్పారనుకుంటాను. అరుణాచలం ఎలాగైతే ఆకర్షిస్తుందో బాబా వద్ద కూడా అలానే జరుగుతుంది. ఒకవేళ మీరు మీలోని జడత్వాన్ని, క్రమరాహిత్యాన్ని వదిలించుకుని అయస్కాంతీకరింపబడాలని, ఆ పరిపూర్ణ సామరస్యాన్ని పొందాలని అనుకుంటే మిమ్మల్ని మీరు ఆ అయస్కాంతక్షేత్ర పరిధిలో ఉంచుకోవాలి.

భక్తుడు:

ఇనుపముక్క ఆ అయస్కాంత ప్రభావక్షేత్రంలో ఉంటే సరిపోతుందా? లేదా అది అయస్కాంతాన్ని స్పృశించాల్సిన అవసరముందా?

**గురువుగారు:**

ఆ ప్రభావక్షేత్రంలో ఉంటే సరిపోతుంది. అది చాలు. మిగతాది ఆయన చూసుకుంటారు.

**భక్తుడు:**

అయస్కాంతాన్ని స్పృశించకుండా కేవలం ఆ కక్ష్యలో (ప్రభావక్షేత్రంలో) ఉండి సంతృప్తి చెందవచ్చా?

**గురువుగారు:**

ఆ అసంతృప్తి నిజంగా ఉంటే, నువ్వు మరింత దగ్గర కక్ష్యలలోనికి (పరిధులలోనికి) లాగబడుతూ ఉంటావు. చివరికి నువ్వు ఆ సూర్యునిలో (సద్గురువులో) కలసిపోతావు. సూర్యునితో ఏకత్వాన్ని పొందుతావు. అప్పుడు అసలు కక్ష్య (పరిధి) అంటూ ఏమీ ఉండదు.

**గురువుగారు:**

మీరు చెప్పినట్టుగా, "పరిమిత లక్ష్యాలు, చిన్న లక్ష్యాలు, స్వల్పమైన ఆకర్షణలు..." ఇలా ఇప్పుడు మీ హృదయంలో అటూ ఇటూ లాగుతున్న ఎన్నో కోరికలు, ఎన్నో అవసరాలు ఉన్నాయి. మన హృదయమంతా ఇటువంటి చిన్న చిన్న అణువులతో నిండివుంది, కానీ ప్రతి అణువు మరొకదానితో సంఘర్షిస్తోంది. ఒక అయస్కాంతంతో సాంగత్యం ఏర్పడటం ద్వారా, ఈ అటూ ఇటూ లాగే ఈ విషయాలన్నీ ఓ నిర్దిష్టమైన పొందికతో, క్రమబద్ధంగా అమరుతాయి. ఏమీ కోల్పోవడంగానీ, ఏదీ తోడవ్వడంగానీ లేకుండానే నీకు ప్రయోజనం కలుగుతుంది! నువ్వు అయస్కాంతం అయిపోతావు! ఆ అయస్కాంత శక్తిని పొందుతావు. అప్పుడు ప్రతిదీ పరిపూర్ణమయిన పొందికతో, కూర్పుతో ఉంటుంది. అదే అనుగ్రహం. తనకు తానుగా ఇనుపముక్క ఏమీ చెయ్యగలిగే స్థితిలో లేదు, అందుకని దానికి ఒక అయస్కాంతం కావాలి. ఆ అయస్కాంతాన్నే సద్గురువు అంటారు. బాబా అటువంటి

అయస్కాంతం. మనమంతా ఇనుపముక్కలం. ఆయన గురించి నిరంతరం చింతన చేయడం ద్వారా, ఆయన సాన్నిధ్యం వలన, ఆయన సాంగత్యం వలన మనమనే ఈ ఇనుపముక్కను ఆనంద భరితమైన, సంతృప్తికరమైన, సామరస్యపూరిత మార్గం ద్వారా ఒక అయస్కాంతంగా చేసుకుంటాం. పరిపూర్ణ ఆనందం పొందడమనేది మన లక్ష్యం, మనం ఆ వైపుకు వేగంగా పరుగెడుతున్నాం, మనం దానిని పొందినపుడు అది అనుగ్రహమవుతుంది. మన పరుగును అనుగ్రహంగా మలిచేటటువంటి కారకమే గురువు!



తెనాలి, 1993



# నియమం

**భక్తుడు:**

గురువుగారూ! ఏదో ఒక గొప్ప కార్యం సాధించడం కన్నా, ఒక మంచి పనిని నిలకడగా, స్థిరంగా చెయ్యడమే ఉత్తమమని ఎక్కడో చెప్పగా విన్నాను.

**గురువుగారు:**

అవును. అదే నియమం.

**భక్తుడు:**

అయితే ఒక నిర్దిష్టమైన నియమం పెట్టుకోవడం వలన ప్రయోజనం ఏమిటి?

**గురువుగారు:**

నియమం నిన్ను నీ మనస్సు చేతిలో మోసపోనివ్వదు, ఎందుకంటే అది నీకు నీ లక్ష్యాన్ని, ధ్యేయాన్ని గుర్తుచేస్తూ ఉంటుంది, నీ లక్ష్యం వైపు

నువ్వు మరింతగా లగ్నం కాగలవు. మనస్సెప్పుడూ ఊగిసలాడుతూ, చంచలంగా ఉంటుంది. మనస్సు, "ఈ రోజు సత్సంగం ఉంది... కానీ నాకు ఈ రోజు ఇంట్లోనే ధ్యానంలో కూర్చోవాలని ఉంది. ఇప్పుడు వెళ్ళి మనస్సును బహిర్ముఖం చేసుకోవడం, పదిమందిలో కూర్చుని ఆ చెమట వాసన భరించడం వంటివి నాకిష్టంలేదు. (నవ్వులు...) అందుకే నేనివాళ సత్సంగానికి వెళ్ళను, ఇంట్లోనే కూర్చుని మనస్సును అంతర్ముఖం చేసుకుంటాను" అని అనుకుంటుంది. ముందు అది అలానే మొదలవుతుంది.

రెండవ రోజుకు మన సంకల్పం మరింత బలహీనపడుతుంది. సత్సంగాన్ని తప్పించుకోవడానికి మన మనస్సు వేసే ఎత్తులే ఇవన్నీ. మన మనస్సును సులభంగా ఒప్పించడానికి, ముందు ఇటువంటి ఉదాత్తమైన కారణాలతోనే సంకల్పం వికల్పం కావడం మొదలవుతుంది, అందుచేత అది సమర్థనీయమనిపిస్తుంది. తరువాత ఆ రెండవ రోజు ఆ వ్యక్తి నిద్రపోతాడు. మూడవ రోజు సినిమాకు పోతాడు. నాలుగవ రోజు పిచ్చాపాటీ మాట్లాడుకోవడానికి వెళతాడు. ఇంక సత్సంగం ఎక్కడ? అది అంతటితో అయిపోయింది. ప్రతి విషయంలోనూ ఇలానే జరుగుతుంది. కాబట్టి నియమం నిన్ను నీ మనస్సు చేతిలో మోసపోనివ్వదు. మోసం చేసేది దేనిని? నీ లక్ష్యం నుండి దూరంచేసి నీదైన ఆనందం వైపుకు వెళ్ళనీయకుండా నిన్ను మోసం చేస్తుంది. ఇవన్నీ మనస్సు చేసే జిత్తులు. మీరు నిరంతరం సత్సంగం అనే స్థితిలో ఉండేంతవరకు నియమం అవసరం. క్రమం తప్పకుండా, ఆరునూరైనా ఆ నియమాన్ని అంటిపెట్టుకోవడమూ అవసరం.

**గురువుగారు:**

నియమం అంటే – మీరు ఏమి చెయ్యాలో అది, ఒక విధివిధానం.

**భక్తుడు:**

అది విధుల (commandments) వంటిదా లేక ప్రవర్తనా నియమావళి (code of conduct) వంటిదా?

**గురువుగారు:**

అవును. అది ఒక రకమైన ప్రవర్తనా నియమావళే. యోగశాస్త్రాలలో దానిని అలాగే నిర్వచించారు.

**భక్తుడు:**

ఈ నియమాలను పాటించాలంటే ఆ పాటించే వ్యక్తికి విచక్షణాజ్ఞానం, ఎంపిక చేసుకోగల సామర్థ్యం ఉండాలి కదా!

**గురువుగారు:**

అందుకనే మీకు నచ్చిన లక్ష్యమంటూ ఒకటి ఉండాలని నేను మీకు ఎప్పుడూ చెబుతుంటాను. మొత్తం మీద మనం చేయవలసిందల్లా, మనకు ప్రీతికరమైన ఆ విషయం మీద దృష్టిపెట్టడమే. మన దృష్టిని దాని మీద లగ్నం చేసుకోవడానికి మనం ఏమి చెయ్యాలి? దీనిని మీరే నిర్ణయించుకోవాలి. మనం ఏవి చెయ్యకూడదు, మన దృష్టిని మరల్చేటటువంటివి ఏమిటి? అనే విచక్షణ మీకు తప్పనిసరిగా ఉండాలి. మీరు ఏం చెయ్యాలి, ఏం చెయ్యకూడదు అని చెప్పడానికి మీకు ఏ శాస్త్రము అవసరం లేదు. ఎందుకంటే అది మీ అనుభవం కాబట్టి మీకు తెలుస్తుంది.

**భక్తుడు:**

మీ ఉద్దేశ్యం అది (నియమం) ఒక రకమైన క్రమశిక్షణలా కాకుండా మన ప్రేమ వలన వస్తుందనా?

**గురువుగారు:**

అవును. అప్పుడు అవి నియమనిబంధనలలాగా, విధులలాగా కనిపించవు. అవి అలాంటివి కాదు. నేను మిమ్మల్ని "ఉదయాన్నే ఈ గోడ దగ్గర నుండి ఆ గోడ దాకా పదిసార్లు నడవమని" ఊరకనే చెప్పాననుకోండి, అది ఎందుకు చేస్తున్నారో మీకు తెలియకపోయినా సరే, మీరు చేసి తీరాలి అనుకున్నప్పుడు అది విధి అవుతుంది. మీరు ఎందుకు చేస్తున్నారో, ఏమి చేస్తున్నారో మీకు చెప్పలేదు. కానీ ఇక్కడ మీరు నిర్ణయించుకోవాలి. ఈ పని నాకు ఇష్టమైన లక్ష్యం పట్ల దృష్టిని నిలుపుకోవడానికి ఉపయోగపడుతుందా? లేదా? అనే వివేచన ప్రతిక్షణం ఉండాలి. నాలో తెలిసీతెలియనట్లుగా ఉన్న ఆ ఆనందమనే భావనను స్పష్టం చేసుకునేదానికి ఇది సహాయపడుతుందా? అని మనం దానిని ఎప్పుడూ తరచి చూసుకుంటూనే ఉండాలి.

**గురువుగారు:**

నేను 1971వ సం॥లో మాస్టర్‌గారిని మొదటిసారి కలుసుకొన్నాను. తర్వాత ఆయన నాతో "సత్సంగం బాధ్యతలు తీసుకో" అన్నారు. దానర్థం ఏమిటంటే ఆ గదిని, బాబా ఫోటోలను సత్సంగానికి సిద్ధం చేయడం మాత్రమే. బాబా ఫోటోలు అలమరాలో ఉండేవి, వాటిని బయటకు తీసిపెట్టి పూలమాలలు వేయాలి. అది మామూలు సత్సంగం. మాస్టర్‌గారు 'దీని నిర్వహణా బాధ్యతలు నీవి' అన్నారు.

ఆరు సంవత్సరాలపాటు, నేను పూండీలో గడిపిన రోజులలో తప్ప[1], ప్రతి గురువారం నేను ఆ బాధ్యతలు నిర్వర్తించాను. అది ఒక నియమం. కనీసం ఒక్కసారి కూడా నేను దానిని వదలిపెట్టలేదు. ఒకవేళ వరదలు వస్తాయనుకుంటే నేను ముందుగా అయిదు గంటలకే బల్లకట్టు మీద విద్యానగర్ వెళ్ళేవాడిని. గాలివానలు, తుఫానుల వంటివి వచ్చినపుడు బస్సులుండేవి కాదు, నడిచే వెళ్ళేవాడిని. 104, 105 డిగ్రీల జ్వరం ఉన్నా సరే వెళ్ళేవాడిని. ఏం జరుగుతుంది? మహా అయితే నేను చచ్చిపోతాను, అంతేకదా? అంతకు మించి ఏమైనా జరుగుతుందా? ఏమీ జరగదు, వెళ్ళాల్సిందేనని ఆ ఆరు సంవత్సరాలలో నేను ఒక్కసారి కూడా వెళ్ళకుండా ఉండలేదు.

నేను వెంకటగిరికి వచ్చిన తరువాత కూడా, ప్రారంభంలో నేను ప్రతి గురువారం విద్యానగర్‌కు వెళ్ళి సత్సంగం చేస్తుండేవాడిని. మాష్టర్‌గారు నన్ను ఆ బాధ్యతలనుండి తప్పించేదాకా అది అలాగే కొనసాగింది. ఆయన, “వద్దు, నువ్వు ఇక ఇక్కడికి రావలసిన అవసరంలేదు, వెంకటగిరిలోనే సత్సంగం చెయ్యి” అని చెప్పారు. అందుకని నేను వెంకటగిరిలో సత్సంగం ప్రారంభించి దానిని అక్కడ కొనసాగించాను. ఒక్కసారి కూడా క్రమం తప్పలేదు. నేను ఏదైనా చెయ్యాలని ఒక్కసారి అనుకుంటే... ఇక వేరే ప్రశ్నే లేదు! “చనిపోవడానికి మించి ఇంకేమన్నా జరుగుతుందా? అలాంటప్పుడు దానికి సిద్ధంగా ఉండాలి” అని అనుకునేవాడిని. నువ్వు చెయ్యాలనుకున్న దాన్ని చేసేస్తే ఏమీ జరగదు, అలా కాకపోతే అసలు చెయ్యాలనే అనుకోవద్దు.

---

*[1] గురువుగారు 1974లో సుమారు ఓ నెలరోజులపాటు శ్రీపూండీస్వామివారి సన్నిధిలో గడిపారు. శ్రీస్వామివారి సన్నిధిలో గడిపిన ఆ సమయం గురువుగారికి అత్యున్నత ఆధ్యాత్మిక అనుభవం సిద్ధించడంతో ఫలప్రదమయింది.*

"దాని ద్వారా నేను ఏమి సాధిస్తాను, నేను ఎందుకు చెయ్యాలి, కోట నుండి విద్యానగర్ దాకా అంతదూరం శ్రమపడి నడిచిపోవడం ద్వారా నేను ఆధ్యాత్మికంగా ఏమైనా ప్రయోజనం పొందుతున్నానా?" ఇలా ఎప్పుడూ ఆలోచించేవాడిని కాదు. (అప్పుడు నేను విద్యానగర్‌లో ఉండేవాడిని కాదు, రాత్రి సమయాలలో విద్యానగర్ నుండి మా ఇంటికి వెళ్ళాలంటే ఆరు కిలోమీటర్లు నడవవలసి వచ్చేది.) నేను ఏమి పొందాను... ఏమి పొందలేదు... ఆ విషయాలన్నింటి గురించి ఆలోచించేవాడిని కాదు. ఒకవేళ ఏదైనా చేస్తుంటే దానినలా చెయ్యడమే. అంతే!

నా మనస్సు నన్ను ఎప్పుడూ మోసపుచ్చడానికి ప్రయత్నించలేదు. ఒకవేళ అది నన్ను మోసం చెయ్యాలని చూస్తే, నేను రెండు పనులు చేసేవాడిని. చలికాలంలో ఒకవేళ నేను వేకువన మూడు గంటలకు నిద్రలేచి చన్నీళ్ళతో స్నానం చెయ్యాలని నిశ్చయించుకుంటే, కొన్నిసార్లు "మూడు గంటలకా... చలిగా, చాలా చలిగా ఉంటుంది, అబ్బా, అయినా నేను నిద్ర లేవాలా!" అని ఆలోచన వచ్చేది. ఆ ఆలోచన నా మనస్సులోకి వచ్చినపుడు "ఓహో, నువ్వు నన్ను మోసం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నావా? అయితే రా" అనుకునేవాడిని. తరువాత రోజు నేను ఏంచేసేవాడినంటే, ఓ కుండలో నీళ్ళు పోసిపెట్టి, అనుకున్న దానికంటే ఇంకాస్త ముందుగా అంటే 2.45 గంటలకే లేచి గడ్డకట్టించే ఆ చల్లని నీటితో స్నానం చేసేవాడిని. ఇంకోసారి మనస్సు కనీసం ఆ ఆలోచన చెయ్యడానికి కూడా ప్రయత్నం చెయ్యలేదు. (నవ్వులు...) ఆపై కనీసం అటువంటి ఆలోచన కూడా రాదు, ఎందుకంటే నేను ఏమి చేస్తానో దానికి తెలుసు. వేకువఝామున 3 గంటలకు నిద్రలేవడం, ఆ కుండలో నీళ్ళతో స్నానం చెయ్యడం

ఇవన్నీ చూసి నన్ను అందరూ వెర్రివాడిననుకునేవారు. (గురువుగారు చిన్నగా నవ్వుతూ…)

**భక్తుడు:**

అది ఓ ప్రయత్నంలాగా అనిపించేదా?

**గురువుగారు:**

అది ఏదైనా సరే, ప్రయత్నమంతా నా మనస్సు నన్ను మోసం చెయ్యకుండా చూసుకుంటూ, తక్షణం దానికి బుద్ధిచెప్పడం, అంతే! తరువాత కొంతకాలానికి అది నన్ను మోసం చెయ్యడానికి కనీసం ప్రయత్నంకూడా చెయ్యలేదు: “ఈరోజు విద్యానగర్ బస్సు మిస్సయ్యాను, సరే రేపు వెళదాంలే…” అన్న ఆలోచన వచ్చిందంటే, ఆ రోజు నేను విద్యానగర్ నుండి కోటకు రెండుసార్లు నడిచేవాడిని, (గురువుగారు నవ్వుతూ…) “ఆహాఁ, నువ్వు బస్సు మీద ఆధారపడుతూ ఉన్నావుగా, సరే ఉండు… నీ సంగతి చూస్తా!” అని.

**భక్తుడు:**

ఆ మందు మనస్సు మీద పనిచేసిందా?

**గురువుగారు:**

అవును. అది తప్పకుండా పనిచేస్తుంది. పనిచేయకుండా ఎందుకు ఉంటుంది? (నవ్వులు…)

**భక్తుడు:**

వేరే వ్యక్తికి శిక్షణ ఇచ్చినట్లు?

**గురువుగారు:**

దానిని నువ్వు ఎలా పిలిచినా సరే. నేను అవన్నీ ఆలోచించేవాడిని కాదు. నేను మోసపోకూడదు అన్న ఒక్క విషయాన్నే నేను

పట్టించుకునేవాడిని. వేరే వాళ్ళు నన్ను మోసం చెయ్యవచ్చు, నన్ను నేను మోసం చేసుకోవడంలో అర్థమేముంది. ఆత్మవంచన చేసుకోవడం – కనీసం నేను దానినైనా ఆపవచ్చు. అయినా ఈ విషయాలన్నీ మీకు చెప్పదలుచుకోలేదు, ఇవన్నీ మీకు చాలా భయంగా అనిపిస్తాయి. (నవ్వులు...) ఇవన్నీ మీరు చెయ్యాల్సిన అవసరం లేదు.

**భక్తుడు:**

గురువుగారూ! గాలివాన వచ్చినప్పుడు, బస్సు రానప్పుడు... ఇలాంటి సమయాల్లో నియమభంగం కలుగకుండా ఉండేందుకు ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చేది కదా?

**గురువుగారు:**

ఇబ్బందులు ఎదుర్కొనేందుకు ప్రయత్నమంటూ ఉంది, కానీ ఆ ప్రయత్నమంతా మనస్సు చేతిలో మోసపోకుండా ఉండటం కోసమే, అంతే. అంతవరకే! నియమం గురించి, దాని విలువ గురించి, దానిని పాటించడం... వీటి గురించిన సందేహమేమీ లేదు. నేను చెప్పిన ఉదాహరణలు మన మనస్సు మనల్ని మోసం చెయ్యకుండా చూసుకునేంతవరకే. అంతే! కేవలం అంత ప్రయత్నమే (అవసరం).

**భక్తుడు:**

కానీ అప్పటి మీ ఉద్దేశ్యం మాత్రం మీ నియమానికి భంగం కలుగకూడదనే కదా?

**గురువుగారు:**

అది నియమం పట్ల మాత్రమే కాదు. మిగతా విషయాలలో కూడా,

మనస్సు నన్ను మోసం చెయ్యకుండా చూసుకోవడం. నియమం విషయంలో నీకు తరచి చూసుకోవడానికి ఒక ప్రమాణం ఉంటుంది కాబట్టి అది స్పష్టంగా కనిపిస్తుంది. అది మనల్ని ఎక్కడ మోసం చేస్తుందో తెలుస్తుంది. అలా కాకపోతే మనకు తెలియదు. మనం మన మనస్సు చేతిలోనే మోసపోతాం. మనల్ని మోసం చెయ్యడానికి, ప్రలోభపెట్టడానికి, మాయలో పడెయ్యడానికి వేరే వాళ్ళు అవసరం లేదు; మనల్ని మనమే మోసం చేసుకోగల సమర్థులం మనం.

భక్తుడు:
గురువుగారూ! ఆ నియమాన్ని పాటించడం వలన అది మిమ్మల్ని మీ లక్ష్యానికి దగ్గర చేస్తుందని మీకెలా తెలుసు?

**గురువుగారు:**

నాకు తెలియదు.

భక్తుడు:
కానీ అది మీకు తప్పకుండా తెలిసే ఉండాలి, లేకపోతే మీరు దానిని (నియమాన్ని) ఎందుకు అంటిపెట్టుకున్నారు?

**గురువుగారు:**

నాకు తెలియదు. "నా గురువుగారు నాకు ఈ బాధ్యత అప్పగించారు" అని మాత్రమే అనుకున్నాను. అది ఆయన ఆశీర్వచనంగా భావించి నేను చేశాను. అంతే. అదే నన్ను నా లక్ష్యం వైపుకు నడిపిస్తుంది. బాబాకు సంబంధించినది ఏది చేసినా సరే అది నన్ను నా లక్ష్యం వైపుకు తీసుకెళుతుంది. అది ఎలా తీసుకెళుతుంది? అనే దాని గురించి

నేను పట్టించుకోలేదు. అది ఆయన సమస్య, దాని గురించి నేనెందుకు బాధపడాలి? ఒకవేళ అది సరిపోకపోతే, అది ఆయన పొరపాటు, నా పొరపాటు కాదు. (నవ్వులు...) నేను మాత్రం (ఆయన చెప్పినట్టు) చేస్తాను. అంతే.

**భక్తుడు:**

ఈ మధ్య సత్సంగంలో ఒకరు "ఇప్పుడు మీరు అనుభవిస్తున్న ఈ ఆనందాన్ని మీరెలా పొందారు? అని మిమ్మల్ని అడిగారు. దానికి మీరు "నేను చెయ్యవలసింది చేశాను, బాబాను ప్రార్థించాను" అని చెప్పారు. మీరు ఏమి చెయ్యాలో మీకు ఎలా తెలుసు?

**గురువుగారు:**

నేను చెయ్యవలసిన దాంట్లో నా ఎంపికంటూ ఏమీ లేదు, బాబా మీద దృష్టి పెట్టాలి. అంతే! అదే నేను చెయ్యవలసింది. మనం ఏదైనా చెయ్యాల్సి వచ్చినపుడు మనం ఎంపిక చేసుకునేది ఏమీ ఉండదు. నాకు వేరే అవకాశం లేదు, నేను దానిని (బాబా మీద లగ్నమవడం) చెయ్యాల్సి వచ్చింది.

**భక్తుడు:**

అంటే మీరు బాబా మీద లగ్నంకాకుండా ఉండలేకపోయేవారా?

**గురువుగారు:**

అంతకుమించి నేను చెయ్యగలిగింది ఏముంది? నేను వేరే పనులు చెయ్యడానికి ప్రయత్నించాను, కానీ ఎందుకనో నా మనస్సు వాటి మీదకు పోవడంలేదని గ్రహించాను.

భక్తుడు:

గురువుగారూ! మన బలహీనమైన స్థితిని అధిగమించడానికి మనం చేసే ప్రయత్నాలు కూడా ఆ బలహీన పరిస్థితిలో నుంచే ఉద్భవిస్తాయని, కాబట్టి ఆ ప్రయత్నాలకు కూడా పరిమితులుంటాయని చెప్పారు. క్రమశిక్షణను (మనోనిగ్రహాన్ని) వివిధ రూపాలలో సాధన చేసే చాలామంది తాత్కాలికంగా మాత్రమే తమ లక్ష్యసాధనలో సఫలీకృతమవుతున్నారు. మీరు ఒక నియమానికి ఖచ్చితంగా ఎలా కట్టుబడి ఉండగలిగారు? మీరు దానిని విజయవంతంగా ఎలా సాధించగలిగారు? అది ఎంతో అద్భుతంగా అనిపిస్తుంది.

**గురువుగారు:**

ఈ నియమం నా ఆలోచనాసరళి నుంచో, నా నేపథ్యం నుండో వచ్చింది కాదు. చాలామంది దానిని కుటుంబ సాంప్రదాయంగానో, ఆచారవ్యవహారాలలో భాగంగానో చేస్తారు, కానీ నేను ఎటువంటి ఆచారాలూ పాటించేవాడిని కాదు, నియమాలవంటివి ఏమీ లేవు. మా కుటుంబానికి మతపరంగాగానీ, ఆధ్యాత్మికత పరంగాగానీ, భక్తి పరంగాగానీ ఎటువంటి నేపథ్యమూ లేదు. (గురువుగారు నవ్వుతూ...) పైన ఉదహరించిన దేని ఆధారంగానూ అది రాలేదు. నియమాన్ని అనుసరించడం ద్వారా నా లక్ష్యం పట్ల, దానిని చేరుకోవడం పట్ల నాకు ఎక్కువ స్పష్టత రావడానికి అది ఉపయోగపడుతుందని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. ఇంకోరకంగా చెప్పాలంటే అది (నియమం) నాకు ఉపయోగపడుతుందని నా అనుభవం, అందుకే నేను దానిని అంటిపెట్టుకున్నాను. అందుకనే నేను, మీరు మీ లక్ష్యాన్ని తెలుసుకోకుండా ఏదో ఒక లక్ష్యం పెట్టుకోవద్దు అని

చెబుతూ ఉంటాను. చాలామంది తమ లక్ష్యాన్ని తెలుసుకోకుండా, దానిని అనుభూతి చెందకుండా, తమకేం కావాలో చూసుకోకుండా, లక్ష్యాన్ని పెట్టుకోవడం అనే పొరపాటు చేస్తుంటారు. అందుకనే నేను మీ అవసరం ఏమిటో తెలుసుకోమని చెబుతూ ఉంటాను! లక్ష్యాన్ని పెట్టుకోవడం, లక్ష్యాన్ని తెలుసుకోవడం అనేవి రెండు భిన్నమైన విషయాలు.

**భక్తుడు:**

మీరు మీ లక్ష్యాన్ని చేరుకునేందుకు నియమాన్నే అంటిపెట్టుకొని ఉండడం మీకు ఉపయోగపడిందని మీరు అనుకొంటున్నారా?

**గురువుగారు:**

దానిని పాటించడానికి నేను ప్రయత్నించలేదు. అది దేనినీ పాటించడంలాంటిది కాదు. అది చాలా సహజంగా జరిగింది. మొత్తం విషయంలో అది ఒక భాగమైపోయింది.

**భక్తుడు:**

ఆ నియమాన్ని అంటిపెట్టుకోవడానికి మాకు అంత బలం ఎక్కడి నుండి వస్తుంది? ఎందుకంటే మా ఇష్టాయిష్టాలతో బలహీనంగా తయారై మా మనస్సు ఎటుపోతే అటు పోతుంటాము...

**గురువుగారు:**

అది ఎక్కడ నుండి వస్తుందో నాకు తెలియదు, అయితే అది లక్ష్యాన్ని చేరుకోవాలి అనే మన కోరిక వలన రావచ్చనుకుంటాను. అది మాత్రమే బలాన్నివ్వగలదు.

**భక్తుడు:**

కాబట్టి నియమం వాస్తవంగా మనం ఎక్కడున్నామో చూపిస్తుంది కదా, గురువుగారూ?

**గురువుగారు:**

అవును. అందుకనే (వాచా) ఎవరైనా చెప్పినపుడు నేను ఎప్పుడూ నమ్మను, వాళ్ళు ఏం చేస్తున్నారు అనే దాని నుండి తీసుకుంటాను.

**భక్తుడు:**

కానీ మీ విషయంలో నియమాన్ని అంటిపెట్టుకోవడానికి, లక్ష్యాన్ని చేరుకునేదానికి సంబంధం ఉంది. ఆ నియమాన్ని అంటిపెట్టుకోవడం అనేది మీ లక్ష్యం వైపుకు మిమ్మల్ని నడిపించింది.

**గురువుగారు:**

అవును. అదే నియమం.



*శిరిడీ, 1990*



# కోపాన్ని జయించడం ఎలా?

**భక్తుడు:**

కోపం అంటే ఏమిటి? కోపం ఎట్లా వస్తుంది?

**గురువుగారు:**

ప్రతి ఒక్కరూ, 'ఇతరుల దృష్టిలో తాము ఫలానా' అని అనుకొంటూ దానికి అనుగుణంగా తమ గురించి తాము ఒక స్వంత భావనను కలిగివుంటారు. దానినే మనం 'అహం' అంటాము. "మనం అహాన్ని సమూలంగా తుడిచిపెట్టాలి!", "అహం అసలు ఉండనేకూడదు, దానిని నాశనం చేయాలి!"... ఇలా అహం అనే పదాన్ని మనం చాలా తేలికగా వాడేస్తూ ఉంటాము. అయితే అసలు ఈ 'అహం' అంటే ఏమిటి? మీలో ఎవరైనా ఎప్పుడైనా దాని గురించి ఆలోచించారా? 'నేను' అనేదే 'అహం' అని మీరనవచ్చు. కానీ అది ఒక సమాధానం అవుతుందా? 'నేను' అనేదేనా 'అహం'... అది అంత మాత్రమేనా?

అయితే మరి "అహం" అనే పదానికి బదులు "నేను" పదాన్ని మీరు ఎందుకు వాడటం లేదు? సాధారణంగా మన అనుభవంలో 'అహం' అంటే ఏమిటంటే 'ఇతరుల దృష్టిలో మనమేమిటి అని మనం మన గురించి అనుకుంటామో' అది. ఇది ఖచ్చితమైన నిర్వచనం కాదు కానీ మనం ఈ 'అహం' అంటే ఏమిటో దానిని కాస్తయినా అవగతం చేసుకోవాలని అనుకుంటే ఇది ఉపకరిస్తుంది.

భక్తుడు:
మన గురించి ఇతరులు ఏమనుకుంటున్నారు, మన గురించి మనం ఏనుకుంటున్నాం – వీటిని మీరు వేర్వేరుగా ఎందుకు చూస్తున్నారు?

**గురువుగారు:**
ఎందుకంటే మన గురించి మనం ఏమనుకుంటున్నాం అనేది సాధారణంగా ఇతరులు మన గురించి ఏమనుకుంటున్నారు అనే దానిపై ఆధారపడి ఉంటుంది. నిజానికి, ఇతరులు మన గురించి ఏమనుకుంటున్నారు అని కాదు, వాళ్ళు మన గురించి ఏమనుకుంటున్నారని మనం అనుకుంటుంటామో అది! (గురువుగారు నవ్వుతూ...) అందరూ మనల్ని చాలా గొప్పగా అనుకుంటున్నారని మనం అనుకోవచ్చు, వాస్తవానికి ఇతరులు మన గురించి అలా అనుకోకపోవచ్చు. సమస్య ఇక్కడే వస్తుంది: మన గురించి అందరూ గొప్పగా అనుకుంటున్నారు అనేటటువంటి ఈ భావనకు ఏ రకంగానైనా భంగం కలిగినపుడు మనకు కోపం వస్తుంది.

భక్తుడు:
గురువుగారూ! కొన్ని సమయాల్లో, చుట్టుప్రక్కల ఎవ్వరూ లేనప్పటికీ

ఉన్నట్టుండి కోపం వస్తోంది... అలా ఎందుకు జరుగుతోంది?

**గురువుగారు:**

అది అలా రాదు. నీ గురించి నీకుండే భావనను (ఇమేజ్‌ను) గానీ, నీ అహాన్నిగానీ దెబ్బతీసేటటువంటి ఏదైనా సంఘటనను నువ్వు గుర్తుకు తెచ్చుకోవడమో లేదా ఊహించుకోవడమో చేస్తుంటావు. మనం భౌతికంగా ఒంటరిగానే ఉన్నప్పటికీ అటువంటి జ్ఞాపకం గానీ లేదా ఊహగానీ మనతోనే ఉంటుంది. అది అంతకుముందు ఎప్పుడో జరిగిన దాని పర్యవసానం కావచ్చు. అంటే మనం పరిస్థితుల వల్ల అంతకుముందు అణుచుకున్నటువంటి విషయం మనం ఒంటరిగా ఉన్నప్పుడు దాని నీడలాగా, ఓ జ్ఞాపకంలాగా, స్మృతి లాగా గుర్తుకు వస్తుంది. రెండోది – ఏదైనా విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేక పోవడం చేత, అవగాహనాలోపం వల్ల కోపం వస్తుంది. మూడవది – మనకు బాధ కలగడంవల్లగానీ, ఏదైనా సుఖాన్ని కోల్పోవడం వల్లగానీ మనకు కోపం రావచ్చు.

మొత్తం మీద చెప్పాలంటే, కోపం రావడానికి ఈ మూడు కారణాలు కారణమవుతాయి. నీకు కోపం వచ్చిన ఏ సందర్భాన్ని తీసుకున్నా దానికి కారణం ఈ మూడింటిలో ఏదో ఒకటి అయివుంటుంది.

మొట్టమొదటిది: మన గురించి మనకుండే భావన(ఇమేజ్)ను ప్రభావితం చేసే విషయాన్ని గుర్తుచేసుకోవడం, ఊహించుకోవడం. ఇది చాలా వరకు ఊహామాత్రమే అయివుంటుంది, నిజానికి దానికి ఎటువంటి స్పష్టమైన ఆధారం ఉండదు. కాబట్టి ఇది ఊహాజనితమని తెలుసుకుని స్పష్టంగా, ఉన్నదున్నట్లుగా ఆలోచించడం మొదలుపెడితే దీని ప్రభావాన్ని కొంతమేరకు తగ్గించుకోవచ్చు. రెండవది: అవగాహన లేకపోవడం. విషయాన్ని పూర్తిగా తెలుసుకోవడం ద్వారా దీనిని

పరిష్కరించుకోవచ్చు. మూడవది: సుఖాన్ని కోల్పోవడం లేదా బాధ కలగడం. ప్రేమ అనే మంచి భావోద్వేగం కలిగి ఉండటం ద్వారా దీనిని నివారించవచ్చు. మొదటి కారణంలా కాకుండా ఇది వాస్తవం! ఎవరైనా నిన్ను కొట్టారంటే అది ఊహనో, కల్పనో కాదు.

రెండవ కారణానికి సంబంధించినంతవరకు, ఇది మొదటి దానితో ముడిపడి ఉంటుంది. సాధారణంగా నేను బస్సు ప్రయాణాన్నిగాని, రైలు ప్రయాణాన్నిగాని దీనికి ఉదాహరణగా చెప్తుంటాను. నువ్వు నీ సీటులో కూర్చుని ప్రయాణం చేస్తుంటావు, ఇంతలో ఎవరో వచ్చి నీ పాదాన్ని త్రొక్కారనుకోండి. నీకు బాధ కలుగుతుంది. "ఏయ్, కళ్ళు కనిపించడం లేదా, చూసి నడవలేవా, అంత హడావుడి ఏమిటి?" అని నువ్వు కోపంతో గయ్యిమంటూ అరుస్తావు. ఇంతలో ప్రక్కనే ఉన్నతను, "క్షమించండమ్మా, ఆయన గ్రుడ్డివాడు, చూడలేడు!" అని చెప్పగానే అప్పటికప్పుడు నీ కోపమంతా కరిగిపోయి, "అయ్యయ్యో, నన్ను క్షమించండి, దయచేసి నన్ను మన్నించండి, ఇందాక నాకు తెలియక అరిచాను. రండి, వచ్చి ఇలా కూర్చోండి" అని నీ సీటును అతనికి ఇస్తావు. (గురువుగారు నవ్వుతూ...)

ఒక్కసారి దీని గురించి ఆలోచించండి. అక్కడ మీ కోపమంతా ఏమయ్యింది? దాని వెనుక గల తత్వమేమిటి? నిజానికి అక్కడ మిమ్మల్ని బాధపెట్టింది శారీరకమైన నొప్పి కాదు. ఒకవేళ అదే గనుక కారణమైనట్టయితే నీకు ఇంకా ఆ కోపం ఉండాలి ఎందుకంటే నీకు ఇంకా ఆ నొప్పి ఉంది, నీ పాదం ఇంకా బాధపెడుతోంది. కాబట్టి నీకు కోపం రావడానికి కారణం ఆ నొప్పి కాదు. ఇతరులు నీతో ఫలానా విధంగా సరైన రీతిలో ప్రవర్తించాలని నువ్వు ఆశిస్తున్నావు. ఆ మర్యాద లేకపోవడం నిన్ను బాధపెట్టింది. అతని ఉద్దేశ్యం అది కాదని, అతను

అలా చెయ్యడానికి గల కారణం అతనికి చూపులేకపోవడమేనని నీకు తెలిసిన తరువాత అప్పటికప్పుడు మొత్తం విషయం మారిపోతుంది. నువ్వు నిలబడైనా సరే నీ సీటును అతనికి ఇవ్వబోతావు. అప్పుడు నీ కోపం ఏమైంది? ఆ కోపం ప్రేమగా, దయగా ఎలా మారుతోంది? దీన్ని ఇదే విధంగా వివిధ సందర్భాలకు అన్వయించి చూడండి. నాకు కోపం ఎందుకు వస్తోంది? అని చూసుకుంటే, "ఓహో, నేను అతని నుండి దీన్ని ఆశిస్తున్నాను, అందుకే నాకు కోపం వస్తుంది" అని తెలుస్తుంది.

నువ్వు మీ పాపతో ఆడుకునేటప్పుడు తను నీ గుండెలపై నిలబడి గెంతడం మొదలుపెట్టిందనుకోండి, అది నొప్పిగానే ఉంటుంది. అందులో సందేహం లేదు. కానీ నువ్వు "ఇంకాస్త ఎగురు, ఇంకాస్త ఎగురు!" (గురువుగారు నవ్వుతూ...) అంటావు. కోపం రావడానికి నొప్పేగనుక కారణమైతే నీకు మీ పాప పట్ల కూడా కోపం రావాలి. కానీ అప్పుడు నీకు కోపం ఎందుకు రావడం లేదు?

**భక్తుడు:**

ఎందుకంటే అక్కడ ప్రేమ ఉంది.

**గురువుగారు:**

ప్రేమ ఉంది కాబట్టి. నేను మీ కోపానికి గల కారణాలు చెప్తూ కోపాన్ని ప్రేమతో అదుపు చెయ్యవచ్చు అని చెప్పినప్పుడు అది మీకు అస్పష్టంగా ఉంది, అందుకనే మీకు కొన్ని ఉదాహరణలు ఇచ్చాను. "కోపాన్ని ప్రేమ ఎలా అదుపులో ఉంచుతుంది?" ఎలాగంటే మనం ముందు చెప్పుకున్నట్లుగానే.

**గురువుగారు:**

మనం సాధారణంగా ఫలానా సంఘటన జరగడం వల్లనో, ఈయన ఇలా చెయ్యడం వల్లనో, ఆమె అలా చెయ్యడం వల్లనో మనం కోపం వచ్చిందని అనుకుంటాం. కానీ అది అర్థరహితం. దానికి కారణం అది కాదు. దాని వెనుక మరేదో ఉంది. దానిని గనుక నువ్వు తెలుసుకోవాలని ప్రయత్నిస్తే, కోపాన్ని పూర్తిగా జయించలేకపోయినా కనీసం నువ్వు కోపగించుకునే సందర్భాలను తగ్గించుకోవచ్చు.

ఇతరులు మన గురించి ఫలానా విధంగా అనుకుంటున్నారని మన గురించి మనకున్న భావన తప్పు అని మన కోపం తెలియ జేస్తుంది. ఇతరులు నిన్ను గౌరవించాలని, ప్రేమించాలని నీతో తగువిధంగా ప్రవర్తించాలని నువ్వనుకుంటావు. కానీ అలా జరగడం లేదు. అలా జరగడం లేదంటే మన అవగాహన నిజం కాదు. మన గురించి మనకున్న భావన తప్పు.

**గురువుగారు:**

మనం ఇతరుల నుండి ప్రేమను, గౌరవాన్ని ఎందుకు ఆశించాలి? (అవి పొందలేనపుడు) వారి మీద ఎందుకు కోపగించుకోవాలి? ప్రేమాభిమానాలు, ఆదరం వంటి వాటి కోసం ఇతరులను యాచించడం దేనికి? వాళ్ళు మన పట్ల ప్రేమాభిమానాలు, గౌరవం చూపించకపోతే మనకు కోపం వస్తుంది. ఇతరులు మన అభీష్టాన్ని అనుసరించి పోవాలని ప్రాకులాడుతుంటాం. వాళ్ళు మనను లక్ష్య పెట్టాలని దేబిరిస్తుంటాం. కోపం రావడానికి వెనుకగల ఆంతర్యాన్ని మనం అర్థం చేసుకోగలిగితే కోపం రావడం ఆగిపోతుంది. అది

మళ్ళీ వస్తే రావచ్చుగాక, మళ్ళీ దానిని అర్థం చేసుకుంటూ ఉంటే అది క్రమంగా మాయమవుతుంది.

**గురువుగారు:**

నేను చెప్పినట్టు, మీకు స్పష్టత లేకపోవడం, పూర్తి అవగాహన ఉండకపోవడం మీ కోపానికి గల రెండవకారణం. ఇక మూడవ కారణం విషయానికి వస్తే "ప్రేమ, ప్రేమ, ప్రేమ! నాకు ప్రేమ కావాలి" అని మీరు ఎప్పుడూ మాట్లాడుతుంటారే, ఆ సహజమైన ప్రేమ మీలో లేకపోవడం.

**భక్తుడు:**

కోపం వచ్చీరాగానే శరీరంలో బలమైన ప్రతిస్పందనలు కలుగుతూ ఉన్నాయి, నాలో ప్రేమ లేదు అని నాకు నేను తెలియజెప్పుకునేటప్పటికే ఆలస్యమైపోతుంది కదా? దాని గురించి ఏమిటి చెయ్యడం?

**గురువుగారు:**

బలమైనటువంటి ఏ భావోద్వేగమైనా శారీరకమైన ప్రతిస్పందనలు కలుగజేస్తుంది. అంతవరకే! కానీ ఆ శారీరక ప్రతిస్పందన ముఖ్యం కాదు. కేవలం కన్నీళ్ళు కార్చడం ఏడవడం కాదు. నీ హృదయంలో నువ్వు అనుభవించే ఆ వేదన, ఆ వ్యథ... అదే నిజమైన బాధ. ఉల్లిపాయలు తరిగేటప్పుడు కూడా కన్నీళ్ళు వస్తాయి. (నవ్వులు...) అందుకని భౌతికమైన ప్రతిస్పందనలను పట్టించుకోవద్దు. ఒక్కొక్కరూ ఒక్కోరకంగా స్పందిస్తుంటారు, కొంతమందికి భావోద్వేగాల తీవ్రతకు శరీరం ఎక్కువగా స్పందిస్తుంది. కానీ నేను దానికి మూలమైన భావోద్వేగం గురించి మాట్లాడుతున్నాను.

**భక్తుడు:**

ఇక మీదట కోపం వచ్చినపుడు ఏం చెయ్యాలి? దానిని ఎలా పట్టుకోవాలి? అనేదానికి నాకో పద్ధతి కావాలి. కోపం రావడానికి ముందే దానిని పట్టుకోవడం సాధ్యమేనా?

**గురువుగారు:**

నువ్వు ఒక్క విషయాన్ని అర్థం చేసుకోగల్గితే కోపాన్ని జయించవచ్చు. ఉదాహరణకు, నీ దగ్గరకు ఎవరో వచ్చి వాళ్ళ కష్టాల గురించి, వారి ఇబ్బందుల గురించి చెప్పడం మొదలుపెట్టారనుకుందాం. నువ్వు కాసేపటికి విసిగిపోయి, కోపగించుకోవడం మొదలుపెడతావు. అదే సందర్భంలో ఆ వ్యక్తి స్థానంలో నువ్వుండి ఆలోచించు. నీకే గనుక అటువంటి సమస్యలే ఉంటే, నువ్వు కాస్త ఓదార్పు కోరుకుంటావు, బహుశా నువ్వు నా దగ్గరకు వచ్చి చెప్పుకుంటావు. నేను ప్రేమతో, ఆదరంతో స్పందించాలని, అర్థం చేసుకోవాలని ఆశిస్తావు. లేదంటే నువ్వు బాబా వద్దకు వెళ్ళి "బాబా, నేను ఇలా ఉన్నాను, నావల్ల ఏమీ కావడంలేదు, నన్ను అనుగ్రహించండి" అని ప్రార్థిస్తావు. ఇతరులు మనల్ని మనంగా అంగీకరించాలని మనం ప్రయత్నిస్తున్నప్పుడు, ప్రక్కన వాళ్ళను వారిగా మనమెందుకు అంగీకరించలేకపోతున్నాం? మనం మాత్రం ప్రక్కన వాళ్ళను వాళ్ళుగా అంగీకరించం కానీ మరొకరు మనల్ని మనంగా అంగీకరించాలి. నీ దగ్గరకు వచ్చిన వ్యక్తి కేవలం వాళ్ళ సమస్యలు చెప్పాలనుకుంటున్నారు. మనం ఏం చెయ్యలేకపోయినా కనీసం అలా వినడం వలన మనం కోల్పోయేది ఏమన్నా ఉందా? మీరే ఏమైనా చేయగలిగితే చెయ్యండి, అది మంచిది.

**గురువుగారు:**

మనకు కోపం రావడానికి – మన మాట వినకపోవడమో, మనల్ని అవమానించడమో, మన అహం దెబ్బతినేలా ప్రవర్తించడమో – ఇట్లా ఏదో ఒక కారణం అయి ఉంటుంది.

బాబా కోపాన్ని ప్రదర్శించిన సందర్భాలన్నింటినీ తీసుకోండి. అటువంటి కారణాలు (reasons) ఏవీ బాబా కోపగించుకొన్నట్లు అనిపించిన ఏ సందర్భంలో కూడా కనిపించవు. నిజానికి బాబా ఎప్పుడూ కోపాన్ని చూపలేదు. బాబా చూపింది దయ, ప్రేమ, అభిమానమే. బాబాకు బాగా కోపం వచ్చినట్లు అనిపించిన ప్రతిసారీ, తనకు బాధ కలిగిందనో, తానాశించింది జరగలేదనో కోపగించిన సందర్భం ఒక్కటి కూడా లేదు. బాహ్యానికి బాబా వంటి మహాత్ముల కోపానికి, మనకొచ్చే కోపానికి మధ్య తేడా లేనట్లే ఉంటుంది. కానీ, కోపం ఎలా వ్యక్తమయ్యింది? దేని కోసం వ్యక్తమయ్యింది? – అన్నదే తేడా. మహాత్ముల కోపం వారికి మనపట్ల ఉన్న ప్రేమ నుండి ఉద్భవిస్తుంది. వారి కోపం ఎదుట వ్యక్తి ఉద్ధరణ, మేలు కోసం ఉద్దేశించింది. బాబా కోపం బాబా ప్రేమకు ఒక వ్యక్తీకరణే. మనలో ఉన్న ఏదో అలజడికి వ్యక్తరూపం మన కోపం.

మహాత్ములు తమ కోపాన్ని ప్రేమకు వ్యక్తీకరణరూపంగా భావించారు గనుక వారి కోపం వారిని ఇబ్బందిపెట్టదు. కనుక ఆ కోపాన్ని నిగ్రహించుకోవడానికి వారెప్పుడూ ప్రయత్నంచేయరు. మన కోపం మనలో అశాంతి, అలజడి ఇంకా ఎక్కువ చేస్తుంది. మహాత్ముల కోపం వారికది బలం. మన కోపానికి కారణం ప్రేమ కాదు కనుక మనకది బలహీనత.

**భక్తుడు:**

ఈ కోపం, ఈ వేదన, ఈ వ్యథ అనుభూతం కానటువంటి ఆ స్థితికి మేము చేరుకోవడమెలా?

**గురువుగారు:**

మీ హృదయంలో సద్గురువు రగిలించిన ప్రేమ ఉంటేనే అది సాధ్యమవుతుంది. మీ హృదయంలో ప్రేమ ఉన్నాక, మీరు చెడును చూడలేరు; మీకు అజ్ఞానం కనిపిస్తుంది. మీరు వారి కోపాన్ని అర్థం చేసుకుని వారి పట్ల సానుభూతి చూపుతారు. ఏసుక్రీస్తు ఏం చెప్పారు? ఆయనకు శిలువ వేయబడుతూ, చీలలు కొట్టి శూలారోపణ చేస్తున్న సమయంలో కూడా ఆయన ఏమన్నారు? "తండ్రీ, వారు చేస్తున్నదేమిటో వారికి తెలియదు, వారిని క్షమించండి". ఆయనకు గల వివేకం వలన, ఆ ప్రేమ వలన అంతటి సహనం సాధ్యమయింది. బాబా కూడా అలాగే ప్రతిస్పందించారు. ఆయన ఇలా అన్నారు: "పసిబిడ్డ కాలిపై మలవిసర్జన చేస్తే బిడ్డను నరుకుతామా, కాలిని నరుకుతామా?" అని. అలా చెయ్యం కదా, ఎందుకంటే ఆ పసిబిడ్డకు తను ఏం చేస్తుందో తెలియదు.

అందుకనే మహాత్ములు దానిని ద్వేషించరు. మన పిల్లలు ఏమైనా చేస్తే మనం దానిని ఎలా చూస్తాం? అటువంటి దృక్పథం రావడానికి మన హృదయం ప్రేమతో నిండిపోవాలి. మన హృదయంలో ప్రేమ పెల్లుబికి అది ప్రేమతో నిండిపోవాలి, అలా అయినపుడే అది సాధ్యమవుతుంది. అటువంటి ప్రేమ ఉన్నప్పుడు మిగతావన్నీ దానిని అనుసరిస్తాయి. వారు చేస్తున్న దానిలో చెడును ఏసుక్రీస్తు చూడనేలేదు.

**భక్తుడు:**

మేము అటువంటి ప్రేమను అనుభవించేదాకా, ఇప్పటికే మాలో ఉన్న కోపాన్ని ఎలా ఎదుర్కోవాలి?

**గురువుగారు:**

ప్రక్కన వ్యక్తిని అర్థం చేసుకోవడం ద్వారా, ఆదరించడం ద్వారా, సానుభూతి చూపించడం ద్వారా, వారి పరిస్థితిని అవగాహన చేసుకోవడం ద్వారా...! ఇవి ఉన్నప్పుడు కోపం ఉండదు.



శిరిడీ, 2008



# ప్రేమ తత్త్వం

**భక్తుడు:**

గురువుగారూ! క్రితంసారి మీరు 'అవసరం' గురించి, 'అనుగ్రహం' గురించి మాట్లాడుతూ, అవసరం ఉంటే అనుగ్రహాన్ని స్వీకరించడానికి కావాల్సిన సంసిద్ధత మనకు కలుగుతుందని, ఒక్కసారి అక్కడ అటువంటి సంసిద్ధత వచ్చాక, బాబా అన్నట్లు, మనం స్వీకరించడానికి అక్కడ బండ్లకొద్దీ అనుగ్రహం ఉంది అని మీరన్నారు. వీటన్నింటినీ సమన్వయపరచేది ఏమిటి?

**గురువుగారు:**

బాబా వంటి సద్గురువు సాన్నిధ్యానికి చేరుకున్నాక – ఆ మొత్తం వ్యవహారం గురించి, అది ఎలా జరుగుతుంది అనే దాని గురించి ఆయన చూసుకుంటారు. ఆ అనుగ్రహానికి తయారుగా ఉండటం ఒక్కటే మనం చెయ్యాల్సింది, అంతే. దానిని (ఈ వ్యవహారాన్ని) ఇది ఫలానా అని వివరించడానికి ప్రయత్నించకుండా, వేరొక

దానితో పోల్చడానికి పూనుకోకుండా ఉండాలి. మీకు అటువంటి ప్రేమే గనుక ఉంటే, మిగతా విషయాలన్నింటి బాధ్యతనంతా అదే తీసుకుంటుంది.

**భక్తుడు:**
ప్రతి అంశంలోనూ ప్రేమే కీలకమవుతుంది కదా?

**గురువుగారు:**
అవును. ప్రేమే కీలకం. రమణమహర్షి విషయంలో – ఆయన లౌకిక ప్రపంచాన్ని వదలిపెట్టింది వైరాగ్యభావంతోనో, 'మాయ'తో విసిగిపోవడంవల్లనో, ఆయన ఆత్మస్వరూపుడవటం మూలానో, ఆయనకు ముక్తి కావాలనిపించడంచేతనో, వేదాంతగ్రంథాలు ఏదో చెప్పాయనో కాదు – వీటిల్లో ఏదీ ఆయన ప్రపంచాన్ని త్యజించడానికి కారణం కాదు. ఆయన ఇల్లు వదిలింది వీటి కోసం కాదు. ఆయనను మధురై నుండి అరుణాచలానికి లాక్కొని వెళ్ళింది అరుణాచలేశ్వరుని పట్ల ఆయనకు గల ప్రేమే.

కాబట్టి ముందుకు లాగేది ఆ ప్రేమే. అది ఒక్కొక్కరి విషయంలో ఒక్కోరకంగా సంభవిస్తుంది. నేను చెప్పే ఈ విషయాన్నంతా భక్తి మార్గంలోకి తీసుకువస్తున్నట్లు కనిపించవచ్చు, కానీ నా ఉద్దేశ్యం అది కాదు. నిజానికి అన్నింటికీ మూలం ప్రేమే; దానిని భక్తి అనవద్దు. సాధన పట్లయినా సరే లేదా సాధించే లక్ష్యంపట్లయినా సరే ఉండేది ప్రేమే. కేవలం ప్రేమ.

బుద్ధుని విషయంలో చూస్తే – జీవితం యొక్క గూఢతత్త్వాన్ని ఆయన నిగ్గుతేల్చాలని తపనపడ్డాడు, దానిని ఆయన ఎంతగానో ప్రేమించాడు. అదే ఆయన ప్రేమగా మారింది. అది కేవలం

మేథస్సుకు సంబంధించిన అన్వేషణ మాత్రమే కాదు. మామూలుగా మేథస్సుకు సంబంధించి ప్రశ్నించడమన్నది చాలామంది విషయంలో జరుగుతూనే ఉంటుంది. వాళ్ళూ ప్రశ్నిస్తారు కానీ పుస్తకాలలో సమాధానాలు వెతుక్కుని వాటితో సమాధానపడిపోయి పడక్కుర్చీ వేదాంతులవుతారు. కానీ బుద్ధునికి, తనకుతాను ఆ పరిష్కారాన్ని కనుగొనడమనేది అత్యంత ప్రబలమైన వ్యక్తిగత అవసరంగా మారింది. అదీ ఆయన ప్రేమ. నేను దానిని 'ప్రేమ' అనే అంటాను. అటువంటి ప్రేమ అరుణాచలేశ్వరుని కోసమైనా, సాయిబాబా కోసమైనా, సత్యం కోసమైనా, సత్యాన్వేషణ కోసమైనా... ఇవన్నీ కూడా ప్రేమే.

భక్తుడు:

మన అన్వేషణలో మనం చేసే సాధనకు కావలసింది గట్టి సంకల్పమా లేక మనోనిశ్చయమా? ఎటువంటి సాధన శ్రేష్ఠమైనది?

**గురువుగారు:**

సరైన సాధన ఎప్పుడూ మన ప్రేమకు వ్యక్తీకరణగా అనుభవమవుతూ ఉంటుంది. ఆ ప్రేమ ఒక వస్తువుపట్ల కావచ్చు, విషయంపట్ల కావచ్చు, ఒక రూపం పట్ల కావచ్చు. అది ఏదైనా కానివ్వండి, అది ప్రేమ. మనం చేసేటటువంటి సాధన మన ప్రేమను వ్యక్తీకరిస్తున్నప్పుడు అది సరైన సాధనే అవుతుంది. అంతేగానీ సాధన తనకు తానుగా ఇదే సరైన సాధన అని చెప్పదు. అది అటువైపు నుండి జరగదు. (అంటే అది ఆలోచించి చెప్పే విషయం కాదు.) అలా అయితే అది బండిని గుఱ్ఱానికి ముందు పెట్టినట్లుగా ఉంటుంది. ముందుగా మనం పుస్తకాలన్నింటినీ చదివి, అధ్యయనం చేసి, నేర్చుకుని, ఆ తరువాత

ఏది మంచి సాధనాపద్ధతి అని చూసి, ఒక పద్ధతిని ఎంచుకుని దాన్ని ఆచరణలో పెట్టుకోవడానికి, దానిని సాధన చెయ్యడానికి, అది పనిచేసేలా చెయ్యడానికి ప్రయత్నిస్తూ, ప్రయత్నిస్తూ ఉండటం... ఇది కాదు. అది అలా జరిగేది కాదు. మనలో ప్రేమను రగిలించిన ఆ లక్ష్యాన్ని పొందడానికి మనం ఎంచుకున్న సాధనాపద్ధతి 'మార్గం' అయినపుడు ఆ సాధన మన ప్రేమకు నిజమైన వ్యక్తీకరణ అవుతుంది, అలా కాకపోతే అది ఫలవంతంకాదు. మనం సాధారణంగా ఇలానే చేస్తుంటాం. మనం సాధన యొక్క లక్ష్యంకన్నా సాధనాపద్ధతికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తాం, చివరకు లక్ష్యానికన్నా సాధనాపద్ధతినే ఎక్కువగా ప్రేమించడంతో అది ముగుస్తుంది.

భక్తుడు:

గురువుగారూ, మరణభయాన్ని మేము ఏవిధంగా జయించగలం?

**గురువుగారు:**

జీవితం యొక్క మూలసూత్రాన్ని, వాస్తవతత్వాన్ని మీరు నిజంగా అర్థం చేసుకున్నప్పుడు, బహుశా మరణమనేది అంత భయానకమైనది కాదని మీకు తెలియవచ్చు. రమణమహర్షికి అనుభవమైంది కూడా అదే. ఆ అనుభవం పొందడం ద్వారా అది ఆయనకు తెలిసింది. జీవితం యొక్క మూలసూత్రం ఆయనకు తెలుసు కనుక, మనం మరణభయం అని పిలిచేది కేవలం భ్రమ మాత్రమేనని ఆయన గ్రహించారు. మనమూ చివరకు రమణమహర్షిలాగా సాక్షాత్కారం పొందవచ్చునేమో కానీ, దాన్ని (ఆయన అనుభవాన్ని) ప్రమాణంగా ప్రాతిపదికగా తీసుకుని మనం మొదలుపెట్టకూడదు, ఎందుకంటే

అది కూడా మనకు ఊహామాత్రమైనదే కాబట్టి. ముందే, “మరణం అనేది ఒక మాయ, దానికి మనం భయపడకూడదు” అనే లక్ష్యాన్ని ధ్యేయంగా పెట్టుకుని మనం మొదలుపెడుతున్నాం. అది మనం అనుకునేలా మాయ కాకపోవచ్చు; మనం దానిని మాయ అని అనుకోవడం కాదు, అది మన అనుభవమై ఉండాలి. అది మాయ అని తెలుసుకోవాలి. ఒకవేళ మరణమనేది ఉన్నా, అది నిజమే అనుకున్నా – దాన్ని ముఖాముఖి చూద్దాం! దాన్ని అలా చూడటానికి నీకు శక్తినిచ్చేది ప్రేమ. నేను ఇంతవరకు మీకు చెప్పాలని ప్రయత్నిస్తున్నది ఇదే. మనం ప్రేమలో జీవిస్తున్నాం. అందువలన మరణమనేది మనకు అప్రస్తుతమైన, ఏ మాత్రం ప్రాముఖ్యత లేనటువంటి విషయం. ఆ ప్రేమ సద్గురువు పట్లయినా, అరుణాచలేశ్వరుని పట్లయినా, జ్ఞానం పట్లయినా – అది ఎవరి పట్ల అనేది ముఖ్యం కాదు, అది ప్రేమ.

మళ్ళీ ఇదే ప్రేమను మీరు వేరొక పరిభాషలో – అవసరమని, కోరికని పిలవవచ్చు. ఇటువంటి మానవ స్థితిగతులన్నీ ప్రేమ యొక్క వివిధ ఛాయలే. మీకు దేనిపట్లయినా ప్రేమ ఉంటే మీకు దాని అవసరం ఉంటుంది. ఆ ప్రేమ మరింత అవసరాన్ని కలిగిస్తుంది, దానిని మీరు ఇంకా ఎక్కువ కోరుకుంటారు, అప్పుడు మీరు దానిని ఎక్కువగా పొందుతారు. మన ప్రతి ఒక్కరిలో అణుమాత్రంగా ప్రేమ ఉంది. దానిని వ్యక్తం చేయడానికి ప్రయత్నించండి. వ్యక్తం చేయడం వలన ప్రేమ పెరుగుతుంది. ఎన్నోరకాలైన భయాలు, కోరికలు, అలవాట్ల కారణంగా ప్రేమ మన హృదయంలో ‘అణిగి’ ఉంది. మీరు దానిని వ్యక్తం చేయాలి, మీ హృదయం నుండి వెలుపలకు తీసుకుని రావాలి.

హృదయానికి గల ముడులను తీయడం అంటే ఇదే! ఈ ముడులనే వేదాంతులు 'గ్రంథులు' అంటారు. "హృదయానికి గల ముడులను తొలగించండి" అని రమణమహర్షి చెప్పింది కూడా ఇదే. "మన భావోద్వేగాలకు నిలయమైన మన హృదయంలో ప్రేమ దాగివుంది, మన హృదయం కోరికలతో, అలవాట్లతో, ఆకర్షణలతో, వాసనలతో కట్టుబడిపోయింది. కాబట్టి దానికున్న ఆ ముడులు విప్పండి, వాటిని తొలగించడానికి ప్రయత్నించండి" అని ఆయన భావం. ఆయన వాసనలు, హృదయగ్రంథి అనే పరిభాషలో చెప్పారు. నేను చెప్పేదీ అదే కానీ, వాడే పదాలు మాత్రం భిన్నమైనవి.

**భక్తుడు:**

గురువుగారూ! అనేక ఆధ్యాత్మికవర్గాలలో అహాన్ని విడిచిపెట్టాలి, నాశనం చెయ్యాలి, చంపాలి అనడం మేము తరచుగా వింటుంటాం. కానీ మీరు చెప్పేది భిన్నంగా ఉన్నట్లు కనిపిస్తోంది.

**గురువుగారు:**

అహాన్ని 'చంపటం', 'నాశనం చెయ్యటం' – ఇలాంటి విపరీతమైన వ్యక్తీకరణలు అవసరమా? నాకివన్నీ చాలా క్రూరంగా అనిపిస్తాయి. దానికి బదులు నేనేమంటానంటే, నువ్వు 'ప్రేమ' అనే అనుభవాన్ని పొందినపుడు, మన అహం క్రమంగా అందులో లీనమైపోతుంది, ఆ ప్రేమతో కలసిపోతుంది. అది పూర్తిగా ఆ ప్రేమలో కరిగిపోయి, కలిసిపోయి తన అస్తిత్వాన్ని, రూపాన్ని కోల్పోతుంది.

**భక్తుడు:**

గురువుగారూ! మీరు ఇంతకుముందు ఒక సత్సంగంలో ఆనందం వైపుకు సాగిపోయే పరిణామం అహాన్ని ఆధారం చేసుకుని ఉంటుంది అని చెప్పారు. చివరకు మనం ఆనందాన్ని పొందినపుడు, మన అహం అనేది లేకుండా పోవాల్సిందే. మరి అలా అయినపుడు అది ఈ పరిణామానికి ఎలా సహాయపడుతుంది? ఎప్పుడు అది లేకుండా పోతుంది?

**గురువుగారు:**

అహంలోనే ఆ ప్రేమ రగులుకుంటుంది. ఆ ప్రేమ పెరిగినపుడు ఆ ప్రేమాగ్నిలో అహం దహించబడిపోతుంది, ఇక అదక్కడ ఉండదు. అహం ఆజ్యం వంటిది. ప్రేమ అనే అగ్నికి ఆ ఆజ్యం తోడవుతుంది. కాసేపటి తరువాత చూస్తే అక్కడది ఉండదు. అది వేరే రూపంలో ఉంటుంది. ఆ దీపాన్ని చూడండి: (అక్కడున్న నూనె దీపాన్ని చూపుతూ...) ఆ దీపానికి ఆధారమైనదేమిటి? నూనె. కానీ కాసేపటి తరువాత, ఆ నూనె ఎక్కడికి పోయింది? (ఆ నూనెలాగా) మరొక దానికి ఆధారమైనది తన స్వంత అస్తిత్వాన్ని కోల్పోవచ్చు. మన అహం, విసుగు, దుఃఖం, తపన, ప్రేమ కోసం మనకుగల అవసరం, సద్గురువు పట్ల మనకు గల ఆర్తి ఇవన్నీ నూనెలా పనిచేస్తాయి. అందుకనే ముందు మనం సాయిబాబా వంటి సద్గురువు కోసం అన్వేషిస్తాం. ఒక్కసారి ఆ ప్రేమ జ్వాల రగులుకున్నాక, ఆ జ్వాల మన అహాన్ని ఆజ్యంగా వాడుకుంటుంది. కనుక అహం అప్పుడసలు లేకుండా పోతుంది. సద్గురువు యొక్క రూపం ఆ మెత్తనైన దీపపు వత్తిలాగా పనిచేస్తుంది. కోల్పోవడం ద్వారా పొందడమనేది ఏదైనా ఉంటే అది కేవలం ప్రేమలో మాత్రమే. జీవితాన్ని కోల్పోవడం

ద్వారా జీవితాన్ని పొందుతారని బైబిల్‌లో క్రీస్తు చెప్పింది కూడా ఇదే.

**భక్తుడు:**

గురువుగారూ, మేము మారడానికి, పరివర్తన చెందడానికి కావలసిన సంసిద్ధతను పెంపొందించుకోవడం ఎలా?

**గురువుగారు:**

మీకు ఆ అవసరం, కోరిక ఉండటం వలన. మీకు కావలసినదేమిటో మీరు తెలుసుకున్నప్పుడు, మీ ధ్యేయం ఏమిటనేది మీకు తెలిసినపుడు వచ్చే రసాత్మకతనే మనం ప్రేమ అంటాము, అదే నిన్ను వృద్ధి చేస్తుంది. అప్పుడు నువ్వు పరివర్తన చెందుతావు. ఆ ప్రేమ మనలోని అభివృద్ధికి కారణమైన పోషకంగా మారుతుంది.

**భక్తుడు:**

నా ప్రేమకు ఆధారమైనటువంటి లక్ష్యాన్ని (సద్గురువును) నేను తెలుసుకోగలిగితే?

**గురువుగారు:**

ప్రేమకు లక్ష్యం అని కాదు – నువ్వు ప్రేమించే ఆ లక్ష్యం నీ అవసరం మీద ఆధారపడి ఉంటుంది. నీకు అవసరమైన దానినే నువ్వు ప్రేమిస్తావు, అంతే. అందుకనే, మొదట నీకు ఏమి కావాలో నువ్వు తెలుసుకోవాలి. అప్పుడు ఆ లక్ష్యాన్ని ప్రేమిస్తావు, లేదా ఆ లక్ష్యానికి నిన్ను చేర్చే మార్గాన్ని ప్రేమిస్తావు – అదేదైనాగానీ – అవి రెండూ ఒక్కటే. దాని ఫలితంగా కలిగే రసాత్మకానుభవమే ప్రేమ.

**గురువుగారు:**

సరైన సాధన మన ప్రేమను వ్యక్తం చేసేదిగా ఉంటుంది, అలా చెయ్యకుండా ఉండటం నీవల్ల కాదు. నువ్వు దానిని చెయ్యక తప్పదు. సాధన ఏదైనా అది మన ప్రేమకుగానీ మన అవసరానికిగానీ ఒక వ్యక్తీకరణ అయివుంటుంది. అది ఆ అవసరాన్ని లేదా ప్రేమను వ్యక్తం చేస్తూ ఉంటుంది. మీరు ఎలా పిలిచినా సరే, నేను దానిని 'ప్రేమ' అని పిలవడాన్ని ఇష్టపడతాను. ఎందుకంటే ప్రేమ మన అవసరం, మనలోని ఆ అవసరమే ప్రేమను పెంచుతుంది. అది ఎలా పెరిగినా సరే అది ప్రేమే. కాబట్టి సాధన కేవలం ఓ వ్యక్తీకరణ మాత్రమే. కానీ ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిన విషయం ఏమిటంటే మనం చేసే సాధన వలన ఫలితం రాదు. ఆ ఫలితం మనం చేసే సాధన మీద ఆధారపడి ఉండదు, అయినప్పటికీ మనం వ్యక్తం (సాధన) చేయవలసి ఉంటుంది. ఆ వ్యక్తీకరణ మన ప్రేమను తెలియజేస్తుంది. మన ప్రేమను, మన అవసరాన్ని పెంచుతుంది. కాబట్టి నిజానికి రెండూ అవసరమే. అర్థమవుతోందా? నా ఉద్దేశ్యాన్ని స్పష్టంగా చెబుతున్నాను కదా?

మన సాధన – మనం సాధన అని అనుకునేది – కేవలం మన ప్రేమకు, మన అవసరానికి వ్యక్తీకరణ మాత్రమే. వ్యక్తం చెయ్యకుండా ఉండటం మన వల్ల కాదు. మనం దానిని వ్యక్తం చెయ్యాల్సిందే. ఇలా మన అవసరాన్ని వ్యక్తం చేస్తూండటం వలన, ప్రేమ ఇంకా పెరుగుతుంది, ఇంకా దృఢమవుతుంది. మనలో ప్రేమ, ఆర్తి పెరిగేకొద్దీ మనం లక్ష్యాన్ని చేరుకోవడానికి గల అవకాశాలు పెరుగుతాయి. ఇలా పరోక్షంగా, మన సాధన మనం పొందే ఫలితంతో సంబంధాన్ని కలిగివుంటుంది. కానీ ప్రత్యక్షంగా మాత్రం

మనకు ఫలితాన్నిచ్చేది మనం చేసే సాధన కాదు, అది అనుగ్రహం మాత్రమే. అనుగ్రహం నీ సాధన మీద ఆధారపడి లేదు, అది మీ అవసరం మీద ఆధారపడి ఉంటుంది. ఇప్పుడర్థమయిందా?

**భక్తుడు:**

ప్రేమమార్గంలో నూటికి నూరుశాతం ప్రేమ ఉండితీరాలేమో అనిపిస్తోంది.

**గురువుగారు:**

నూరుశాతం కాకపోయినా పదిశాతం ఉన్నా మంచిదే, ఎందుకంటే అది ప్రేమ. నీకు బాగా ఆకలిగా ఉన్నప్పుడు కడుపునిండా భోజనం దొరకలేదని ఓ ప్లేటు ఇడ్లీలను వద్దంటావా? "నాకు బాగా ఆకలిగా ఉంది. భోజనం కడుపు నిండా పెడితే పెట్టండి లేకపోతే అసలు భోజనమే వద్దు" అని అంటావా? లేదు కదా! ఒక్క ఇడ్లీ పెట్టినా తీసుకుంటావు. ఇక్కడ కూడా జరిగేదదే, నువ్వు ప్రేమిస్తున్నావు, నీలో ప్రేమ క్రమంగా పెరుగుతోంది, అంతేగానీ ఎప్పుడో స్నాతకోత్సవం పెట్టి ప్రేమ సరిపోయిందని నీకేమీ పట్టా ప్రదానం చెయ్యరు. అది అలా ఉండదు. ప్రేమ పెరిగే కొద్దీ సంతోషమూ పెరుగుతుంది, దానితో పాటు సంతృప్తీ పెరుగుతుంది.

ముందు రెండు ఇడ్లీలు సరిపోతాయి అనిపిస్తుంది. కానీ ఆ రెండూ తిన్న తరువాత, "లేదు, ఇవి సరిపోవు" అని తెలుస్తుంది. అప్పుడు మళ్ళీ మనం ఆహారం కోసం ప్రయత్నిస్తాము. ఇంక ఇంతకన్నా అవసరం లేదు అని మనకనిపించినా, మనకు పూర్తిగా సంతృప్తి కలిగేదాకా మనం ప్రయత్నిస్తూనే ఉంటాం. దానిని పొందిన

తరువాత దాని గురించి చెప్పడానికి ప్రత్యేకమైన పదం లేదు. ఆ స్థితిని నిర్దిష్టంగా ఇది అని చెప్పలేము. అందుకని, ఇక్కడ ఈ విషయంలో ప్రారంభం నుండి గమ్యం వరకు, మొత్తం మార్గమంతా ఆనందంగా ప్రేమమయంగా ఉంటుంది. అక్కడ ప్రేమ ఉంటుంది కాబట్టి ఆనందం కూడా ఉంటుంది. అంతేగానీ తరువాత ఎప్పుడో ఆనందం వస్తుందని దాని కోసం ఇప్పుడు మనం బాధలుపడాలి అని కాదు. మనం ప్రేమతో మొదలుపెడతాం, ప్రేమైక పథంలో పురోగమిస్తాం, ఆ ప్రేమలోనే గమ్యాన్ని చేరుకుంటాం. అప్పుడు మనం సరైన పథంలో ఉన్నట్లు లెక్క. ఈ మార్గంలో సాధారణంగా అందరూ అనుభవించే ఆ వేదన మామూలుగా అనుకునే వేదన కాదు – అది శారీరకమైన బాధనో, చిత్రహింస వంటిదో కాదు – అది ప్రేమ కోసం మనిషి పడే తపన. ఈ తపన ఒక రకమైన వ్యథగా అనుభవమవుతూ, వ్యక్తమవుతూ ఉంటుంది. కానీ నిజమైన (భౌతికమైన) వేదన కాదు; అది చాలా మధురంగా ఉంటుంది. అది ఉద్వేగభరితంగా ఉంటుంది – అది మనం కావాలనుకున్నది. కాబట్టి ఈ తపన కూడా దానికదే ఒక రకమైన ఆనందాన్నిస్తుంది.

**గురువుగారు:**

ప్రేమను ఎలా వికసింపజేసుకోవాలి, ఎలా పరిపుష్టం చేసుకోవాలి, ఎలా సంవృద్ధం చేసుకోవాలి, ఎలా పెరిగేలా చేసుకోవాలి – అని ఆమె అడుగుతోంది. ప్రేమ పెరిగేలా చేయడానికి పద్ధతిగానీ, ఒక ప్రక్రియగానీ ఏమీలేదు. ఒక్క విషయం మాత్రం చెప్పుకోవచ్చు. నీలో ప్రేమ ఉందని, నీకు ఆ ప్రేమ యొక్క అవసరముందని

తెలుసుకున్నప్పుడు, ఇంకా నువ్వు దానిని అనుభూతం చేసుకోవాలి అనుకున్నప్పుడు, ఆ ప్రేమను అత్యధికంగా పరిపుష్టం చేసేటటువంటి వాతావరణంలో నిన్ను నువ్వు ఉంచుకోవడానికి ప్రయత్నించాలి లేదా అటువంటి వాతావరణాన్ని నువ్వు ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడు ప్రేమ దానికదే పెరుగుతుంది. అనుకూలమైన వాతావరణాన్ని కల్పించినపుడు మొక్క పెరుగుతుంది. అంతే. మొక్క పెరగడానికి నువ్వు ఏమి చేస్తావు? నువ్వు చేసేదేమీ ఉండదు. నీరు, ఎరువు, తగిన పరిస్థితులు కల్పించడం ఇలా నువ్వు దానికి ఆలంబన మాత్రమే ఇస్తావు. నువ్వు ఇవ్వాల్సింది అంతవరకే, అది సరిపోతుంది. అంతే కానీ నువ్వు ఆ చిన్న మొక్కని చేతిలోకి తీసుకుని దానిని నిటారుగా చేసినంత మాత్రాన అది పెరుగుతుందా? (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు:**

తగిన వాతావరణం అంటే ఏమిటి?

**గురువుగారు:**

ఎక్కడైతే నీ ప్రేమకు అడ్డంకులు లేకుండా ఉంటాయో అది. అక్కడ ప్రేమను పొందడానికి, ఆ ప్రేమను అనుభూతి చెందడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. ఎక్కడైతే ఆ ప్రేమ రకరకాల వారికి రకరకాల రూపాల్లో అనుభవమవుతూ, వారితో పంచుకోబడుతూ ఉంటుందో అటువంటి వాతావరణం. అక్కడ నీకు సరైన వాతావరణమున్నట్లు లెక్క.

నువ్వు అటువంటి వాతావరణంలోనన్నా ఉండాలి లేదా నువ్వు అటువంటి వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోగలిగన్నా ఉండాలి. నేను రెండూ చెప్పాను. ఒకవేళ అటువంటి వాతావరణం లేకపోతే నువ్వే దానిని సృష్టించుకోవాలి. ఎప్పుడూ అటువంటి వాతావరణంలో

ఉండటం మీదే ఆధారపడటం సరైనది కాదు. అటువంటి వాతావరణాన్ని సృష్టించుకునే సామర్థ్యమూ కలిగివుండాలి.

ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో వరి బాగా పండుతుంది. ఇక్కడ హిమాలయాలలో ఈ కొండవాలుల్లో వాళ్ళు ఎలా చేశారో చూడండి. (వ్యవసాయ యోగ్యం కాని ఎగుడుదిగుడు కొండ భూముల్లో వరి సాగుచేస్తున్న వారి పద్ధతులను గురువుగారు ఉదహరిస్తున్నారు) అక్కడ వాళ్ళు వరిసాగుకు తగిన పరిస్థితులు కల్పించారు. ఆ కొండరాళ్ళతో గట్టులా కట్టి, కాలువలు తీశారు, ఆ ప్రక్కనే నీటిని నిలువచేసుకునే ఏర్పాట్లు చేశారు. చూడండి వాళ్ళు వరి పండటానికి కావలసిన వాతావరణాన్ని కల్పించారు. అది వరిని సాగుచెయ్యడానికి అనువైన ప్రదేశం కాదు. కానీ వాళ్ళు దానిని అనువుగా చేసి, వరిని సాగుచేస్తున్నారు. మనం చెయ్యవలసినది కూడా అదే.

**భక్తుడు:**

మేము దానిని చెయ్యడం ఎలా?

**గురువుగారు:**

సత్సంగంతో ఉండటం, సత్సంగాన్ని ఏర్పాటు చేసుకోవడం, అదే రకమైన ఆలోచనా దృక్పథం ఉన్నవారితో కలసివుండటం, వారితో ప్రేమను పంచుకోవడం. ఇలా మీ ప్రేమను పంచుకోండి.

**గురువుగారు:**

పరిపూర్ణానందానికి 'ఇది ఫలానా' అని మీరు పేరు పెట్టాలనుకుంటే అది సాధ్యంకాదు. ఎందుకంటే అది అనుభవంగా పొందేటటు వంటిది. దానిని మీరు అనుభవంగా పొందాల్సిందే! మీరు నిజమైన

ఆనందాన్ని పొందినపుడు, మీరు అది ఇంకా పెరగాలనుకుంటారు. పరిపూర్ణత్వం గురించి మీకున్న ఊహ ఏదైనా సరే... అలా సంపూర్ణంగా ఆ ఆనందాన్ని నిలుపుకోగలిగిన సామర్థ్యం మనకు కలిగేవరకు, మీరు దానిని ఇంకా ఇంకా, మరింతగా మరింతగా పొందాలనుకుంటారు.

**భక్తుడు:**

'సామర్థ్యం' అంటే మీ ఉద్దేశ్యమేమిటి?

**గురువుగారు:**

ప్రేమించగలిగే సామర్థ్యం, ప్రేమను స్వీకరించగలిగే సామర్థ్యం; మీ ప్రేమను అంటిపెట్టుకోగలిగే, మీ ప్రేమను నిలుపుకోగలిగే సామర్థ్యం; ఇతర విషయాల ప్రభావాల వలన విచలితం కాకుండా ఆ ప్రేమలో స్థిరంగా ఉండగలగడం; ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఆ ప్రేమ చెక్కుచెదరకుండా ఉంచుకోగల సామర్థ్యం, ఆ పటుత్వం... ఇవన్నీ సామర్థ్యాలే.

మీ కంప్యూటర్ పనిచేయడం మానివేసిందనుకుందాం. మీ హార్డ్‌డిస్క్ ఖాళీగా ఉన్నట్లు కనిపిస్తోంది, మీకెలా ఉంటుంది? గంటల తరబడి సమయం వెచ్చించి, వివిధ రకాలైన అప్లికేషన్స్ (Disk Warrior, Norton, TechTool, Repairing Permissions) వాడి, దానిని, దీనిని కలిపి – కనిపించకుండా పోయిన ఆ సమాచారాన్ని రాబట్టడానికి వివిధ రకాలుగా ప్రయత్నిస్తూనే ఉంటారు. అది మీకు అంతగా అవసరమైనది కాకపోతే మీరు ప్రయత్నించడం మానేస్తారు. కానీ మీ ప్రేమ పట్టుదలను ఇస్తుంది. రకరకాలుగా ఆలోచించడం, ఆ ఆందోళన, ఆ వేదన, ఆ తపన... అది తిరిగి పనిచేయడం

మొదలయ్యాక, మీ సమాచారం తిరిగి పొందాక కలిగే ఆనందం. ఎంత సంతోషం...!

**భక్తుడు:**

ప్రతి ఒక్కరికీ ఆ సామర్థ్యం ఉంటుందా?

**గురువుగారు:**

అవును, ప్రతి ఒక్కరికీ ఆ సామర్థ్యాన్ని సాధించుకొనే యోగ్యత ఉంది. సామర్థ్యమైతే ఉంది కానీ తగినంత ప్రేమ లేదు. ప్రేమ ఉంటే అదే ఆ సామర్థ్యాన్నిస్తుంది. ప్రతి ఒక్కరికీ ఆ శక్తిని, ఆ సామర్థ్యాన్ని ఇచ్చేది ప్రేమే. ప్రతి ఒక్కరికీ ఆ సామర్థ్యాన్ని సాధించుకోవడం సాధ్యమే.



శిరిడీ, 1998



# లక్ష్యసిద్ధిని లభింపజేసే ముచ్చటైన మూడు సూత్రాలు

**గురువుగారు:**

ఇటీవల కొంతమంది వచ్చి, "గురువుగారూ! మాకో సమస్య ఉంది. మమ్మల్ని ఎవరైనా 'గురువుగారిది ఏ రకమైన మార్గం? వారిది భక్తిమార్గమా?' అని అడిగినపుడు మేము ఏమని చెప్పాలి?" అని అడిగారు. ఎందుకనంటే నేను భక్తి అనే పదం వాడను. ఇది జ్ఞానమార్గమా అంటే నేను జ్ఞానమనే పదాన్ని వాడను. ఇది కర్మయోగం అందామా అంటే నేను కర్మ అనే పదమూ వాడను. ఆ మాటకొస్తే నేనసలు యోగినే కాదు. (గురువుగారు నవ్వుతూ...) అందువల్ల వాళ్ళు, "అసలు మేమనుసరిస్తున్న మార్గమేమిటి అని అందరూ అడుగుతున్నారు. మేము ఏమని చెప్పాలి?" అని అడిగారు. నేను, "గురువుగారిది స్పష్టతతో కూడిన ఆనందమైన మార్గం" అని

చెప్పండి అన్నాను. ఇది ఒక మార్గం కాకపోయినప్పటికీ, సరదాకు అలా చెప్పమన్నాను. కారణమేమిటంటే అన్నింటి కంటే ముఖ్యమైనది – స్పష్టత! ప్రతి విషయంలోనూ స్పష్టత ఉండాలి. మనమనుకునే ఆ నిర్వాణమో, ముక్తో, మోక్షమో లేదా బాబా సాక్షాత్కారమో, అదేదైనా గానీ, ఒకవేళ మనకు అది వస్తే కూడా దాని పట్ల నిస్సంశయంగా ఉండటానికి స్పష్టత అవసరం. ఉదాహరణకు, కొంతమంది నా దగ్గరకు వచ్చి, "గురువుగారూ, నన్ను నేను తెలుసుకున్నాననుకొంటున్నాను! నేను ఆత్మసాక్షాత్కారం పొందడం నిజమేనా? (గురువుగారు నవ్వుతూ...) గురువుగారూ, నాకు ముక్తి అనుభవమైంది. నిజంగా నేను ముక్తుణ్ణా?"... ఇలా అడుగుతుంటారు. వాళ్ళకు దానిపట్ల కూడా సందేహముంది; అంటే వాళ్ళకు స్పష్టత లేదన్నమాట. నిజానికి మనకసలు ఏ విషయంలోనూ స్పష్టత ఉండదు. కాబట్టి మనకు ముందుగా కావలసింది స్పష్టత, దాని వలన కలిగే ఆనందం. మన ఆనందానికి గనుక స్పష్టత లేకపోతే, నిజంగా దానిని మనం ఆనందమని కూడా అనుభూతి చెందలేం. స్పష్టత, ఆనందం అనేవి కలసి ఉంటాయి. అందుకే ఈ మార్గం స్పష్టతతో కూడిన ఆనందమైన మార్గం. దీనికి మీరు ఇంకా ఏమైనా పేర్లు కలిపి పెట్టుకున్నా ఇబ్బందేం లేదు, అవేమంత ముఖ్యం కాదు.

భక్తుడు:

గురువుగారూ, ఈ స్పష్టత అనేది మనకు మనం సాధించుకునేదా? లేకపోతే మనకు ఎవరైనా ఇస్తే వచ్చేదా?

**గురువుగారు:**

మీకు నిజంగా అవసరం ఉంటే ఆ స్పష్టత వస్తుంది, ఆ స్పష్టతను పొందుతారు, మీరు ఆ స్పష్టతను సాధించుకుంటారు. నేను దానిని

సాధించమనే చెప్తున్నాను. స్పష్టత ఎవరో ఇస్తారని నేను చెప్పడం లేదు, మీరు దానిని సంపాదించుకోవాలని చెప్తున్నాను! "ఊరికే అలా కూర్చోండి మీకు స్పష్టత వస్తుంది, నేను మీకా స్పష్టతనిస్తాను" అని నేను చెప్పను. అది మీకలా అనుభవం కావచ్చేమోగానీ, అదేమీ ముఖ్యమైన విషయంకాదు. నేను చెప్పేది మాత్రం – మీ స్పష్టత మీరే సాధించాలి. సాధించండి!

**గురువుగారు:**

చాలామంది దేనినీ సరైన రీతిలో పూర్తిగా చేయలేరు. అలాంటి వారికి నేను, "నాకు ఇది నిజంగా ఎంతవరకు అవసరం? నిజంగా అవసరమా?" అనే స్పష్టత తెచ్చుకోమని చెబుతాను. ఆ స్పష్టత వచ్చాక, అంటే ఉదాహరణకు వాళ్ళు, "నా తొలి ప్రాధాన్యత ప్రాపంచిక బాధ్యతలు, నా కుటుంబ బాధ్యతలు చూసుకోవడం – ఇది ఎనభైశాతం; మిగతా ఇరవై శాతం అవసరం ఆధ్యాత్మికపరమైనది. ఇది తప్పకుండా ఉందికానీ, కుటుంబపరమైన, వృత్తిపరమైన మిగతా అవసరాలు ఎక్కువగా ఉన్నాయి" అని చెప్పారనుకోండి. మీకు అటువంటి స్పష్టత ఉన్నప్పుడు, మీరు ఆధ్యాత్మిక విషయాలలో ఆ ఇరవైశాతాన్ని వినియోగించుకొని ఆనందానుభూతి పొందుతారు. ఈ ఇరవైశాతంతో పాటు ఇంకా మిగిలిన ఎనభై శాతాన్ని కూడా ఆనందంగా ఆస్వాదించగలుగుతారు. ఆ స్పష్టత గనుక మీకు లేనట్లయితే మీరెప్పుడూ సంఘర్షణలో ఉంటూ, ఆ ఊగిసలాటలో జీవిస్తూ – ఇటు ప్రాపంచికంగానూ సరిగా ఉండలేరు, అటు పారమార్థికంగానూ సరిగ్గా ఉండలేరు. అందుకనే నేను, మొదట

మిమ్మల్ని స్పష్టత తెచ్చుకోమంటాను. మీరు ఇక్కడ ఎందుకోసం ఉన్నారు? "మేము ఆధ్యాత్మిక సాధకులం, మా జీవితాలన్నీ పూర్తిగా ముక్తికి, మోక్షానికి అంకితం. కానీ ఇతర అవసరాలు మమ్మల్ని ఇబ్బందిపెడుతున్నాయి" అని చెప్పి మిమ్మల్ని మీరు వంచించుకోవద్దు. ఇలా చెప్పుకోవద్దు. నిజంగా ముక్తి కోసం కలత చెందేవారికి ఈ "ఇతర విషయాలు" ఉండవు; వారు రమణమహర్షిలా ఉంటారు. కానీ మనకు ఆయనకున్న స్వచ్ఛమైన స్వభావం, ఆయనంత స్థాయి లేవు. చాలా వ్యామోహాలు మనల్ని లాగుతున్నాయి. మనకు స్పష్టత, అవగాహన లేకపోవడం వలన మనం చాలా వైపులకు అలా లాగబడుతూ పెనుగులాటలో ఉంటాం. మన అవసరాలు మనల్ని అనేకరకాలుగా కొన్ని ఇటువైపు, కొన్ని అటువైపు లాగుతున్నందువల్ల ఈ అవసరాలు తీర్చుకోవడంలో మనకు వైరుధ్యం, సంఘర్షణ ఏర్పడుతుంది. కానీ మీరు స్పష్టత తెచ్చుకుని, ఆ అవసరాలను క్రమపద్ధతిలో పెట్టుకుని సామరస్యాన్ని సాధించగలిగితే అవి ఒకదానితో ఒకటి ఘర్షణపడకుండా, పోటీపడకుండా ఉంటాయి. అలా అయినపుడు మీరు కనీసం మీ అవసరాలనైనా సామరస్యంతో అనుభవించగలుగుతారు.

మన మనసులో ప్రతి విషయం యొక్క స్థానం ఏమిటనే స్పష్టత వచ్చాక, మన జీవితంలో ప్రతి అణువునూ ఎటువంటి సంఘర్షణ, వైరుధ్యం లేకుండా మనం పరిపూర్ణంగా అనుభవించగలం. నేను, ఈ సంఘర్షణ నుండి మిమ్మల్ని మీరు విముక్తి చేసుకోండి అంటున్నాను. అయస్కాంతం, ఇనుపముక్క ఉదాహరణలో గల మూలసూత్రం వంటిదే ఇది! దీనిని మీకు అన్వయించుకోండి. ఇనుపముక్కకు, అయస్కాంతానికి గల తేడా ఏమిటి? రెండింటిలోనూ అణువుల

సంఖ్య సరిసమానంగా ఉంటుంది. వాటిని వేరుచేసేదేమిటంటే, అయస్కాంత క్షేత్రంలో ఉన్న ప్రతి అణువు క్రమబద్ధంగా, ధృవీకృతమై, మిగతా అణువులతో సామరస్యాన్ని కలిగివుంటుంది, దాని అస్తవ్యస్తత నశిస్తుంది, అది అయస్కాంతంగా మారుతుంది. ఇనుపముక్కను అయస్కాంతంగా మార్చడానికి సులభమైన మార్గం దానిని మళ్ళీ మళ్ళీ అయస్కాంతంతో రుద్దడం, దానిని అయస్కాంత క్షేత్రంలో ఉంచడమే. క్రమంగా అయస్కాంత సాంగత్యం వల్ల ఇనుప అణువులు తమ అస్తవ్యస్తతను కోల్పోయి క్రమతను పొంది ధృవీకృతమవుతాయి. నెమ్మదిగా, అవి ఒకదానితో ఒకటి ఒద్దికను పొంది సమగ్రతను సాధించి వాటికవే అయస్కాంతంగా మారుతాయి. మన విషయంలో మనమంతా ఇనుపముక్కలం, బాబా మన అయస్కాంతం. బాబాను గుర్తు పెట్టుకోవడం, మన మనస్సును తిరిగి తిరిగి బాబా మీద లగ్నం చేయడం, మనల్ని మనం ఎంత వీలైతే అంత బాబా సన్నిధిలో ఉంచుకోవడం, శిరిడీకి వెళ్ళడం ద్వారా భౌతికంగా కూడా ఆయన సన్నిధిలో ఉండడం, ఇవన్నీ తిరిగి తిరిగి అయస్కాంతంతో రుద్దడం వంటివే. తద్వారా మనం సామరస్యాన్ని సాధిస్తాం.

**గురువుగారు:**

నేను మిమ్మల్ని ఫలానా పని చెయ్యమని అడగడంలేదు. మీరు వచ్చి మేము ప్రేమించేటటువంటి లక్ష్యం (సద్గురువు) 'ఫలానా' అని అన్నప్పుడు, మీ ఆనందం అందులోనే ఉందని చెప్పినపుడు, మీరు దానిని పొందేదాకా దాని మీదనే లగ్నం చేయండి అంటాను.

"నా ఆనందం ఇందులో ఉంది" అని మీరు అంటున్నారు కానీ దాని కోసం ఏమీ చెయ్యడంలేదు. దాని మీద దృష్టిపెట్టండి! మీరు, "నేను పరీక్షలో పాస్ కావాలనుకుంటున్నాను. ఇది నాకు చాలా అవసరం, నాకు ఈ డిగ్రీ కావాలి" అంటారు. వచ్చి ఇలాగే అడుగుతుంటారు. నేను చెప్పగలిగింది ఏముంటుంది? "మంచిది, మీకు నిజంగా అంతగా పాస్ కావాలనుంటే కష్టపడి చదవండి!" అంటాను. నేను మిమ్మల్ని పరీక్షలో పాస్ కమ్మని చెప్పడంలేదు, ఆ డిగ్రీ తెచ్చుకోమనీ చెప్పడంలేదు, అలాంటిదేంలేదు. కానీ మీరు నాదగ్గరకు వచ్చి, "నాకు ఈ డిగ్రీ కావాలి, నేను ఈ పరీక్షలో పాస్ కావాలి!" అని చెప్పినపుడు, నేను 'ఇదిగో ఇలా చెయ్యండి' అని చెప్తాను. మీరు ఈ పరీక్షలో పాస్ కావాలనుకుంటున్నాము అని చెప్తూ, రోజూ సినిమాలకు పోతూ, స్నేహితులతో పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకుంటూ, సముద్రపు ఒడ్డున తారట్లాడుతూ ఉంటే, అప్పుడు నేను, "ఇది పద్ధతి కాదు, మీ రూములో కూర్చొని కష్టపడి చదవండి" అంటాను. ఇదీ నేను చెప్పేది.

మీరు గనుక, "లేదు లేదు, నేను ఇంత కష్టపడి చదవాల్సి వస్తే నేను ఈ పరీక్షలో పాస్ కావాలనుకోవడం లేదు, ఇదంతా అవసరం లేదు" అన్నారనుకోండి. అప్పుడు మీకు కనీసం ఆ స్పష్టతయినా ఉంటుంది! అలా కాకుండా మీరేమో నా దగ్గరకొచ్చి, "గురువుగారూ! మేము అంతదూరం నుండి మీ కోసం వచ్చాము, మీ సాన్నిధ్యాన్ని పూర్తిగా అనుభూతి చెందాలనుకుంటున్నాం గురువుగారూ!" అని చెబుతున్నారు. ఇలా చెప్పినపుడు "అలా అయితే సరైన పద్ధతిలో చెయ్యండి" అని మాత్రమే నేను చెప్పగలను. నేను చెబుతున్నది అదే. (గురువుగారు గుసగుసలను అభినయిస్తూ...) "రండి, నా

సాన్నిధ్యాన్ని అనుభవించండి!" అని నేను మిమ్మల్ని ఇక్కడకు రమ్మని పిలువలేదు. నేను ఎన్నడూ అలా చెయ్యలేదు. ఇక్కడకు వచ్చి "మేమిక్కడ ఎంతో సంతోషంగా ఉన్నాం, మాకు ఇక్కడ సంతృప్తిగా ఉంది, మేము మీకోసం వచ్చాం" అని చెప్పింది మీరు. నిజంగా మీరు నాకోసం వచ్చుంటే దానిని చేతల్లో చూపించండి. ఆమూలాగ్రమూ అలా చెయ్యండి. అలా కాకపోతే, ఎందుకు ఇక్కడ మీ సమయం వృథా చేసుకోవడం? వెళ్ళి మీకు మరింత లాభమొచ్చేటటువంటి, ఉపయోగకరమైన ఇతర విషయాలను సాధించుకోండి, నా ఉద్దేశ్యం ఇది. మీకు ఒక లక్ష్యాన్ని (Goal ని) నేనెన్నటికీ నిర్దేశించను. మీ లక్ష్యాన్ని సాధించడానికి నేను సహాయం మాత్రమే చేస్తాను. మీ లక్ష్యం మీరే నిర్ణయించుకోవాలి. అలా నిర్ణయించుకున్న తరువాత, బంతి (అవరోధాలు) వచ్చి మీ లక్ష్యాన్ని (Goal ని) తాకకుండా మంచి గోల్‌కీపర్‌లాగా దానిని కాపాడుకోవాలి.

**గురువుగారు:**

నేను ఈ విషయాన్ని ఎన్నోసార్లు చాలా చాలా స్పష్టంగా చెప్పాను. "ఇది చాలా మంచి లక్ష్యం, దాని తరువాత రెండవ స్థానం ఆ లక్ష్యానిది" అని మీ లక్ష్యాల విషయంలో నేనెప్పుడూ సలహాలివ్వను. మీ లక్ష్యం యొక్క ఎంపిక మీదే. మీ లక్ష్యాన్ని మీరే ఎంచుకోవాలి. ఎలా ఎంచుకోవాలి? అని అడిగితే ఇది నేను చెప్తాను: ఏదైతే మీకు అత్యంత సంతోషాన్ని కలిగిస్తుందో, మీ హృదయంలో ఎక్కువ ప్రేమను కలిగిస్తుందో అటువంటి దానిని ఎంపిక చేసుకోండి. అది ఏదైనా ఫర్వాలేదు. అది సామాజిక సేవయినా, పర్యావరణ సంరక్షణయినా

మరేదైనా సరే వెళ్ళి ఆ పని చెయ్యండి. మీకది ఆనందాన్నిస్తూ ఉంటే వెళ్ళండి! అది మీ లక్ష్యమైతే నేను దానికి వ్యతిరేకిని కాదు. అంకిత భావంతో, సంతోషంతో ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనేవారిని నేను గౌరవిస్తాను. వారు దారి తప్పారనో, ఆధ్యాత్మికపంథాలో లేరనో నేను అనను. వారిపట్ల నాకు అంతే సమంగా గౌరవభావముంటుంది. అయితే మీ లక్ష్యాన్ని మీరే ఎన్నుకోవాలి. వాళ్ళు వాళ్ళ లక్ష్యం పట్ల ఎంత అంకితభావంతో, తదేకతతో ఉన్నారో మీరూ మీ లక్ష్యం పట్ల, అది బాబాను ప్రేమించడమైనా, మరొకటైనా, అంతే తదేకతతో ఉండాలి. అందరికీ నేనిచ్చే సలహా ఏమిటంటే, మీ హృదయంలో ప్రేమను కలిగిస్తూ, మిమ్మల్ని ఆనందభరితుల్ని చేసేటటువంటి దానిని ఎన్నుకోండి, దానికి కట్టుబడి ఉండండి. దాని పైన ఇంకా ఇంకా దృష్టి పెట్టండి.

**భక్తుడు:**

గురువుగారూ, మా లక్ష్యంపట్ల దృష్టిని (ఫోకస్) నిలుపుకోవడం ఎలా? రెప్పపాటులో దానిని కోల్పోవచ్చునిపిస్తుంది.

**గురువుగారు:**

దృష్టిని నిలుపుకోవాల్సిన అవసరం లేదు. లక్ష్యం ప్రేమ నుండి వచ్చినదయితే, దృష్టిని నిలుపుకోవడానికి నిర్వహణాబాధ్యతలు నిర్వర్తించాల్సిన అవసరం ఉండదు. (గురువుగారు నవ్వుతూ...) మీకు గనుక ప్రేమ ఉంటే, మీరు దృష్టి పెట్టే లక్ష్యాన్నుంచి ప్రక్కకు మళ్ళలేరు, మీ వల్లకాదు. అదీ లగ్నం చేయడమంటే. మీరు ఒకరిని

ప్రేమించారంటే, ఆ వ్యక్తి గురించి ఆలోచించకుండా ఉండటం అనేది అసాధ్యం. మీ ఆలోచనలు ఎప్పుడూ తిరిగి తిరిగి ఆమె మీదకో, అతని మీదకో పోతూనే ఉంటాయి. కానీ కొన్నిసార్లు పాత అలవాట్లు, పాత సాంగత్యాల వల్ల, మనం ప్రేమిస్తున్నప్పటికీ కొన్ని విచారకరమైన ఆలోచనలు వస్తుంటాయి. మనం వాటిని దూరం చేసుకోవాలనుకున్నప్పటికీ మన వల్ల కాదని తెలుస్తుంది. లేకపోతే కొన్ని అడ్డంకులు వస్తాయి, మనం ఎదుర్కోక తప్పని కొన్ని అడ్డంకులెదురవుతాయి. ఇటువంటి సందర్భాలలో – సత్సంగం, మంచి సాంగత్యం, మనం ఇక్కడ ఎందుకున్నాం, మన లక్ష్యమేమిటి అని ఆలోచించడం వంటి మంచి విషయాలు మన దృష్టిని నిలుపుకోవడానికి సహాయం చేస్తాయి. మీకందరికీ ఇలాగ దృష్టిని నిలుపుకోవడానికి అవసరమైన సూత్రాలు బాగా తెలుసు. మీకు నచ్చినదానిని ఉపయోగపెట్టుకోండి.

భక్తుడు:

గురువుగారూ! మా సంతోషానికి, దుఃఖానికి మేమే బాధ్యులమని అంగీకరించగలిగితే మేము ఆనందంగా ఉంటామంటారా?

**గురువుగారు:**

మీరు ఆనందంగా ఉన్నా లేకపోయినా, మీరు ఏ దుఃఖమైతే బయటి నుండి వస్తుంది అనుకుంటున్నారో కనీసం అదన్నా ఆగిపోతుంది.

భక్తుడు:

ఆ బాధ్యత మాదేనని అంగీకరించడం వల్లనా?

**గురువుగారు:**

మీ ఆనందానికిగాని, దుఃఖానికిగాని ఇతరులు బాధ్యులు కారని తెలుసుకోవడం ద్వారా! ముందు మీరు వాళ్ళకు విముక్తి కల్పిస్తారు, తరువాత వాళ్ళ నుండి మిమ్మల్ని మీరు విముక్తుల్ని చేసుకుంటారు, కొంతలో కొంతైనా ఓ విధమైన స్వాతంత్ర్యం, విముక్తి పొందుతారు.

**భక్తుడు:**

గురువుగారూ! ఆ విధంగా మమ్మల్ని మేము చూసుకోవడం ఎలా? మేమే (ఆనందానికి, దుఃఖానికి) బాధ్యులమని నిజంగా తెలుసుకోవడం ఎలా?

**గురువుగారు:**

ముందుగా ఇతరుల్ని నిందించడం ఆపండి. స్పష్టంగా ఉండండి! అప్పుడు అది సులభమవుతుంది. మనల్ని మనం భ్రమలో పెట్టుకొని దానిని ఒక సమస్య చేసుకుంటాం. తర్వాత అది ఒక అలవాటుగా, ఆలోచనాసరళిగా మారుతుంది. అందుకనే నేను చెప్పేది: ముందు మీరు దాన్ని ఆపితే – ప్రపంచంలో మీరు నిందించడానికి ఇక ఎవ్వరూ లేకపోతే – మీకు నిందించుకోవడానికి మీరు, లేదంటే బాబా తప్ప ఇక ఎవ్వరూ లేరనే కనీస స్పష్టతన్నా వస్తుంది.

ఇప్పుడు నేను చెప్పేదానిని ప్రతి ఒక్కరూ తమ స్వంత సమస్యలను ఆధారం చేసుకొని, వారి వారి అవగాహననూ, దృక్పథాన్నీ అనుసరించి తమ తమ రీతుల్లో అర్థం చేసుకుంటారు. కానీ అందరికీ వర్తించే (సార్వత్రికమైన) విషయానికొస్తే, అందులో మూడు అంశాలు ఉన్నాయి. వీటిని ఎప్పుడూ గుర్తుంచుకోండి. ఇప్పటివరకు జరిగిన అన్ని సత్సంగాలు, నేను గంటల తరబడి మాట్లాడిన మాటలు… వీటన్నింటికీ ముఖ్యమైనవి మూడు అంశాలు.

మొట్టమొదట మీకొక లక్ష్యం, ఒక ధ్యేయం ఉండాలి. మీకు ఏం కావాలో, మీరు దేని కోసం తాపత్రయపడుతున్నారో మీకు తెలియాలి. ఒకవేళ మీకు ధ్యేయమంటూ ఒకటి ఉంటే ఆ ధ్యేయాన్ని గుర్తుపెట్టుకోండి. మీరు తిరువణ్ణామలైకిగానీ, శిరిడీకి గానీ వస్తున్నప్పుడు మీకొక ధ్యేయమో లేదా లక్ష్యమో ఉందని భావిస్తారు. కనీసం ఏదో ఒకటి ఉందనైనా అనుకుంటారు. అది ఏదైనా సరే, అసలు మీరు దానిని గుర్తుంచుకుంటున్నారా? మనం ఇక్కడ ఎందుకున్నాం? మనం ఎందుకోసం వచ్చాం? – దీనిని ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి.

రెండవది, మనం లక్ష్యంపట్ల, ధ్యేయం పట్ల మనకుండే ఈ ఎఱుక, మన చుట్టూ ఉండే రకరకాల పరిస్థితులవల్ల నీరుగారిపోకుండా, దారి తప్పిపోకుండా, మరలిపోకుండా కాపాడుకుంటూ, మనల్ని ఆకర్షణకు లోనుచేసే పరిస్థితులను కట్టడి చేసుకుంటూ మన లక్ష్యానికి దూరం కాకుండా ఉండాలి. మన లక్ష్యం, దాని మీద మనం దృష్టిపెట్టడం రెండూ పరస్పరం ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. కాబట్టి మన లక్ష్యం పట్ల మనం నిజంగా జాగరూకతతో ఉన్నామా, లేక ప్రక్కకు లాగబడి దారి తప్పి పథభ్రష్టులమయ్యామా అని తెలుసుకోవడానికి – ప్రతిరోజూ మీరు ఏం చేస్తున్నారు? ఎక్కడికి పోతున్నారు? అనే విషయం చూసుకోండి.

మూడవ అంశం, ఏది మనలో ప్రేమను కలిగిస్తుందో ఆ సాంగత్యంలో ఉండటం, దాని మీద దృష్టి ఉంచడం. మనం మన లక్ష్యం పట్ల మనకు గల తదేకతను పెంపొందించే పనులు చేస్తున్నామా? నిజంగా అటువంటి పనులే చేస్తున్నామా? మన లక్ష్యం పట్ల మనం జాగ్రత్తగా ఉంటున్నామా? మన ధ్యేయం స్థిరంగా ఉందా? మనం

దానిని గుర్తుపెట్టుకుంటున్నామా? లేదా మరచిపోతున్నామా? మీరు రోజు ఎలా గడుపుతున్నారు అనే దానిని గమనించండి. గత ఇరవై సంవత్సరాల సంగతి కాదు – అది అవసరంలేదు; ఒక్కరోజును పరిశీలించండి! మీరు ఒక్క రోజును మచ్చుకి తీసుకొని, మీరు ఎలా గడుపుతున్నారో పరిశీలించుకోండి. మిమ్మల్ని మీరు "నేనిక్కడకు ఎందుకు వచ్చాను? నేను ఏం చేస్తున్నాను? నేను ఏం ఆశిస్తున్నాను?" అని రోజుకు ఒక్కసారైనా ప్రశ్నించుకుంటున్నారా? "మేమిక్కడకు ఆత్మవిచారణ కోసం, రమణమహర్షి కోసం, భగవానుల కోసం, అరుణాచలేశ్వరుని కోసం, బాబా కోసం, గురువుగారి కోసం" వచ్చామనో అనవచ్చు. అయితే ఇక్కడకు వచ్చి, మీరిక్కడ ఎన్ని గంటలు లేదా ఎన్ని నిమిషాలు – 'గంటలు' అనడం మరీ ఎక్కువేమో – ఎన్ని నిమిషాలు మీరు నిజంగా ఆ విషయం మీద దృష్టిపెట్టి గడిపారు? నిజాయితీగా సమాధానం చెప్పండి. పోనీ, గడిచిన ఇరవైనాలుగు గంటల్లో మీ లక్ష్యం కోసం మీరేం చేశారు?

ఆలోచించండి: మీరు ఇక్కడెందుకున్నారు? మీరు మీ లక్ష్యాన్ని, మీ ధ్యేయాన్ని గుర్తుపెట్టుకుంటున్నారా? మిమ్మల్ని మీ లక్ష్యం నుండి దూరం చేసే ఇతర ప్రభావాల నుండి, ఆకర్షణల నుండి, కార్యకలాపాల నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోవడానికి నిజంగా ప్రయత్నిస్తున్నారా? మీరు నిజంగా మీ లక్ష్యం వైపు, ప్రేమించే మీ ధ్యేయం వైపు అడుగులేస్తున్నారా? అలా అయితే అందుకోసం నిజంగా మీరేం చేస్తున్నారు?

చివరిది, నేను పదే పదే చెప్పేటటువంటిది, మనమందరం గుర్తుపెట్టుకోవాల్సిన ప్రాథమికమైన, అత్యంత ముఖ్యమైన విషయం: జీవితం యొక్క అల్పత్వం; ఎంత చిన్నది ఈ జీవితం! మీరు

సమయాన్ని ఎలా గడుపుతున్నారో, ఎలా వృథా చేస్తున్నారో చూడండి. రేపు మనం ఎక్కడుంటామో మనకు తెలియదు, అయినప్పటికీ మనం శాశ్వతమైనట్లు, అజరామరులమైనట్లు, సృష్టి లయించే వరకు ఉండబోతున్నామనుకుంటూ ప్రణాళికలు వేసుకుంటూ, కూడబెట్టుకుంటూ, కాపాడుకుంటూ... ఇవన్నీ అవసరమా? స్పష్టమైన అవగాహన తెచ్చుకోండి.



తిరుమల, 1994



# పూర్ణ అవధూతకు నిదర్శనం శ్రీపూండీస్వామి

శ్రీపూండీస్వామి సుమారు 1935 ప్రాంతంలో తిరువణ్ణామలైకి 20 మైళ్ళ దూరంలో ఉన్న కలశప్పాక్కం గ్రామంలో ఉన్మత్తావస్థలో తిరుగుతూ కన్పించారు. ఆయన భారీవిగ్రహం, నడకలో ఠీవి, చూచేవారికి ఆయన ఒక మాజీ మిలటరీ అధికారిగా అనిపించేవారు. మొదట కలశప్పాక్కంలోని కాకంగరైపిళ్ళైయార్ కోవెలలోను, పాడుపడిన మసీదులోను, కొన్నాళ్ళు ద్రౌపదమ్మ కోవెలలోనూ, మరికొన్నాళ్ళు చెట్ల క్రింద రోడ్డు ప్రక్కన ఉంటూ ఉండేవారు. పైనుండి మోకాలి క్రిందదాకా కఫ్నీని పోలిన చొక్కా వేసుకొనేవారు. దానిని తీసివేసేవారు కాదు. అది చినిగి శిథిలమైతే ఎవరైనా వేరే చొక్కా వేస్తే ఆ చినిగిన చొక్కాపైనే వేయించుకొనేవారుగాని పాతది విడిచేవారు కాదు. ఆ చొక్కా జేబుల నిండా పారవేసిన ఖాళీ సిగరెట్ పెట్టెలు, చెత్తకాగితాలు, సిగరెట్ పీకలు మొదలైన చెత్తంతా కుక్కుకొనేవారు.

ఎవ్వరినీ ఏమీ అడిగేవారు కాదు – అన్నం, మంచినీళ్ళతోసహా! ఎవరైనా పెడితే పసిబిడ్డకు మల్లే నోట్లో పెట్టి తినిపించవలసిందేగాని తనకై తాను చేతితో తినేవారు కాదు. ఎవరైనా సిగరెట్ నోట్లో పెట్టి వెలిగిస్తే పొగపీల్చేవారు. తానుగా ఎవరితోను మాట్లాడేవారు కాదు. స్నానం, తైలసంస్కారం లేక వెంట్రుకలు జడలుకట్టి ఉండేవి. ఒళ్ళంతా మురికిగా ఉండి ఈగలు ముసురుతుండేవి. అయినా అవేమీ పట్టించుకొనేవారు కాదు. నడవడం మొదలిడితే అలా మైళ్ళు మైళ్ళు నిలబడకుండా నడుస్తూనే ఉండేవారు. కూర్చుంటే వారాలు, నెలలు ఇక లేవనే లేవరు. మళ్ళీ ఏదో ప్రేరణ వచ్చి లేచారా ఇక మళ్ళీ కూర్చోవడం ఎప్పటికో. ఆయన ఎప్పుడు కూర్చుంటారో, ఎప్పుడు లేస్తారో, ఎప్పుడు ఎక్కడ ఉంటారో, ఏమి చేస్తారో, ఏమి చేయరో ఎవరికీ ఊహించడానికి సాధ్యమయ్యేది కాదు. ఆయన ఎవరో, ఆయన ఊరేమో, ఎక్కడ నుంచి వచ్చారో, కులమతాలు తల్లిదండ్రుల గురించిన వివరాలు ఎవ్వరికీ తెలియవు. ఆయన భగవన్నామం స్మరిస్తుండగాగాని, ఆధ్యాత్మికప్రసంగం చేయగాగాని ఎవ్వరూ చూడలేదు.

మొదట మొదట కలశప్పాక్కం గ్రామస్థులు ఆయన్నొక పిచ్చివాడనే అనుకొన్నారు. ఒక విచిత్ర సంఘటనద్వారా ఆయన పిచ్చివాడు కాదని, అవధూతస్థితిలో తిరుగుతున్న మహాసిద్ధపురుషుడని వారు గుర్తించారు. కలశప్పాక్కం ప్రక్కగా చెయ్యార్ అనే ఒక గొడ్డేరు ఉంది. శ్రీస్వామి అప్పుడప్పుడు ఆ ఏట్లోని ఇసుకపై కూర్చుంటూ ఉండేవారు. కూర్చుంటే వారాల తరబడి లేవకుండా కూర్చొనిపోవడం స్వామివారికి సహజమేనని ఇంతకు ముందు చెప్పుకొన్నాము. ఎర్రటి ఎండకి, కణకణ కాగే ఇసుకలో మామూలుగా నడవడానికే

కష్టం. అటువంటిది అంత ఎండలోనూ హాయిగా పండువెన్నెట్లో పరుపుమీద కూర్చున్నట్లు కూర్చునేవారు. ఒకసారి వర్షాలు పడి ఆ గొడ్డేరుకి హఠాత్తుగా వరద వచ్చింది. హఠాత్తుగా వరదరావడం, నీళ్ళులేకుండా హఠాత్తుగా తగ్గిపోవడం ఆ గొడ్డేటికి రివాజే. వరదకు ముందు ఏట్లో కూర్చొనివున్న స్వామిని చూచినవారు పిచ్చిస్వామి వరదలో కొట్టుకుపోయాడని అనుకొన్నారు. వరద తగ్గిన తరువాత చాలామంది గ్రామస్థులు స్వామి కూర్చున్న ప్రాంతాలలో చూడగా స్వామి శరీరమంతా ఇసుకలో కూరుకుపోయి తలమాత్రం పైకి కనిపిస్తూ ఉంది. ఇసుకంతా తోడేసిన తరువాత స్వామి చక్కా అక్కడనుంచి లేచి వెళ్ళిపోయారు. అంత వరదలో మునిగిపోయి కూడా ఆయన చెక్కు చెదరకుండా ఉండడం కళ్ళారా చూచిన గ్రామస్థులకు ఆయన సామాన్యుడు కాడనీ, గొప్ప సిద్ధపురుషుడనీ తెలిసింది. ఈ సంఘటనతో స్వామి మహిమ క్రమంగా వ్యాపించడం ఆరంభించింది. ఈ సంఘటనవల్లే స్వామిని “ఆర్ట్ర స్వామిగళ్” అని పిలిచేవారు. తమిళంలో ‘ఆర్ట్ర’ అంటే నది, ఏరు అని అర్థం!

ఆ తరువాత ఏటికి ప్రక్కనేవున్న స్మశానం సమీపంలో స్వామికోసం ఒక పందిరి వేసారు. సుమారు 3సం॥ల పాటు స్వామి ఎక్కువగా అక్కడే గడిపేవారు. ఆ గ్రామంలో ఉండే మాణిక్యనాయనార్ అనే అతనికి స్వర్ణయోగం పిచ్చి వుండేది. అతడికెందుకో స్వామికి బంగారం తయారుచేసే పద్ధతి తెలుసుననిపించి, స్వామిని దాని కోసం వేధించేవాడు. ఆ కోరిక మనసులో ఉంచుకొని రోజూ స్వామికి భోజనం పెట్టేవాడు. కాని స్వామి ఎప్పుడూ తనకా విషయము తెలియదనీ, “బంగారం చేయాలనుకొని మానభంగం కాబోకు” అనీ అనేవారు. వేచివేచి ఆ వ్యక్తి నిరాశను తట్టుకోలేక కోపంతో స్వామి

మీద దౌర్జన్యం చేయబోయాడు. స్వామి మౌనంగా అక్కడ నుంచి లేచి, ఆ ఊరికి రెండుమైళ్ళ దూరంలో ఉన్న పూండీ వైపు సాగిపోయారు. ఈ సంఘటన 1960 ప్రాంతంలో జరిగింది. పూండీలో కూడా ఇలాగే తిరుగుతూ ఒకరోజున మెయిన్‌రోడ్డు ప్రక్కన ఉండే ఒక ఇంటి అరుగుపై కూర్చున్నారు. అంతే! ఆ కూర్చోవడం 1978లో మహాసమాధి అయ్యేంతవరకు (అంటే సుమారు 18 సంవత్సరాలు) ఆ అరుగుమీద నుండి లేవలేదు. శాస్త్రాల్లో చెప్పబడ్డ అజగరావస్థ అంటే ఏమిటో దానికి స్వామి సజీవ నిదర్శనం.

*— పూజ్యశ్రీ బాబూజీ విరచిత "పూర్ణ అవధూతకు నిదర్శనం శ్రీపూండీస్వామి"*
*(జనవరి, 1988 'సాయిపథం' మాసపత్రిక) నుండి...*

**భక్తుడు:**

గురువుగారూ! ఒకసారి స్వర్గీయ కంచి శంకరాచార్యులు "మేమంతా బల్బులమైతే పూండీస్వామి ట్రాన్స్‌మీటర్ లాంటివారు" అని అన్నారని విన్నాం. ఇప్పటికీ ఆయన ఆ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారా?

**గురువుగారు:**

అవును. అది ఇప్పటికీ జరుగుతూనే ఉంది. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీచంద్రశేఖరేంద్రసరస్వతీ స్వామివారు పూండీస్వామివారి గురించి మాట్లాడుతూ, *"మేమంతా బల్బులమైతే పూండీస్వామి ట్రాన్స్‌మీటరు లాంటివారు, అక్కడ స్విచ్ వేస్తే గానీ ఇక్కడ బల్బులు వెలగవు"* అని అన్నారు. అప్పుడప్పుడూ మనం లైట్లు ఆపేస్తాం లేదా ఏదైనా బల్బు కాలిపోతుంది, కానీ ట్రాన్స్‌మీటరు మాత్రం అక్కడే

ఉంటుంది. అక్కడున్న ట్రాన్స్‌మీటరులో అది ట్రాన్స్‌మీటరు అని చూపించడానికి బల్బు ఉండదు – అదీ సమస్య! (గురువుగారు నవ్వుతూ...) ట్రాన్స్‌మీటరును చూసి అది పనిచేస్తుందా లేదా అని చెప్పలేం. వెలుగుతున్న బల్బును చూసి "ఆం, అవును. ట్రాన్స్‌మీటరు పనిచేస్తుంది" అని అంటారు. అప్పుడప్పుడూ బల్బు కాలిపోతే పోవచ్చు కానీ ట్రాన్స్‌మీటరు ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటుంది. ట్రాన్స్‌మీటరులా పనిచెయ్యడం పూండీస్వామివారి అవతార కార్యం: అది జరుగుతుంది, అది ఇప్పటికీ జరుగుతూనే ఉంది. ట్రాన్స్‌మీటరు ఎన్నడూ ఫెయిల్ కాదు. శ్రీస్వామివారు ఎప్పటికీ ఫెయిల్ కాని ట్రాన్స్‌మీటరులాంటివారు.

భక్తుడు:

గురువుగారూ! శ్రీపూండీస్వామివారిని దర్శించడానికి వెళ్ళేటప్పటికే మీరు సాయిభక్తులా?

**గురువుగారు:**

అవును, సాయిబాబానే నా గురువు.

భక్తుడు:

పూండీస్వామి మీకు సహాయం చేశారా?

**గురువుగారు:**

ఆయన వాచా ఏమీ చెప్పలేదు. కానీ ఆయన సన్నిధిలో నేను పొందిన అనుభవం నా యావత్తు జీవితాన్ని మార్చివేసింది.

**భక్తుడు:**

పూండీలో ఆ అనుభవం తరువాత (ఏదో పొందాలన్న) మీ తపన పెరిగిందా లేక సమాధానపడిందా, లేక రెండూ జరిగాయా?

**గురువుగారు:**

అది సమాధానపడింది.

**భక్తుడు:**

సమాధానపడింది అంటే ఆ తపన తీరిపోయింది. కానీ ఆ తపన అంతటితో ఆగిపోయిందా? ఇంకా ఇంకా ఆ అనుభవాన్ని పొందాలనే కోరిక మరి కలుగలేదా?

**గురువుగారు:**

నేను దానిని అనుభూతి చెందుతూనే ఉన్నాను. నిరంతరమూ ఆ అనుభూతిలోనే ఉన్నాను. నిజానికి ఆ అనుభవాన్ని నేను మాటల్లో చెప్పలేను. ఏ శాస్త్రాలలోనూ దానిని వర్ణించడానికి సరిపోయే పదాలు దొరకలేదు. ఇటువంటి విషయాలను మనం అడగడంగానీ, అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడంగానీ చెయ్యకూడదు. కొన్ని విషయాలను గురించి మాట్లాడేందుకు మన దగ్గర పదాలుండవు, కేవలం విశదీకరించి చెప్పేందుకు మాత్రమే ప్రయత్నం చేయగలం.

**భక్తుడు:**

పూండీస్వామివారి ప్రేమ ఎలా వ్యక్తమయ్యేది?

**గురువుగారు:**

ఆయన ప్రేమ ఎంత గాఢమైనదంటే ఆయనకిక ప్రేమ తప్ప వేరే

ధ్యేయమంటూ ఏమీ లేదు. ఆయనే ధ్యేయమైపోయారు. పూర్తి తదేకతతో అలా కూర్చుండిపోయారు, కనీసం ఒక్క అడుగైనా బయట పెట్టాల్సిన అవసరం లేనంతగా! ఆయన ఓ అద్దంలాంటివారు. ఉదాహరణకు, ఓ ఫోటోగ్రాఫర్ భయపడుతూ భయంభయంగా ఆయన దగ్గరకు వెళితే, స్వామి ముఖంలో దానికి తగ్గినట్లుగా అలాంటి (గంభీర) భావమే కనిపించేది. తరువాత మరో వ్యక్తి రాగానే ఆయన తీరు తక్షణం మారిపోయేది. ఆ వచ్చిన వ్యక్తి చనువుగా, సన్నిహితంగా మాట్లాడితే స్వామి కూడా చనువుగా, కులాసాగా మాట్లాడేవారు. ఆయనెప్పుడూ అద్దంలాగే ఉండేవారు. ఆయన వ్యక్తం చేసే ఏ భావమైనా అది ఆయనది కాక ఆయన వద్దకు వచ్చిన వ్యక్తికి సంబంధించినదై ఉండేది. అసలు ఆయనకంటూ ఏ భావమూ ఉండేదికాదు – ఆయన ఎంతో పారదర్శకంగా (transparent గా) ఉండేవారు. అంతటి పారదర్శకతలో ఆయన ద్వారా నేను బాబానే చూశాను. అందుకే ఎప్పుడూ నేను నాకు అనుభవాన్నిచ్చింది సాయి బాబానే అని చెప్తుంటాను. నాకు, బాబాకు మధ్య పూండీస్వామి తెరలాగానైనా ఉన్నారని అనుకోవడానికి ఆయనక్కడ కనీసం తెరగా కూడా లేరు. అటువంటి పారదర్శకత నేను ఎక్కడా చూడలేదు.

భక్తుడు:

ఇటువంటి పారదర్శకత ద్వారా ఆయన ప్రేమ వ్యక్తమయిందని మీరంటున్నారా?

**గురువుగారు:**

ఆయన ప్రేమ తమ దగ్గరకు వచ్చినవారు ఏమడిగితే దానిని ఇవ్వడం ద్వారా వ్యక్తమయింది. ఎవరైనా ఆరోగ్యం కోరుకుంటే ఆయన

ఇచ్చారు, ఆధ్యాత్మిక అనుభవం ఆశిస్తే దానిని ప్రసాదించారు, పరిపూర్ణానందం కావాలనుకుంటే దానినీ ఇచ్చారు. పిల్లలు కావాలి అనుకుంటే పిల్లలనిచ్చారు. అది ఏదైనా సరే. ఎవరు ఏమి కోరుకుంటే దానిని ప్రేమతో అనుగ్రహించారు. "నాది ముక్తి అనే డిపార్ట్‌మెంటు, నువ్వు కేవలం ముక్తినే కోరుకోవాలి – ప్రాపంచిక విషయాలు నాకు సంబంధించినవి కాదు"... ఇలాంటి కట్టుబాట్లేవీ లేవు.

**భక్తుడు:**

ఒకరు ఒక మహాత్ముని పట్ల, ఇంకొకరు మరొక మహాత్ముని పట్ల ఆకర్షితులవుతారు. ఇలా ఎందుకు జరుగుతుంది? ఆ ఎంపికను నిర్దేశించేదేమిటి?

**గురువుగారు:**

అలాంటిదేమీ లేదు: అది నీ ఎంపిక కాదు. నిజానికి పూండీకి వెళ్ళడమనేది నా ఎంపిక కాదు. అసలు ఆయన అంతటి మహాత్ముడని కూడా నేను అనుకోలేదు. అప్పటికి నాకు ఆయన గురించి ఎటువంటి భావమూ లేదు; నాకు కనీసం ఆ ఆసక్తి కూడా లేదు. నేను నా ప్రయాణాన్ని మొదలుపెట్టాల్సి ఉంది. అప్పుడు మా గురువుగారు "పూండీకి వెళ్ళి అక్కడ కొద్దిరోజులుండి తరువాత నువ్వెక్కడికి వెళ్ళాలనుకుంటే అక్కడకు వెళ్ళు" అన్నారు. అంతే! పూండీస్వామి ఎలా ఉంటారు అన్న విషయంలో నాకసలు ఎటువంటి ఊహా లేదు.

**భక్తుడు:**

గురువుగారూ! ఎవరైనా ఒకరి వద్దకు కాకుండా వేరొకరి వద్దకు వెళ్ళారంటే అలా తీసుకువెళ్ళేది కర్మసంబంధమేనా?

**గురువుగారు:**

అవును, ఆయనతో నాకు కర్మసంబంధం ఉంది. అంతేకాకుండా, తమ గురువు యొక్క స్థితి గురించి బాబా చెప్పిన వివరాలు సరిగ్గా పూండీస్వామితో సరిపోయాయి. బాబా గురువు పూండీస్వామి అని నేననడం లేదు. కానీ బాబా తమ గురువు గురించి చెప్పిన వివరాలు సరిగ్గా పూండీస్వామి వివరాలతో సరిపోతున్నాయి.

భక్తుడు:

అది ఎలా?

**గురువుగారు:**

బాబా జీవితచరిత్ర చదవండి. స్వామి సాయిశరణానందతో బాబా తమ గురువృత్తాంతం చెబుతూ, *"...నా గురువు అలా కూర్చునే ఉండేవారు, వారు మూర్తీభవించిన ప్రేమస్వరూపం. ఆయన కనీసం తమ కాలకృత్యాల గురించి కూడా పట్టించుకునే స్థితిలో ఉండేవారు కాదు. నేను ఆయన శరీరాన్ని శుభ్రం చేసి, ఆహారం పెట్టి ఆయనను సేవించుకునేవాణ్ణి..."* అన్నారు.

పూండీస్వామిని తప్పించి బాబా చెప్పిన ఈ వర్ణనకు సరిపోయే వేరొకరిని చూపించండి చూద్దాం. నా వరకు నేను పూండీస్వామిని తప్పించి అటువంటి వారిని వేరెవరినీ చూడలేదు! పూండీస్వామి ఎప్పుడూ తమకై తాము చేతితో తినేవారు కాదు. ఎవరైనా నోట్లో పెట్టి తినిపించాల్సిందే. ఆయనకు ఎవరూ తినిపించకపోతే ఆయన అలా కూర్చుని ఉండేవారు. అంతే! ఎవరైనా ఆహారాన్ని నోట్లోపెడితేనే ఆయన తినేవారు. అంతా ఇంతా అనిగాక ఎంతమంది ఎంత పెట్టినా, అది వందమంది అయినా సరే – ఆయన తింటూనే ఉండేవారు!

ఆ తిన్న పదార్థమంతా ఏమయ్యేదో అది మనకు తెలియదు. ఆయన చేతిలో నువ్వేమైనా పెట్టావనుకో, ఎవరో ఒకరు వచ్చి దానిని తీసి ప్రక్కన పెట్టేదాకా దాన్ని ఆయన అలా చేతిలోనే ఉంచుకునేవారు. ఎవరైనా సిగరెట్ నోట్లో పెట్టి వెలిగిస్తే పొగపీల్చేవారు. ఒకవేళ సిగరెట్టును ఆయన చేతిలో పెడితే దానిని అలాగే ఉంచేసేవారు, దానిని వాడేవారు కాదు. కాలకృత్యాలు కూడా అక్కడే తీర్చుకునేవారు, వేరేవారు వచ్చి శుభ్రం చెయ్యాల్సిందే.

ఆయన ఆహారం కోసం ఎన్నడూ భిక్ష చెయ్యలేదు. ఎవరూ ఆహారం ఇవ్వకపోతే – అది నెలల తరబడైనా సరే – ఆయన అలానే ఆహారం లేకుండానే ఉండేవారు. ఎవరికైనా ఏ విధమైనటువంటి అవసరాలూ లేకపోతే ఎలా ఉంటారో దానికి పరిపూర్ణమైన ప్రతీక ఆయన. కనీస శారీరకావసరాలతో సహా అన్ని అవసరాలకు ఆయన అతీతులు.

భక్తుడు:

అందరికీ తెలిసినంతవరకు ఆయన ఎప్పుడూ ఇలానే ఉండేవారా? ఆయన ఇంకోరకంగా ఉన్నరోజులు ఎవరికైనా తెలుసా?

**గురువుగారు:**

అలాంటి సందర్భం ఎవరికీ తెలియదు. ఆయన అలానే కన్పించారు. మొదటినుండీ ఆయన అలానే ఉండేవారు. ఆయన నడవడం మొదలిడితే సుమారు ఓ నెలరోజుల పాటు ఎక్కడా ఆగకుండా కలశప్పాక్కం, పూండీ, చెయ్యార్ నది, ఆ చుట్టుప్రక్కల అలా నడుస్తూనే ఉండేవారు. రాత్రింబవళ్ళు నడుస్తూనే ఉండేవారు. ఏదైనా బాహ్యమైన ప్రేరణ కలిగి కూర్చున్నారా ఇక కూర్చుండిపోయేవారు – ఆ ప్రేరణ

ఏమిటన్నది మనకు తెలియదు, ఎక్కడా నమోదు కాలేదు. ఆయన ఒకే ప్రదేశంలో నెలల తరబడి కూర్చునేవారు. ఏదో కారణం చేత ఆయన లేచారా ఇక నడక కొనసాగుతూనే ఉండేది.

**భక్తుడు:**

గురువుగారూ! మీరు మీ అనుభవాన్ని పూండీస్వామి సన్నిధిలో పొందినపుడు మీరు దానిని బాబాకి ఎందుకు ఆపాదించారు?

**గురువుగారు:**

నేనెప్పుడూ దానిని బాబాకు ఆపాదించి చెప్పలేదు. ఆ అనుభవం బాబా ద్వారా వచ్చిందని చెప్పాను. నేనెప్పుడూ “ఆపాదించి” చెప్పలేదు. అది బాబా ద్వారా వచ్చిందని నాకు తెలుసు.

**భక్తుడు:**

అలా అయితే మరి అందులో పూండీస్వామివారి పాత్ర ఏమిటి?

**గురువుగారు:**

నేను మీతో పోషిస్తున్న పాత్ర లాంటిదే – ఓ స్పూన్‌లాగా. సూప్‌ను మీరు స్పూన్‌తో తీసుకుంటారు కానీ ఆ సూప్‌ను తయారుచేసింది ఎవరు? ఆ సూప్‌ను మీకు ఇచ్చిందెవరు? అసలు ఆ సూప్ ఏమిటి? స్పూను కేవలం సాధనం మాత్రమే. ఆ స్పూన్‌ను సరిగ్గా ఎలా వాడుకోవాలో మీరు తెలుసుకోవాలి. మీకు సూప్‌ను ఇచ్చేది స్పూనే అనుకుంటే ఒకసారి ఆ స్పూన్‌ను కొరికి చూడండి, పళ్ళు ఊడుతాయి – అంతే! (గురువుగారు నవ్వుతూ...) మీకు నేను ఏమీ చెయ్యట్లేదని అందుకే ఎప్పుడూ చెబుతుంటాను. నన్ను స్పూన్‌లాగా

ఉపయోగపెట్టుకోండి. నేను స్ప్రూన్‌లాగా ఉన్నాను, నన్ను సరిగా ఉపయోగించుకోండి. ఇచ్చేది బాబానే.

**గురువుగారు:**

పూండీస్వామి వద్ద నేను పొందిన అనుభవాన్ని నేను చెప్పడం కంటే, ఆ అనుభవాన్ని మీరూ పొందడానికి ప్రయత్నిస్తే బాగుంటుంది. మీరు ఇక్కడ నా దగ్గర అనుభూతి చెందేది బహుశా ఆ అనుభవం యొక్క అంచులు మాత్రమే. మీకు నిజంగా తెలుసుకోవాలనుంటే ఆ అంచును పట్టుకుని ముందుకెళ్ళండి. సాగిపోండి! అందులో మునగండి, అప్పుడు మీరు దానిని అనుభూతి చెందగలరు. అప్పుడు ఆ అనుభవం ఎలా ఉందో మీరే నాకు చెప్తారు (గురువుగారు నవ్వుతూ...) నాకు కూడా మీ నుంచి వినాలని ఆసక్తిగా ఉంది. అలా కాకుండా, ఇటువంటి విషయాలు నేను వివరించడం మొదలుపెడితే అది సిద్ధాంతాలకు, అంధవిశ్వాసాలకు, మీకు ఇంకా ఎక్కువ ఊహలు కల్పించడానికి దారితీస్తుంది. అది మీకు మంచిదనిపిస్తే చెప్పడానికి నాకు ఇబ్బందేంలేదు. కానీ దానివల్ల ఉపయోగం లేదు. నిజంగా అది జరిగినా జరగకపోయినా, అది నిజమైనా కాకపోయినా ఇప్పుడు, ఇక్కడ మీరు మీ అనుభవాన్ని విశ్వసించండి. మీరు ఏదైనా అనుభవాన్ని పొందుతున్నట్లయితే, అది ఆ అనుభవం యొక్క అంచైనా సరే, దానిని అంటిపెట్టుకోండి.



శ్రీపూండీస్వామి



బోధగయ, 1995



# పవిత్ర క్షేత్రాలు

**భక్తుడు:**

గురువుగారూ! ఒక ప్రదేశానికి పవిత్రతను చేకూర్చేదేమిటి?

**గురువుగారు:**

సద్గురు సన్నిధి ఏ ప్రదేశాన్నైనా పవిత్ర క్షేత్రంగా చేస్తుంది. సద్గురు సాన్నిధ్యమే నిజమైన పుణ్యక్షేత్రం. శిరిడీ ఎందుకు అంత పవిత్ర క్షేత్రమయింది? అది బాబా సన్నిధి కాబట్టి (పుణ్యక్షేత్రమైంది). అక్కడ గంగానది లేదు, హిమాలయాలు లేవు, మునులు ఎవ్వరూ అక్కడ తపస్సు చెయ్యలేదు – ఇలాంటివేవీ లేవు. కేవలం అది బాబా సన్నిధి కాబట్టే పవిత్రక్షేత్రమయింది. ఏ ప్రదేశమయినా కేవలం సద్గురు సాన్నిధ్యం చేతనే పవిత్ర క్షేత్రమవుతుంది.

**భక్తుడు:**

గురువుగారూ! మేము శిరిడీ, పూండీ, తిరువణ్ణామలై తదితర పవిత్ర క్షేత్రాలకు సంబంధించి ఆ సద్గురుసన్నిధిని ఉపయోగపెట్టుకోవడం ఎలా?

**గురువుగారు:**

నీవు పరుపు మీద పడుకొని నిద్రపోతున్నావు... అప్పుడు ఆ పరుపు యొక్క ఉనికి గుర్తు ఉంటుందా? నిద్ర లేచిన తరువాత, "చాలా బాగా నిద్రపట్టింది, ఈ పరుపు చాలా బాగుంది" అని నువ్వంటే అనవచ్చు కానీ నిద్రపోతున్నప్పుడు ఆ పరుపు యొక్క ఉనికిగానీ, అది అక్కడున్న సంగతిగానీ నీకు తెలుస్తుందా? తెలియదు. కానీ నువ్వు దానిని వాడుకొంటున్నావు. ఆ పరుపు లేకపోతే నీకు సరిగా నిద్రపట్టుండకపోవచ్చు. పరుపుగా ఉపయోగించడం వల్ల వచ్చే ఫలితాన్ని తెలుసుకోవాలంటే దానిని పరుపుగా వాడుకోవాలి. నువ్వు దానిని డైనింగ్ టేబుల్‌లాగా భోజనం చేయడానికి వాడుకుంటే దాని విషయం నీకు తెలియకపోవచ్చు. (గురువుగారు నవ్వుతూ...) దానిని పరుపుగా వాడుకొని ఆ ఫలితాన్ని పొందడమే దానిని సరిగా ఉపయోగించుకోవడమంటే. అదే మీరు చెయ్యాల్సింది. ఇంకోరకంగా చెప్పాలంటే, పరుపు యొక్క ప్రయోజనాన్ని గుర్తించగలిగే సున్నితత్వం నీలో ఎంతగా పెరిగితే, దాని ఉనికి అంతగా ఎఱుకలోకి వస్తుంది, నీకు దాని ప్రయోజనం ఇంకా చాలా స్పష్టంగా తెలుస్తుంది.

అసలు విషయమేమిటంటే, చాలామందికి అంతటి సున్నితత్వం ఉండదు. ఉదాహరణకు, మన మనస్సు, బస్సు క్లీనరు వంటిమీద ఉండే గుడ్డల్లాగా ఉంటుంది. బస్సుల్లో, లారీల్లో డ్రైవరు, క్లీనరు

ఉంటారు. క్లీనరు డ్రైవరుకు చేదోడువాదోడుగా ఉంటాడు. ఆ క్లీనరు గుడ్డలు ఆయిలు, మురికి, మట్టిలాంటివంతా చేరి ఎంతగా మాసిపోయి ఉంటాయో చూడండి! అటువంటి క్లీనరు వచ్చి ఈ నేల మీద కూర్చున్నాడనుకోండి అతని బట్టలకు మరకలంటుకొని మాసిపోతాయా? ఒకవేళ మురికంటూ అంటుకుంటే అది నేలకే. కొంతమంది మనస్సులు క్లీనరు గుడ్డల్లాగా ఉంటాయి, వాళ్ళు ఎక్కడికి వెళ్ళినాసరే – అది మురికిలోనికైనా సరే, వాళ్ళకది మురికిలాగా అనిపించదు. కానీ మీరు చాలా చాలా పరిశుభ్రంగా ఉన్న స్వచ్ఛమైన తెల్లని బట్టలు వేసుకున్నారనుకోండి, మురికి అంటుతుందేమోనని చాలా జాగ్రత్తగా ఉంటారు. శుభ్రమైన నేలమీద కూర్చున్నా బట్టలు మాసిపోతాయేమోనని చాలా భయపడుతుంటారు. కాబట్టి మన మనస్సులు పరిశుద్ధమయ్యే కొద్దీ, ప్రతి విషయం మన మీద చూపే ప్రభావాన్ని గుర్తించడం మొదలుపెడతాం.

ఇదేవిధంగా, మీరు ఆ సన్నిధిలోకి వెళ్ళగానే ఆ సాన్నిధ్య ప్రభావాన్ని గుర్తించగలరు, స్పష్టంగా తెలుసుకోగలరు. అది అంత సూక్ష్మమైనదేమీ కాదు, మీరు దానిని తెలుసుకోవచ్చు, అనుభూతి చెందవచ్చు, మీరు దానిని తాకవచ్చు, అవగాహన చేసుకోవచ్చు, దానిని తిని జీర్ణించుకోనూవచ్చు.

**గురువుగారు:**

ఏ పవిత్రక్షేత్రమైనా మహాత్ముల వల్లనే ఆ పవిత్రతను సంతరించుకొంటుంది. చాలాకాలం క్రితం – చరిత్రకందనంతటి పూర్వకాలంలో, ఇక్కడ అరుణాచలంలో చాలా గొప్ప సిద్ధపురుషుడు ఉండేవారు.

ఆయనను ఇక్కడి ప్రజలు శివుని అవతారంగా, శివస్వరూపంగా భావించేవారు. ఆయన ఇక్కడే నివసించారు, ఇక్కడే సమాధి చెందారు. అప్పటి నుండి చాలామంది ఈ పర్వతాన్ని తపోక్షేత్రం గానూ, సాధనకు అనుకూలమైన పవిత్ర ప్రదేశంగానూ భావిస్తారు, ముఖ్యంగా శేషాద్రిస్వామి, రమణమహర్షి కాలం నుండి (ఈ భావన విస్తృతమైంది). కాబట్టి ఇది మహాత్ముల స్థానం.

నా వరకు నాకు, నేను బాబా సమాధిని ఎలా చూస్తానో అలానే అరుణాచలాన్నీ ఒక సమాధిస్థానంగానే చూస్తాను. అరుణాచల పురాణంలో చెప్పింది ఇదే. అందులో ఆ మహాత్ముణ్ణి 'అరుణగిరియోగి' అన్నారు. ఒక మహాయోగి ఇక్కడ నివసించారు, ఆయన సమాధి కొండ ఉత్తర శిఖరంపైన ఉంది. రమణమహర్షి కూడా ఒకసారి, ఆయన సమాధి దగ్గర ఉన్న చెట్టును చూశారు, కానీ ఆయన దాని దగ్గరకు వెళ్ళలేకపోయారు. తమకు అనుమతి లేదని ఆయనే చెప్పారు. రమణమహర్షికే అనుమతి లేదు! అరుణగిరియోగి వల్ల ఈ పర్వతం పవిత్రమైన కొండగా మారింది. ఆయన సమాధిని చేరుకోవడం దుర్లభం కావడంతో అందరూ అక్కడదాకా వెళ్ళి పూజలు, ప్రదక్షిణలు చెయ్యలేరు కాబట్టి, ఈ పర్వతమంతా ఆయన సమాధిగా మారింది. శిరిడీలో మనం సమాధి మందిరాన్ని, గురుస్థానాన్ని, ద్వారకామాయిని కలిపి మహాప్రదక్షిణ చేసినట్లే అరుణగిరికి ప్రదక్షిణ చేయడం జరుగుతోంది. ఆయన సమాధిని దర్శించడానికి కొండనెక్కి వెళ్ళలేరు కాబట్టి, ఈ పర్వతాన్నంతా ఆయన సమాధిగా చూస్తూ పర్వతం అంతటికీ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**భక్తుడు:**

పవిత్రస్థానాలన్నీ అక్కడ నివసించిన మహాత్ముల మూలంగా మరింత

శక్తివంతంగా తయారవుతాయా? లేక వాటికవే పవిత్రతను కలిగి వుంటాయా?

**గురువుగారు:**

నిజంగా చూస్తే ప్రతి ప్రదేశమూ పవిత్రమైనదే. అపవిత్రస్థానమంటూ ఏమీ లేదు. కానీ మహాత్ముని సన్నిధి వలన కొన్ని ప్రదేశాలలో మిగతా వాటికన్నా ఆ పవిత్రత మరింతగా వ్యక్తమవుతుంది. అందుకని వీటిని పవిత్రస్థానాలు అంటారు.

**భక్తుడు:**

అరుణగిరియోగి ద్వారా ఆకర్షింపబడి తరువాతి కాలంలో వచ్చిన మహాత్ముల వలన, యోగుల వలన ఆ పవిత్రత మరింతగా పెరుగుతుందా?

**గురువుగారు:**

అవును. చాలా చాలా మార్గాలు ఏర్పడుతాయి కాబట్టి పవిత్రత పెరుగుతుంది. శేషాద్రిస్వామి ఇక్కడకు వచ్చినపుడు అది పెరిగింది. కొంతమంది ఆయన సన్నిధితో, మహిమతో అనుసంధానం కాగలిగారు, అటువంటి వాతావరణం వలన లబ్ధి పొందారు. రమణమహర్షి వచ్చిన తరువాత వారు మరొక మార్గమయ్యారు. కాబట్టి ఎక్కువమంది అనుసంధానం కాగలిగారు. అంటే ఆ క్షేత్రం మరింత శక్తివంతమయ్యిందని కాదు, ఎక్కువమంది దానితో బంధం ఏర్పరచుకోగలిగారు. మామూలు ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అయిందన్నమాట. అంతే! అంతకుముందు కేవలం కొన్ని ప్రత్యేక రోగాలు గలవారు లేదా కొన్ని రకాలైన జబ్బులతో బాధ పడేవారు మాత్రమే వెళ్ళేవారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అయితే

ఎటువంటి రోగానికైనా వైద్యం చేస్తారు. అలా కొన్ని పవిత్రక్షేత్రాలు అరుణాచలం మాదిరిగా సూపర్ స్పెషాలిటీ ఆధ్యాత్మికకేంద్రాల్లాగా మారుతాయి.

**గురువుగారు:**

ఇక్కడ మరో విషయముంది. పవిత్రక్షేత్రాలలో రమణమహర్షి వంటి గొప్ప సద్గురువుల సాన్నిధ్యంలో చేసిన సాధన పదింతల ఫలితం ఇస్తుందని గొప్ప మహాత్ములు చెప్పారు. "మీరు నాకు ఒక్క రూపాయి ఇస్తే నేను పదిరూపాయలు ఇస్తాను!" అని బాబా చెప్పిందీ అదే. అక్కడంతటి ప్రభావం, మహిమ ఉండటం చేత అటువంటి పవిత్రస్థానాలను తపోక్షేత్రాలు అంటారు. వారి సాన్నిధ్యంలో మీరు పూర్తిగా వారి ప్రభావంలో, వారి శక్తి పరిధిలో ఉంటారు. ఇక్కడ మీరు ఓ విషయం గుర్తుపెట్టుకోవాలి. మీరు మంచిపని చేస్తే దాని ఫలితం పదింతలుగా ఉంటుంది, అలా కాకుండా మంచిని దూరం చేసే పనులు చేస్తే దాని ఫలితమూ పదింతలుంటుంది. మీరు ఆధ్యాత్మిక ప్రదేశాలలో వ్యాపారస్తులను చూస్తుంటారు, వాళ్ళకు మామూలు వ్యాపారస్తులకన్నా ఎక్కువ వ్యాపారధోరణి ఉంటుంది – ఎందుకంటే ఆ క్షేత్రప్రభావం వలన ఆ వ్యాపారధోరణి పదిరెట్లు, వందరెట్లు ఎక్కువగా ఉంటుంది! (నవ్వులు...) అక్కడ ఎంత ప్రయోజనముందో అంత ప్రమాదమూ ఉంది. అందుకనే మనం ఆ ప్రయోజనాన్ని ఉపయోగపెట్టుకోవాలి, అంతేకాకుండా మనం అంతే జాగ్రత్తగానూ ఉండాలి – అది కత్తి మీద సాము లాంటిది. మనం ఎప్పుడూ గొప్ప మహాత్ముల సాన్నిధ్యంలో ఉన్నామన్న విషయం గుర్తుంచుకోవాలి.

మంచిపని చేస్తే ఫలితం వందరెట్లు ఉంటుంది. తప్పుడు పనిచేస్తే దానికి సంబంధించిన చెడుకర్మ కూడా వందరెట్లుగానే ఉంటుంది, ఎందుకంటే అది ఇక్కడ క్షేత్రధర్మం. మీరు ఏం చేసినా సరే దాని ఫలితం వందరెట్లు ఉంటుంది. వారి సాన్నిధ్యం మంచి చెడుల మధ్య ఎటువంటి తారతమ్యాన్నీ చూపదు.

**భక్తుడు:**

గురువుగారూ! పూండీకి వెళ్ళడం యొక్క ప్రయోజనమేమిటి?

**గురువుగారు:**

పూండీస్వామి సన్నిధిలో ఉండటం కోసమే. మన మనస్సులు ఆవు నుండి తీసిన పాలు అనుకుందాం. వాటిని కాయడానికి మీరు వాటిని స్టవ్ మీద పెడతారు. పూండీ, శిరిడీ నాకు దొరికిన రెండు మంచి స్టవ్‌లు. పాలు కాయాలంటే మనం వాటిని స్టవ్ మీద పెట్టాల్సిందే, అంతేగానీ స్టవ్ దగ్గరగానో, స్టవ్‌కు ప్రక్కనో పెట్టకూడదు, స్టవ్ మీద పెట్టాలి. ఆ పాలను (మన మనస్సును) మరిగించినప్పుడు, ఆ 'మరగడాన్ని' మీరు 'ఆనందం'గా అనుభూతి చెందుతారు. అది పొంగిపోయి మీ మనస్సు సంతృప్తి చెందుతుంది. స్టవ్ వెలుగుతోంది – అందుకని ఎంతగా వీలైతే అంతసేపు అక్కడకు వెళ్ళి కూర్చోండి, ఆ జ్వాలకు దగ్గరగా మిమ్మల్ని ఎంత వీలైతే అంతసేపు ఉంచుకోండి. లేకపోతే పాలు విరిగిపోయి, పులిసిపోయి దానిని కనీసం కుక్కలు కూడా ముట్టుకోవు – అవి కూడా పారిపోతాయి.

**గురువుగారు:**

మనం ఇక్కడ శిరిడీలో ఉన్నామనంటే, అది మన ప్రేమ వల్లనేనని, మన ఇచ్ఛానుసారమేనని మనకు తెలుసు. మనం ఎంతో ప్రేమించే సద్గురువు ఇక్కడ ఉన్నారు, మనకు ఆ ఎఱుక ఉంది, మనం ఆ ఎఱుకను నిలుపుకోవాలనుకుంటున్నాము. అలా ఎఱుకలో ఉండడం చాలా అద్భుతంగా ఉంది, అయినప్పటికీ మనం ఆ ఎఱుకను నిలుపుకోలేకపోతున్నాము. నేను మీకు ఆ ఎఱుక ఉంటే చాలు అంటాను.

మీరు నా దగ్గరకు వచ్చి, "మేము ఇక్కడ ఏం చేయాలి, మాకు ధ్యానం చేసుకోవడానికి 'నేనెవరు?', 'మీరెవరు?' లాంటి పద్ధతులు ఏమైనా ఉన్నాయా?" అని అడుగుతుంటారు. (నవ్వులు...) మీరు చెయ్యగలిగిందేమీ లేదని నేను చెప్తాను. అదెలా ఉంటుందంటే తడిగుడ్డలాంటి మీరు ఎండలో ఉండటంలా అన్నమాట. బాబా అనుగ్రహం సూర్యుని వేడిమిలాంటిది. మీరు చెయ్యాల్సిందల్లా మీ గుడ్డను (మనస్సును) ఆ ఎండలో ఉంచడమే. దాని వల్ల మన అజ్ఞానం అని అనుకొనే తడి ఆరిపోతుంది. అక్కడ గుడ్డ చెయ్యాల్సిందేమీ లేదు. అది చెయ్యాల్సిందంతా ఒక్కటే: తనను తాను ఆ ఎండలో ఉంచుకోవడమే.

వాస్తవానికి జరిగేది ఇదే, కానీ సమస్యేమిటంటే, గుడ్డ తనను తాను ఎప్పుడూ ఎండలో ఉంచుకోవడంలేదు. తనను తాను నీడలో ఉంచుకోవాలనుకుంటోంది. లేదా సగం ఆరిన తరువాత కూడా మళ్ళీ బక్కెట్‌లోకి వెళుతోంది! (నవ్వులు...)

**భక్తుడు:**

గురువుగారూ! మమ్మల్ని మేము బయట ఎండలో దండెం మీద వేసుకుని ఉంచుకోవడానికి ఉత్తమమైన మార్గం ఏమిటి?

**గురువుగారు:**

ప్రతి ఒక్కరూ ఎవరికి వారు దీని గురించి అన్వేషించాలి. మీరే స్వయంగా ఆ మెళకువలను తెలుసుకోవాలి. ఆ పద్ధతులకు మీరే సృష్టికర్తలు, అన్వేషకులు, బోధకులు కావాలి. మీకు దానికి సంబంధించిన గమనింపు ఉంటే అది తెలుస్తుంది. ఇలా చెయ్యడానికి ప్రతి ఒక్కరికీ సామర్థ్యముంది, కానీ చివరగా మీరు చెయ్యగలిగిందంటూ ఏమీ లేదు. ఎండిపోవడమనే ఆ చివరి చర్య సూర్యుని వల్లనే జరుగుతుంది. మీకై మీరు ఆ పని చెయ్యలేరు. కానీ మిమ్మల్ని మీరు ఎండలో ఉంచుకోవచ్చు. మీరు చెయ్యవలసింది, చెయ్యగలిగిందీ అంతే!

ఈ సత్సంగాలు, మనం పెట్టుకున్న నియమాలు, ఆధ్యాత్మిక సూత్రాలు, ధార్మికవిధులు… వీటన్నింటివలన ఏమన్నా జరుగుతుందా అంటే – ఇవన్నీ కూడా దండెం కట్టుకోవడం, మన గుడ్డను ఆ ఎండలో ఆరేసుకోవడం వరకే. ఆ గుడ్డను పొడిగా చేసేది దండెం కాదు సూర్యుడు.

**భక్తుడు:**

పద్ధతి వల్ల కాదా గురువుగారూ?

**గురువుగారు:**

సూర్యుడు గుడ్డలు ఆరబెడతాడు. ఆ గుడ్డను ఎంతగా ఎండలో ఉంచుతారో అంత త్వరగా అది ఆరిపోతుంది. దానిని పొడిగా

చేయడానికి సూర్యుడు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాడు. మీరు నీడలో ఉన్నప్పటికీ తన వేడిని ఇవ్వడానికి ప్రయత్నిస్తూనే ఉంటాడు. అంతేకాదు మీరు దానిని నీడలో పెట్టినప్పటికీ కొంతకాలానికి అది పొడిగా తయారవుతుంది, ఇబ్బందేం లేదు, సందేహం అక్కరలేదు. సూర్యుడు ఆ పనిని ఎప్పుడూ చేస్తూనే ఉన్నాడు.

**భక్తుడు:**

గురువుగారూ! పూండీలో స్వామివారి సన్నిధిలో నిద్రపోయినా లేదా మేలుకొని ఉండి వారి సమాధికి ప్రదక్షిణలు చేసినా ఎటువంటి తేడా ఉండదా? లేక మేలుకొని ఉండటం వలన ఏమైనా ప్రయోజనం ఉందా?

**గురువుగారు:**

ఏంచేసినా అది మంచిదే. ఎవరైనా నన్ను "పూండీకి వెళ్ళాల్సిన అవసరం ఏమిటి?" అని అడిగినపుడు నేనిదే చెప్తుంటాను. ఇక్కడ తిరువణ్ణామలైలో నన్ను చాకిరేవు బాధ్యతలు నిర్వర్తించే ఓ చాకలివాడిననుకోండి, సరేనా? ఇది బట్టలు ఉతికే గది – ఇక్కడ కుళాయిలు, సబ్బులు అన్నీ ఉన్నాయి – నేను మిమ్మల్ని ఉతుకుతాను. తర్వాత, పూండీలో ఓ దండెం ఉంది – నేను మిమ్మల్ని అక్కడ ఆరేస్తాను. ఇక్కడ నేను సర్ఫు, సబ్బుతో ఉతుకుతాను. కానీ మీరు ఆరాలంటే మిమ్మల్ని అక్కడ దండెం మీద వేయాలి. ఉతికే గదిలో ఉంటే మీరు అంత త్వరగా ఆరిపోవడం జరగదు. బట్టలను రూములో ఉతికినప్పటికీ బయట ఎండలోనే ఆరెయ్యాలి. పూండీలో అందుకోసమనే ఓ దండెం ఉంది, పొడిగా తయారవ్వాలనంటే

అక్కడ మీరు ఎండలో కొంతసేపు ఉండాలి. (నవ్వులు...) మీరు ఎండుతున్నప్పుడు, మీరు చెయ్యాల్సిందల్లా దండెం మీదనే ఉండటం. అంతే, అది చాలు. అందుకే నేను, ఒక రకంగా "గ్రుడ్డిగా" అక్కడ దండెం పైనే ఉండండి అని చెబుతాను.

**భక్తుడు:**

అరుణాచలానికి ప్రదక్షిణ చెయ్యడం కూడా అటువంటిదేనా? ప్రదక్షిణ కూడా దండెం మీద ఉండటం వంటిదేనా?

**గురువుగారు:**

అవును. అది కూడా అలాంటిదే.

**భక్తుడు:**

మేము శిరిడీలో ఉన్నప్పుడు, ప్రతిరోజూ కాసేపు గురుస్థాన్‌లోను, సమాధిమందిరంలోనూ ఊరికే అలా కూర్చుంటే సరిపోతుందా?

**గురువుగారు:**

మీకది మరీ అంత సులభంగా ఉంటే అలానే చెయ్యండి! అది "సరిపోతుంది". ఈ ప్రశ్నలో "ఇది సరిపోతుందా, లేకపోతే మేము ఇంకా ఏమైనా చెయ్యాల్సి ఉందా?" అన్న సంశయం ధ్వనిస్తోంది. మీరు ఇంకా ఏదైనా చెయ్యగలిగినా ముందు ఇది (గురుస్థాన్‌లో, సమాధి మందిరంలో ఊరకే కూర్చోవడం) చెయ్యండి. అది చాలు. అది ఎలా ఉంటుందంటే మీ దుస్తులు ఇక్కడ వాషింగ్‌మెషీన్‌లో ఉతకడం, జాడించడం, తర్వాత అక్కడ మందిరంలో ఆరబెట్టడం జరుగుతుంది.

తడిబట్టలను పొడిగా చెయ్యడానికి, ఎండలో వేస్తే చాలు. బట్టలు తాముగా చెయ్యాల్సిందేమీ లేదు. కాని ముందు వాటిని మురికిపోయేలా ఉతికి జాడించాలి. అప్పుడవి త్వరగా ఆరిపోతాయి. ఇక్కడ సత్సంగంలో ఉతకడం, జాడించడం జరుగుతుంది. ఆరబెట్టడం అనేది అక్కడ జరుగుతుంది – ఇది బట్టలుతికేవారి పని! (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు:**

గురువుగారూ! మేము ఇక్కడున్నా లేక వేరొక చోటున్నా ఎటువంటి తేడా లేదని మీరంటారు. కానీ మీరు వేరే సందర్భాలలో మాట్లాడుతూ బట్టలు బయట ఎండలో ఆరేసినపుడు ఇంట్లో కన్నా త్వరగా ఆరిపోతాయని అన్నారు. కాబట్టి ఈ శుభ్రం చేసే విధానం లేదా మేము మీ దగ్గర ఉన్నప్పుడు జరిగేది – అదేదైనా సరే, మేము మీ పదసాన్నిధ్యంలో ఉన్నప్పుడు త్వరగా జరుగుతుంది కదా?

**గురువుగారు:**

నేను మాట్లాడేది ఇవ్వడం గురించి. మీరు నాకు దగ్గరగా ఉన్నప్పుడు సహాయం అనేది మీకు ఎక్కువ గాఢంగా అనుభవమవుతుంది. మీరు దూరంగా ఉన్నప్పుడు అది మీకు వేరే రకంగా కాస్త తక్కువ తీవ్రతతో అనుభవం కావచ్చు. అంతేగానీ మీరు ఇక్కడున్నప్పుడు నేను ఎక్కువ ఇస్తానని కాదు. మీరు దానిని ఎక్కువగానో తక్కువ గానో అనుభవం చెందితే చెందవచ్చు, నేను ప్రస్తుతం మాట్లాడేది మాత్రం ఇవ్వడం గురించే: నేనివ్వడం అనేది ఎక్కువ, తక్కువ

అనేది లేకుండా ఎక్కడైనా ఒకేలాగా ఉంటుంది. అలాగే సూర్యుడు ఎప్పుడూ ప్రకాశిస్తూనే ఉన్నాడు, బట్టలు ఆ వెచ్చదనాన్ని పొందుతూనే ఉన్నాయి.



సౌత్ ఇండియా, 1993



# ఆనందపారవశ్యం - వ్యక్తీకరణ

**గురువుగారు:**

అడవిలో సాధువు గురించిన ఒక కథంటే నాకు చాలా ఇష్టం. దాన్ని మీకు నేను చాలాసార్లు సత్సంగాలలో చెప్పాను కదా, మీకది గుర్తుందా?

విష్ణుమూర్తి సాక్షాత్కారం పొందాలని హృదయంలో ఎంతగానో తపన ఉన్న ఒక వృద్ధ సాధువు ఉండేవాడు. దాంతో అతను శాస్త్రాలలో చెప్పిన విధంగానే అడవిలోకి వెళ్ళి ఓ చెట్టు క్రింద కూర్చొని తపస్సు చెయ్యడం మొదలుపెడతాడు. ఇంద్రియాలను నిగ్రహించి, ఏకాగ్రచిత్తంతో, తదేకదృష్టితో, హఠయోగం, రాజయోగం, ఆత్మ విచారం ఇటువంటివన్నీ చేస్తుంటాడు. (గురువుగారు నవ్వుతూ...) చాలా పట్టుదలతో తాను చదివినవాటిని, విన్నవాటినన్నింటినీ చాలా శ్రద్ధగా సాధన చేస్తూవుంటాడు. ఒకరోజు నాదబ్రహ్మ నారదమహర్షి

ఆ త్రోవలో పోతూ ఈ సాధువును చూడటం జరుగుతుంది. ఎందుకనో నారదమహర్షికి అతన్ని చూడగానే అతని పట్ల ఇష్టం కలుగుతుంది. అందుకని ఇతని దగ్గరకు వచ్చి, “నాయనా, ఎవరు నువ్వు? ఎక్కడ నుండి వచ్చావు? ఏం చేస్తున్నావు?” అని అడుగుతాడు. నారదుల వంటి మహర్షుల దర్శనభాగ్యం కలిగినందుకు ఆ సాధువు చాలా సంతోషించి, తన వివరమంతా నారదమహర్షికి చెప్తాడు. నారదుడు సంతసించి, “మంచిది, నీకేదైనా కోరిక ఉందా?” అని అడుగుతాడు. దానికి సాధువు “ఓ నారదా, నాకేమీ అవసరం లేదు. కానీ నాది ఒకే ఒక చిన్న విన్నపం: మహర్షీ, మీరు ఈసారి విష్ణుధామమైన వైకుంఠానికి వెళ్ళినపుడు, ఆ స్వామిని నాకు వారు దర్శనాన్ని ఎప్పుడు అనుగ్రహిస్తారో కాస్త కనుక్కొని, ఆ తరువాత మీకు వీలైనపుడు నా వద్దకు వచ్చి ఆ సమాధానాన్ని నాకు తెలియజేయవలసింది” అని కోరతాడు. దానికి నారదుడు, “ఆహాఁ దానికేముంది, ఇది చాలా చిన్న విషయం, తప్పకుండా! దీని గురించి ఆందోళన చెందవద్దు, నేను చూసుకుంటాను” అని చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోతాడు.

కొన్ని సంవత్సరాలు గడిచిపోతాయి. నారదుడు ఈ విషయం పూర్తిగా మరచిపోతాడు. ఆ తర్వాత ఒకసారి నారదుడు వైకుంఠానికి పోవడం తటస్థిస్తుంది. విష్ణుమూర్తితో ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ ఉన్నప్పుడు ఉన్నట్టుండి నారదునికి ఈ వృద్ధ సాధువు, అతని ప్రశ్న గుర్తుకొస్తాయి. అప్పుడు నారదుడు విష్ణుమూర్తిని, “స్వామీ, నేను మిమ్మల్ని ఓ విషయం అడగడం మర్చిపోయాను. చాలారోజుల క్రితం నేను దీనుడైన ఒక సాధువును కలిశాను, అతను చాలా తీవ్రంగా తపస్సు చేస్తున్నాడు. అతను చాలా శ్రద్ధాసక్తులు ఉన్నవాడు, నాకు చాలా బాగా నచ్చాడు. అతనికి మీరెప్పుడు దర్శనం ఇస్తారో

తెలుసుకోవాలనే చిన్న ప్రశ్న ఉంది” అని విన్నవిస్తాడు. దానికి విష్ణుమూర్తి “అయ్యో నారదా, దానికి చాలాకాలం పడుతుంది. అతను కూర్చున్న చెట్టుకు ఎన్ని ఆకులున్నాయో అన్ని జన్మల తరువాత, అంటే కొన్ని వేల జన్మలు ఎత్తిన తరువాతగానీ అతనికి నేను దర్శనం ఇవ్వడం జరగదు” అంటాడు. అప్పుడు నారదుడు “అయ్యో, అతను చాలా మంచివాడే” అని విచారం వ్యక్తం చేస్తాడు. “ఏం చేస్తాం నారదా, అతని ప్రారబ్ధం అంత ఉంది. నేను చెయ్యగలిగింది ఏమీ లేదు” అంటాడు విష్ణుమూర్తి. “సరే స్వామీ, మీ చిత్తానుసారమే కానివ్వండి” అని చెప్పి నారదుడు బయలుదేరుతాడు.

ఆ తరువాత కొంతకాలానికి నారదుడు అడవిలో ఆ సాధువుకు సమీపంలో అంతకుముందు వెళ్ళిన దారిలోనే పోతుంటాడు. నారదుడు ఆ సాధువును చూస్తాడు. అతనికి ఆ దుర్వార్త చెప్పడం ఎందుకని అతన్ని చూసీచూడనట్లు అలా వెళ్ళిపోతుంటాడు. కానీ ఆ సాధువు నారదుణ్ణి చూసి పరుగెత్తుకుంటూ వచ్చి “ఇదేమిటి మహర్షీ, నాకు దూరంగా వెళ్ళిపోతున్నారు, నేను చేసిన తప్పేమిటి? క్రిందటిసారి నేను అడగకుండానే మీ దర్శనాన్ని ప్రసాదించారు, కానీ ఈరోజు మీరు అసలు నన్ను పట్టించుకోకుండా దూరంగా వెళ్ళిపోతున్నారెందుకు?” అని ప్రశ్నిస్తాడు. దానికి నారదుడు “లేదు, అటువంటిదేం లేదు, నీ పట్ల నాకు కోపమేదీ లేదు. కాస్త తీరుబడి లేదు, అంతే. ఏంటి ఎలా ఉన్నావు, అంతా బాగుందా?” అని అడుగుతాడు. “అంతా బాగానే ఉంది స్వామీ. మరి నా ప్రశ్న ఏమైంది స్వామీ” అని విషయానికి వస్తాడు ఆ సాధువు. అప్పుడు నారదుడు, “దాని గురించి ఆందోళనపడవద్దు. నువ్వు సరిగ్గానే చేసుకుంటున్నావు. అలాగే చేసుకుంటూ ముందుకెళ్ళు, విష్ణుమూర్తి

నిన్ను తప్పక అనుగ్రహిస్తాడు, ఆయన అనుగ్రహం ఎప్పుడూ నీతోనే ఉంది. నువ్వు బాగా చేసుకుంటున్నావు. ఇలాగే చేసుకో" అని అంటాడు. అయితే ఆ సాధువు, "మహర్షీ, మీరు నా ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిందే" అని పట్టుబడతాడు. విష్ణుమూర్తి చెప్పిన దానిని అతనికి చెప్పి నిరుత్సాహపరచడం ఇష్టంలేక నారదుడు మళ్ళీ "నువ్వు దాని గురించి ఆలోచించవద్దు, ఇలాగే చేసుకుంటూ ముందుకెళ్ళు" అని తప్పించుకోజూస్తాడు. కానీ ఆ సాధువు ఎంతకీ పట్టువదలకపోయేటప్పటికీ ఇక నారదునికి విషయం చెప్పక తప్పదు. నారదుడు అతనితో, "నేనేం చెప్పేది నాయనా, నువ్వు కూర్చున్న ఈ చెట్టుకు ఎన్ని ఆకులున్నాయో అన్ని జన్మలెత్తిన తరువాతగానీ నీకు సాక్షాత్కారం లభించదని విష్ణుమూర్తి చెప్పాడు" అని చెప్తాడు.

ఇలా ఈ విషయం అతనికి చెబుతున్నప్పుడు నారదుడు మనస్సులో, "భగవంతుడా, ఈ విషయం వినగానే ఇతని గుండె బ్రద్దలైపోతుంది" అనుకుంటాడు. కానీ అత్యంత ఆశ్చర్యంగొలిపేలా, ఆ సాధువు ఈ విషయం వినీవినగానే చెప్పరాని ఆనందంతో, పారవశ్యంతో, "ఆహాఁ, నాకెంతో ఆనందంగా ఉంది. విష్ణుమూర్తి నాకు సాక్షాత్కరిస్తానని హామీ ఇచ్చారు, నాకు స్వామి దర్శనాన్ని అనుగ్రహించబోతున్నారు" అని పెద్దగా అరుస్తూ, ఆనందంగా నృత్యం చేయడం మొదలుపెడతాడు.

అతను అలా నాట్యం చేస్తున్నప్పుడే, అదే క్షణంలో వైకుంఠం నుండి విష్ణుమూర్తి వచ్చి అతనికి దర్శనం ఇస్తాడు. ఈ పరిణామంతో నారదుడు మరింత ఆశ్చర్యపడటంతోబాటు చిన్నబుచ్చుకుంటాడు. (గురువుగారు నవ్వుతూ...) విష్ణుమూర్తి ఆ సాధువుకు దర్శనం ఇవ్వాలని నారదుడు మనస్ఫూర్తిగా కోరుకున్నాడు, కానీ కొన్ని వేల

జన్మల తరువాతగానీ అది సాధ్యంకాదన్న విషయం అతనికి చెప్పిన తరువాత అప్పటికప్పుడు విష్ణుమూర్తి అతనికి దర్శనం ఇవ్వడంతో నారదుడు తాను వెర్రివాడినైపోయానని అనుకున్నాడు. (గురువుగారు నవ్వుతూ...)

ఆ తరువాత నారదుడు, విష్ణుమూర్తి కలసి అక్కణ్ణుండి బయలుదేరి వెళుతున్నప్పుడు నారదుడు తట్టుకోలేక విష్ణుమూర్తితో, "స్వామీ, మీరు చేసిందేమిటి? ఆ సాధువు ముందు నన్ను వెర్రివాణ్ణి చేశారు. ముందు మీరే కొన్ని వేల జన్మల తరువాతగానీ అతనికి దర్శనం ఇవ్వనని చెప్పారు, నేనతనికి అదే చెప్పాను. ఉన్నట్లుండి మీరు అతనికి సాక్షాత్కరించారు, అతడు నా గురించి ఏమనుకుంటాడు" అని మొరపెట్టుకుంటాడు. (గురువుగారు నవ్వుతూ...) దానికి విష్ణుమూర్తి "నారదా నేనేం చేసేది, అతని ప్రారబ్ధానుసారం నేను అతనికి సాక్షాత్కరించడానికి అతను చాలా జన్మలు ఎత్తవలసి ఉంది, కానీ నువ్వు అతనికి అన్ని జన్మల తరువాతైనా నేను దర్శనం ఇస్తాను అని చెప్పిన మరుక్షణం, నా సాక్షాత్కారం లభిస్తుంది అన్న హామీ అతనికి ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఆ పారవశ్య స్థితిలో ఎన్నో జన్మల ప్రారబ్ధకర్మ దహించుకుపోయింది, అతను దర్శనానికి సంసిద్ధుడయ్యాడు – అందుకనే నేను తక్షణం సాక్షాత్కరించవలసి వచ్చింది. అది నా చేతులలో లేదు, నేనేం చేసేది? (గురువుగారు నవ్వుతూ...) నేను నిన్ను వెర్రివాడిని చేయాలనుకోలేదు, అదలా జరిగిపోయింది. నేను చేయగలిగింది ఏమీ లేదు" అని వివరిస్తాడు. చూడండి: దాసగణుమహరాజ్ – కాకాసాహెబ్ దీక్షిత్ పనిపిల్ల పెట్టెలోని చీర గురించిన కథలోనూ, ఈశావాస్యోపనిషత్తులో చెప్పిన విషయంలోనూ ఉన్న అసలు ఉద్దేశ్యం ఇదే. పెట్టెలో ఉన్న

చీరలాంటిదే, ఈ కథలో సాక్షాత్కారానికి సంబంధించిన హామీ. దీనిని రెండురకాలుగా తీసుకోవచ్చు: సాధారణంగా అందరూ, "ఓరి భగవంతుడా, నాకు విష్ణుమూర్తి అనుగ్రహం అసలు లేనే లేదు. వెయ్యి జన్మలు ఎత్తాలా? అదేమి ప్రేమ? అన్ని జన్మలు ఎత్తాలా? ఆ కర్మనంతా ఆయనే భస్మం చేయలేరా? ఆయనకు ఆ శక్తిలేదా?" అనుకుంటారు. (గురువుగారు నవ్వుతూ...) కానీ దీనికి బదులు ఆ సాధువు ఎంతో సానుకూల వైఖరితో ప్రతిస్పందించి, "ఆయన నాకు సాక్షాత్కారమిస్తాడు. ఆహాఁ, నాకు ఎంతో సంతోషంగా ఉంది" అని ఆనందాతిశయంతో కేకలు వేశాడు.

ఆ ఆనందపారవశ్యం, సానుకూల దృక్పథం (positive attitude) అనేవి సాక్షాత్కారానికి కీలకం. అందుకనే ఎవరైనా "అన్ని జన్మలు ఎందుకు పడుతుంది? ఈ ప్రక్రియ అంత సుదీర్ఘంగా ఎందుకు సాగుతుంది?" అని అడిగితే – దానికి సమాధానం ఉండదు. అది ఈ క్షణంలో జరగవచ్చు లేదా ఎప్పటికీ జరగకపోవచ్చు. "ఎంత కాలం?" అనేది అర్థంలేని ప్రశ్న. నీకెంత తపన ఉందో అంత కాలం. కాబట్టి 'ఎంత కాలం' అనేదానికి 'నీకెంత ఎక్కువ తపన ఉందో అంత త్వరగా' అనేదే సమాధానం. అదెంత కాలం అంటే నీ తపన ఎంత గాఢమైనదైతే అంత తక్కువ కాలం.

ఇది చాలా మంచి కథ. ఇది కొన్ని వందల, వేల విషయాలను తెలియజేస్తుంది. ఈ ఒక్క కథ నాకు ఎన్నో శాస్త్రాలతో సరిసమానం. అది కేవలం కల్పితమే కావచ్చు, కథే కావచ్చు కానీ అదేం పట్టించుకో నక్కరలేదు. నాకు ఎన్నో శాస్త్రాల సారాన్ని ఈ కథ తెలియజేస్తుంది.

**భక్తుడు:**

గురువుగారూ! మనం మన లక్ష్యాన్ని చేరుకున్న తరువాత ఆ తపన అంతరిస్తుందా?

**గురువుగారు:**

ఒకరకంగా చెప్పాలంటే అది నిజమే. కానీ నేను మీకు చెప్పినట్టు అది అంత మాత్రమే కాదు. అందుకనే మీరు చూస్తే రమణమహర్షి కూడా ఆ తపనను వ్యక్తం చేయడం కనిపిస్తుంది, గోపికలు సైతం అటువంటి పరితాపాన్ని చూపించడం చూడవచ్చు. మరి అది ఎటువంటి తపన? బాబా కూడా ఎడబాటును వ్యక్తం చేసే గీతాలను ఆలపిస్తూ, ఆ పరితాపాన్ని వ్యక్తం చేస్తూ నృత్యం చేసేవారు. కొన్ని కబీరు గీతాలు రాముని కోసం, రామదర్శనం కోసం కబీరు పడే వేదనను తెలియజేస్తాయి. అలాగని బాబాగానీ, కబీరుగానీ వారి లక్ష్యాన్ని చేరుకోలేదనగలమా? వారి తపన పరిపూర్ణంగా తీరింది. కానీ వాళ్ళు దానిని ఇంకా ఇలానే వ్యక్తం చేయాలనుకున్నారు. ఈ రకంగా వ్యక్తంచేయడం కూడా తపించడమే కానీ అది మరో రకమైన తపన.

**భక్తుడు:**

గురువుగారూ! మీరాబాయి, రవిదాసు మొదలైన మహాత్ములు కూడా తమ ఆరాధ్యదైవంతో తమ ఎడబాటును, వియోగాన్ని వ్యక్తం చేసే గీతాలు రచించారని మనకు తెలుసు. వారి అనుభవంలో ఏదైనా సారూప్యత ఉందా?

**గురువుగారు:**

అవును, సారూప్యం ఉంది. అది కేవలం వియోగం వలన కలిగిన

వేదన మాత్రమే కాదు. దానిలో ఇంకా వేరేదేదో ఉంది. అందులో ఆనందం ఉంది. అది ఆనందాన్నిచ్చే వియోగం. అది వియోగంగా వ్యక్తం చేయబడిన సంయోగానుభూతి.

**భక్తుడు:**

పరిపూర్ణమైన ఆనందానికి అంతమంటూ లేదా? లక్ష్యాన్ని చేరుకున్నాక కూడా ఇంకా ఇంకా ఆ ఆనందం కోసం తపన ఉంటుందా?

**గురువుగారు:**

అవును. దాన్ని ఇంకా ఇంకా పొందాలని తపన ఉంటుంది. ఈ మొత్తం మార్గం కూడా ఆనందమయం కావాలి. అదే నేను చెప్పేది. ఎవరైనా ఊరికే చిఅచిఅలాడుతూ, ధుమధుమలాడుతూ ఉంటే, వాళ్ళు సరైన మార్గంలో లేరని అర్థం.

**భక్తుడు:**

ఆ తపనలో కొన్నిసార్లు ఒక రకమైన వేదన ఉంటుంది కదా, గురువుగారూ?

**గురువుగారు:**

నేను దానిని వేదన అని అనను. కొన్నిసార్లు వారి పరితాపం మనకు యాతనలాగా కనిపించవచ్చు. కానీ నిజానికది యాతన కాదు. అందులో పారవశ్యమైన ఆనందం కూడా ఉంది. నేను ఈ విషయం గురించి, నిజమైన యాతనకు, ఇటువంటి పరితాపానికి గల తేడాను గురించి, ఇటువంటి తపన అద్భుతమైన కవిత్వానికి ఎలా దారితీస్తుందోనన్న విషయం గురించి ఇంతకు ముందు చాలాసార్లు వివరించాననుకుంటాను.

అరుణాచలేశ్వరునితో తమ ఏకత్వం యొక్క ఆనందానుభూతిని వర్ణించడానికి రమణులు అరుణాచలపదికాన్ని రచించారు. మీరు దానిని చదివితే అది ఆయన పరితాపాన్ని, ఎడబాటును తెలియ జేస్తుంది. కానీ నిజంగా ఆయన అరుణాచలేశ్వరుని (తమ ఆత్మ) నుండి వేరుగా ఉన్నారా?– లేదు. ఆ ఏకాత్మక స్థితిని వర్ణించడం వీలుకాదు కాబట్టి రమణులు తమ ఏకత్వానుభూతిని వర్ణించడానికి అరుణాచలేశ్వరునితో ఎడబాటును వ్యక్తపరచడమనే ఒక మార్గాన్ని ఎంచుకున్నారు. కాబట్టి ఆ సంయోగానుభూతి వియోగరూపంలో వ్యక్తం చేయబడింది. వేరువేరుగా ఉన్నప్పుడే ఏకత్వభావన కలుగుతుంది. ఇద్దరు విడివిడిగా ఉన్నప్పుడే మాటలుంటాయి. ఆయన ఆ ఎడబాటు వలన కలిగిన పరితాపాన్ని, వేదనను, కష్టాన్ని వ్యక్తం చేశారు, అప్పుడే మీరు ఏకత్వంలోని ఆనందాన్ని ఊహించగలరు. అది ఎలా ఉంటుందంటే, మూడురోజుల పాటు ఆకలితో అలమటించి ఆహారం తీసుకున్న తరువాత ఆకలి గురించి వివరించినట్లు ఉంటుంది. ఆ తరువాత ఆహారం తీసుకుంటున్నపుడు ముందు మీరు, 'అమ్మో, మూడు రోజులపాటు నేను భోజనమే చెయ్యలేదు' అంటారు. అక్కడ చూడండి, మీరు ఇప్పుడు తింటున్న భోజనం గురించి కాకుండా అంతకు ముందు మూడురోజులు ఏమీ తినలేదన్న విషయం గురించే ఆలోచిస్తున్నారు. మీరు భోజనాన్ని ఎంతగా ఆస్వాదిస్తున్నారో అనే విషయాన్ని ఆ భోజనం లేకపోతే మీరెంత వేదనను అనుభవించారో చెప్పడం ద్వారా తెలియజేస్తున్నారు. అదే, మీరిప్పుడు భోజనాన్ని ఎంతగా ఆస్వాదిస్తున్నారో అన్న విషయాన్ని తెలియజేస్తుంది.

కాబట్టి ఏకత్వానుభూతిని మాటలతో వర్ణించడం వీలుకాదు. అందుకనే మహాత్ములు, దానిని వర్ణించడం లేదా ఆ ఏకాత్మకతను

వివరించడానికి పూనుకోవడంలాంటి పొరపాటు చెయ్యలేదు. దానికి బదులు వాళ్ళు ఆ ఎడబాటును, తపనను వర్ణించారు.

శ్రీమద్భాగవతంలో శ్రీకృష్ణుని కోసం గోపికలు ఎంతగా పరితపించారో చూడండి. రమణమహర్షి విషయంలో కూడా, అరుణాచలేశ్వరుని గురించి ఆయన ఎంతగా తపించారో గమనించండి. కబీరు తమ సద్గురువు కోసం లేదా రాముని కోసం తమ తపన గురించి రచించిన గీతాలను బాబా కూడా ఆలపించేవారు. ఆ ఏకత్వాన్ని వర్ణించాలంటే ఇదొక్కటే మార్గం. ఎందుకంటే ఆ ఏకత్వాన్ని నేరుగా వర్ణించడం సాధ్యంకాదు.

కాబట్టి ఇటువంటి ఎడబాటులో ఆనందం ఉంది. దానిని కవితాత్మకంగా చూడండి. రమణమహర్షి ఆ ఏకత్వాన్ని ఎడబాటు రూపంలో వ్యక్తం చేశారు, కారణం ఆయన ఆ ఏకత్వాన్ని అనుభూతి చెందారు. మీరు అటువంటి ఏకత్వం కోసం పరితపిస్తుంటే, మీ లక్ష్యం గురించిన ఆలోచన సైతం మీకు ఆనందాన్నివ్వాలి. ఆ భావన సైతం మీకు ఆనందం కలిగించాలి. దానిని పూర్తిగా పొందలేక పోవడమనేది మన అసంతృప్తికి కారణం. కాబట్టి అక్కడ ఆనందం, విచారం రెండూ ఉన్నాయి. ఇది చాలా విశిష్టమైన విషయం. ప్రేమలోని పరస్పర వైరుధ్యం ఇదే.

**భక్తుడు:**

గురువుగారూ! మీరు మాతో ఉన్నప్పుడు ప్రతి విషయమూ మధురంగా ఉంటుంది. మీరు మాతో లేనపుడు ఆ మాధుర్యాన్ని నిలుపుకోవడం ఎలా?

**గురువుగారు:**

దాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నించండి. దాన్ని అంటిపెట్టుకోవడానికి, తిరిగి పొందడానికి ప్రయత్నించండి! మళ్ళీ ప్రయత్నించండి, పోరాడండి. అటువంటి సంఘర్షణ ఉండాలి – దానిలో నుండే నిజమైన అనుభవం వస్తుంది.

బాబాకు జరిగే కాకడ ఆరతి (పద్ XIII) లో *"మీ బుడతో భవ భయ డోహీ ఉద్ధరా"* (*"నేను ఈ సంసారసాగరంలో కొట్టుకు పోతున్నాను బాబా, నన్ను ఉద్ధరించండి"*) అంటారు. ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నప్పుడు మీరు "హాఁ హాఁ హాఁ" అంటూ ఊపిరి కోసం ఎలా అల్లాడిపోతారు? అటువంటి ప్రయత్నం ఉండాలి. అప్పుడు మిమ్మల్ని బాబా బయటపడేస్తారు. అప్పుడు మీకు శ్వాస ఎంత విలువైనదో తెలుస్తుంది. ఇప్పుడు మీరు ఊపిరి తీసుకుంటున్నారు, కానీ కేవలం ఒక్క శ్వాస ఎంత విలువైనదో ఇప్పుడు మీకు తెలియదు, ఇలా కొన్ని లక్షలసార్లు శ్వాస తీసుకొని ఉంటారు. కానీ అలా ప్రవాహంలో కొట్టుకుపోతున్నప్పుడు మీకు దాని విలువ తెలుస్తుంది: "హమ్మయ్య, భగవంతుడా" అంటారు. అలా మీరు ప్రతి శ్వాసలో ఆ శ్వాస యొక్క విలువను తెలుసుకునే దాకా దానిని మళ్ళీ మళ్ళీ మరచిపోతుంటారు, మళ్ళీ మళ్ళీ తెలుసుకుంటూ ఉంటారు. అప్పుడు ప్రతి శ్వాసా ఎంతో విలువైనదిగా తోస్తుంది. అది ఎంత ఆనందంగా, పరవశంగా, ఎంత సంతృప్తిగా ఉంటుంది. అప్పుడు మనం ఆనందాన్ని శ్వాసిస్తాం – ఆనందాన్ని ఉచ్ఛ్వాసిస్తాం, నిశ్వాసిస్తాం – మనం అలా పరివర్తన చెందుతాం.

**భక్తుడు:**

గురువుగారూ! మేము బాబా సన్నిధిని అనుభవంలోనికి తెచ్చుకోవాలని తపిస్తుంటాము. బాబా సన్నిధిని ఇంకా ఇంకా అనుభవంలోకి తెచ్చుకోవడం ఎలా?

**గురువుగారు:**

బాబా సాన్నిధ్యం మీకు నిజంగా అవసరమైతే ఆయనే ఇస్తారు, ఆయన తమ సాన్నిధ్యాన్ని ఇస్తూనే ఉన్నారు కూడా! ఒక్కసారి మీరు కాస్త గతంలోకి చూస్తే ఆయన సాన్నిధ్యాన్ని మనకు ప్రసాదించినప్పటికీ మనం ఎలా నిరాకరిస్తామో తెలుస్తుంది. మనం ఒకదాని గురించి అడుగుతాం తీరా అది ఇచ్చినప్పుడు మనం దానిని గుర్తించం, అందువలన మనం దానిని కోల్పోతాం. కానీ బాబా సన్నిధి ఎప్పుడూ ఉంది.

మీరు నిజంగా నిజాయితీగా, హృదయపూర్వకంగా, చిత్తశుద్ధితో బాబా సన్నిధిని కోరుకుంటే – ఆయనను పిలవండి! దానికి అదొక్కటే మార్గం. పిలవండి, పిలవండి, పిలవండి! అప్పుడు ఆ సన్నిధి మీకు లభిస్తుంది.

క్రిందటిసారి నేను దీనిని మీకు చెప్పినప్పటి నుండి, మీరు ఎన్ని గంటలపాటు అలా కూర్చుని బాబాను పిలిచారు? మీ స్థానంలో నేను గనుక ఉంటే కనీసం 8 నుండి 10 గంటలపాటు కూర్చొని అలా పిలుస్తూ, పిలుస్తూ, పిలుస్తూ ఉండేవాడిని. “బాబాను పిలవమని, పిలిస్తే బాబా ఇస్తారని గురువుగారు చెప్పారు, ఆయన ఆ హామీ ఇచ్చారు, కానివ్వండి చేసి చూద్దాం”... ఇలా ఆ తపనను పెరగనివ్వండి, కోరికను పెరగనివ్వండి, మన తపనకు, ఆనందానికి

మధ్యలో వచ్చే అడ్డంకులను తొలగిపోనివ్వండి. అప్పుడు మీరు దానిని పొందుతారు. నేను చెబుతున్నాను కదా: బాబా ఎవ్వరినీ వదలిపెట్టరు, “ఎవ్వరూ వట్టి చేతులతో తిరిగి వెళ్ళరు”.



శిరిడీ 2008



# ఎరుక మరపుల హేల

**భక్తుడు:**

నేను జ్ఞాపకశక్తి గురించి అడగాలనుకొంటున్నాను. నాకు జ్ఞాపకశక్తి బాగా తగ్గుతున్నదని అనిపిస్తున్నది. ఇది అప్పుడప్పుడు నాకు బాగా ఆందోళన కలిగిస్తోంది. జ్ఞాపకశక్తి ఇంతగా తగ్గడానికి వయస్సు మళ్ళడం కాకుండా మరే ఇతర కారణమేదైనా ఉందా? ముఖ్యమైన, అవసరమైన విషయాలను నేను గుర్తుపెట్టుకోవడమెలా? నేను పరధ్యానాన్ని తగ్గించుకుని పూర్తి ఎరుకతో ఉండడం ఎలా?

**గురువుగారు:**

దానిని సరిదిద్దుకోవడానికి ప్రయత్నించు. నువ్వు కొన్ని విషయాలను మర్చిపోతున్నావంటే నువ్వు నా దగ్గర ఉన్నావన్న సంగతి కూడా మర్చిపోవచ్చు! స్టవ్ మీద పాలు (కాగడానికి) పెట్టావన్న విషయం మరచిపోయావంటే అది వేరే విషయం – కానీ నువ్వు ఇక్కడ, నా

సమక్షంలో ఉన్నావన్న విషయాన్ని గుర్తుంచుకుంటున్నావా? దీనిని గనుక మనం మర్చిపోతే మిగతా విషయాలను కూడా మర్చిపోతాం. యావత్ ఆధ్యాత్మికసాధన, సాధనాపద్ధతులు... అవి ఏవైనా కానివ్వండి, అవన్నీ కూడా రకరకాల మార్గాలలో మన జ్ఞాపకశక్తిని మెరుగుపరచుకోవడానికి చేసే ప్రయత్నాలే. అవి స్మరణ కోసం చేసే అభ్యాసాలే. ఉదాహరణకు, నువ్వు నామాన్ని జపిస్తున్నావంటే, ఏం చేస్తున్నట్లు? నువ్వు నామాన్ని గుర్తుచేసుకుంటున్నావు. నామాన్ని జ్ఞాపకముంచుకోవడానికి, మనస్సు నామాన్ని మరచిపోకుండా ఉండేలా చేసుకునేందుకు నీవు ప్రయత్నిస్తున్నావు. ఆత్మవిచారణ విషయంగానైతే "నేనెవరు? నేనెవరు? నేనెవరు?" అనే అసలైన విచారణను మరచిపోకుండా ఉండేలా చూసుకుంటూ, ఒకవేళ మనం మరచిపోతే మళ్ళీ మనస్సును తిరిగి ఆ విచారణ మీద నిలుపుతాము. ఆధ్యాత్మిక సాధనలుగా పిలువబడేవన్నీ – అవి ఏవైనా కానివ్వండి, మనం ఎరుకను కలిగివుండటం కోసం ఉద్దేశించబడినవే.

భక్తుడు:

అలా అయితే ప్రయత్నం అవసరమే మరి?

**గురువుగారు:**

అవును. గుర్తుంచుకోవడమన్నది అప్రయత్నంగా జరుగకపోతే, ప్రయత్నం అవసరం. అప్రయత్నంగా గుర్తుంచుకోగలిగితే, అప్పుడు సమస్యే లేదు! ఇంకా నువ్వన్నట్లు కొంతవరకు, కొన్ని చిన్న చిన్న విషయాలలో వయస్సు మళ్ళడం మరపుకు కారణమవుతుంది. కానీ ఉన్న కారణాలలో అది కేవలం ఒకటి మాత్రమే. అది చిన్నాచితకా విషయాలకు మాత్రమే వర్తిస్తుందిగానీ చాలా ముఖ్యమైన విషయాలకు

కాదు. మనం మరచిపోవడమన్నది అసలు జరుగకూడదు. మరపు మంచిది కాదు. ఆధ్యాత్మిక జీవితాన్ని గడిపే చాలామంది తాము "ఆత్మధ్యానం"లో ఎంతగానో లీనమైపోయినందున ప్రాపంచిక విషయాలను మరచిపోయామనుకొంటారు. అది నేనంగీకరించను. అదంతా ఒట్టి బూటకం. (నవ్వులు...)

మనకు ఆసక్తి ఉంటే, మనకు ప్రేమ ఉంటే, ఎరుక ఉంటే – మనకు జ్ఞాపకశక్తి కూడా ఉంటుంది. నేను చెప్పినట్టు వృద్ధాప్యం కూడా కొంతమేరకు కారణమవుతుంది, కానీ అది కేవలం చాలా చిన్న విషయాలకు మాత్రమే వర్తిస్తుంది.

**భక్తుడు:**

కానీ, మనం మన ఆధ్యాత్మికసాధన మీద గానీ, మనకు ఇష్టమైన లక్ష్యం మీద గానీ దృష్టిని పెట్టినపుడు, దానివలన మనం మిగతా విషయాలను మరింతగా మరచిపోవడం జరుగదా?

**గురువుగారు:**

నిజానికి, నువ్వు దేనినీ మర్చిపోకూడదు. కానీ నీకు కొన్ని విషయాలు మాత్రమే గుర్తుంటున్నాయి – నీకు గుర్తుండే విషయాల పట్ల నీ అనుభవం సరైన రీతిలో ఉండి ఉంటుంది. మిగతా విషయాల పట్ల నీ అనుభవం సరైన పద్ధతిలో ఉండదు.

**భక్తుడు:**

అయితే మరి దానికి విరుగుడు ఏమిటి?

**గురువుగారు:**

నువ్వు ఆ ఎరుకను పెంచుకోవడమే. ఇప్పుడు నువ్వు నా దగ్గర ఉన్నావు. నువ్వు నావద్ద ఉన్నావన్న విషయాన్ని మనస్సులో ఎప్పుడూ

నిలుపుకోగలిగితే, అప్పుడు ఈ ఎరుక, ఈ సాధన – దానిని నువ్వు ఏమని పిలిచినా సరే – అది నిన్ను మిగతా విషయాలను గుర్తుంచుకునేలా చేస్తుంది. నువ్వు దీనినే గుర్తుంచుకోలేకపోతే, మిగతా విషయాలను ఎలా గుర్తుపెట్టుకోగలవు? మనం బుర్రను ఎప్పుడూ అన్ని విషయాలతో నింపుకోవడానికి ప్రయత్నించాలని కాదు! ఆ అవసరం లేనేలేదు. నువ్వు ప్రతి విషయాన్నీ గుర్తు పెట్టుకోవాలని నేను అనడంలేదు, కానీ మనకు ఆ ఎరుక ఉన్నప్పుడు ఏ విషయమైనా అవసరమైనపుడు గుర్తుకు వస్తుంది, జ్ఞాపకం ఉంటుంది. దేనినీ మనం ప్రయత్నపూర్వకంగా గుర్తుంచుకోవాల్సిన అవసరం లేదు. మనలోని ఎరుక, మన స్వభావం నిశ్చలంగా ఉంటే, మన ఎరుకలో ఏదైనా విషయం జరిగినపుడు మనం దానిని తక్షణమే అక్కడితో వదలివేయగలుగుతాము. అవసరమైనపుడు అది మళ్ళీ గుర్తుకు వస్తుంది, మనం దానిని జ్ఞాపకం చేసుకోగలం. మన మరపుకు కారణమేమిటంటే, ఏదైనా విషయానుభవాన్ని పొందుతున్నప్పుడు మన ఎరుక సరైన స్థితిలో ఉండదు. మనం సరైన పద్ధతిలో విషయాలపట్ల గమనింపుతో ఉంటే, అవి మనకు జ్ఞప్తికి రావాల్సినపుడు జ్ఞాపకం వస్తాయి.

**భక్తుడు:**

దానికి సరైన పద్ధతి ఏమిటి?

**గురువుగారు:**

మనం ఇక్కడ ఎందుకున్నాం అనే విషయాన్ని గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నించండి. మనం ఏం పొందుతున్నాం? మనం ఇక్కడకు ఎందుకు వచ్చాం అని చెబుతున్నామో దానికి తగినట్టుగా మన

ఆచరణ ఉందా? ఆ అనుభవాన్ని ఇంకా గొప్పగా అనుభూతి చెందడానికి, ఇంకా గొప్పగా వ్యక్తం చేయడానికి మనం ఎటువంటి మార్గాలలో ప్రయత్నించాలి? (ఈ విషయాలను గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నించండి.)

మనం ఇక్కడకు గురువుగారి కోసం వచ్చామని చెబుతున్నాం, మనం ఆయన చెంతనే ఉంటున్నాం, మరి రోజంతా ఏం చేస్తున్నాం? రోజును ఎలా గడుపుతున్నాం? ఏదో జాకెట్‌నో, స్కర్ట్‌నో కొనాలని మనం షాపింగ్‌కు (బజారుకు) వెళతాం, మొత్తం మార్కెట్‌నంతా గాలిస్తాం, అక్కడి కాలుష్యం వంటి వాటివల్ల బాగా అలసిపోతాం. రోజంతా ఇలా తీరుబడి లేకపోవడం వలన కొంతమంది 8 గంటల ఆరతికి, కనీసం ఊదీ తీసుకోవడానికి కూడా రారు. రోజంతా వాళ్ళు “తీరుబాటు” లేకుండా ఉన్నారు కదా మరి. మీరు ఇక్కడకు వచ్చినపుడు ఏం చేస్తున్నారు? నా దగ్గర ఉండటమంటే కేవలం నా ఎదురుగా కూర్చోవడమేనా?

ఇంతకుముందు సాక్షాత్కారం గురించి ఆదిశంకరులు చెప్పిన విషయాన్ని, హృదయనేత్రంతో చూడడాన్ని గురించి అడిగారు. మీకు నిజంగా అటువంటి సాక్షాత్కారం పట్ల ఆసక్తి ఉంటే, మీరు ఇక్కడ కూర్చున్నప్పుడు, నేను మేడమీదనో లేక ఇక్కడే దగ్గరలో ఉన్నాననే ఎరుక మీకున్నప్పుడు – మీదైన పద్ధతిలో మీరు ఆ సన్నిధిని అనుభూతి చెందడానికి ప్రయత్నించండి. మనం అది చెయ్యం. దానికి బదులు పిచ్చాపాటీ మాట్లాడుకుంటాం. అలా మౌనంగా కూర్చుని, సన్నిధిని అనుభూతి చెందడానికి ప్రయత్నించే వారిని నేను చాలా అరుదుగా చూస్తుంటాను, చాలా చాలా కొద్దిమందిని మాత్రమే చూస్తుంటాను.

నాతో మీకు గల అనుబంధాన్ని కేవలం ఈ అరగంటకో, అయిదు నిమిషాలకో, లేదా ఓ గంటకో పరిమితం చెయ్యకండి. దాన్ని మరింత విస్తృతం చేసుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడు, మీరు ఇక్కడ ఎందుకున్నారు, ఏం చెయ్యాలి అన్న విషయం అవగతమవుతుంది. ఏ విషయాన్నైనా మీరు సంపూర్ణంగా అనుభవించగలిగేటట్లు, అది జరిగిపోయిన తక్షణమే దానికి సంబంధించిన ఎటువంటి చిహ్నాలూ మనసులో లేకుండా ఉండేటటువంటి మనఃస్థితిని పొందేందుకు ప్రయత్నించండి.

**గురువుగారు:**

ఇక్కడ ఉండటాన్ని ప్రతి నిమిషమూ అనుభూతి చెందడానికి ప్రయత్నించండి. అలా కూర్చుని దానిని అనుభూతి చెందడానికి ప్రయత్నించండి. పాలనుగానీ, నీళ్ళనుగానీ కాగబెట్టడానికి మీరేం చేస్తారు? వాటిని స్టవ్ మీదనో, మంట మీదనో పెడతారు. ఆ మంట యొక్క వేడి వాటికి తగులుతుంది. ఆ మంట మీకు తగలాలని మీరు నిజంగా అనుకుంటే, స్టవ్ మీద ఉండటానికి ప్రయత్నించండి! పాలను ఫ్రిజ్‌లో పెట్టి స్టవ్ వెలిగిస్తే అవి ఎలా కాగుతాయి? (నవ్వులు...)

మన దృష్టి ఆ సన్నిధి మీద, ఆ ఎరుక మీద ఉన్నంతకాలం, మనకు జ్ఞప్తి ఉంటుంది. మీరు స్టవ్ మీద పాలు పెట్టారన్న సంగతి మర్చిపోయినా, మర్చిపోకపోయినా ఏం ముంచుకుపోదు. కానీ ఇక్కడ దీనిని (సన్నిధిని) మాత్రం మరచిపోవద్దు. దీనిని గుర్తుంచుకోండి. మీకిది గుర్తున్నంతవరకు ఇబ్బంది లేదు. దీనిని ఎప్పుడూ మనస్సులో ఉంచుకోవాలి. మీరు దానిని గుర్తుపెట్టుకుంటే, మీకు మిగతావన్నీ

గుర్తుంటాయి. ఇది మర్చిపోతే, మీరు వాటినీ మర్చిపోతారు. ఒక శాస్త్రంలో "మరపే మరణం" అని ఓ మహర్షి అన్నారు. మరణం అంటే ఏమిటి? అంటే, దానికాయన "మరపే మరణం" అన్నారు. మనం జీవిద్దాం, అలాంటి మరణం నుండి తప్పించుకుందాం. మనమెక్కడున్నాం, మనం ఏం చేస్తున్నాం, మనం ఏం సాధించాలనుకొంటున్నాం, మనం ఏం పొందుతున్నాం, మనం ఏం పొందడం లేదు, మనం పొందలేని దాన్ని పొందడానికి మనమేం చెయ్యాలి?... ఈ విషయాల పట్ల పరిపూర్ణమైన ఎరుకతో ఉందాం. మనం చేసే పనులన్నీ, మన మార్గాలన్నీ, మన చేతలన్నీ, మన మాటలన్నీ దాని వైపుకు మరల్చి దానినే గమ్యంగా చేసుకుందాం. అలా అయితేనే మీరు ఇక్కడ ఉండటానికి ఏ మాత్రమైనా సార్థకత, ప్రయోజనం ఉంటుంది.

**గురువుగారు:**

నేను మీకో విషయం చెబుతాను. నేనిప్పుడు మీతో మాట్లాడుతున్నాను, నా మాటల్ని మీరు వింటున్నారు. నేను మాట్లాడటం ఆపగానే మీరు సముద్రపు ఘోషను వింటారు[1]. మీరు, "ఓః, ఈ రోజు సముద్రం చాలా అల్లకల్లోలంగా ఉంది" అంటారు, లేకపోతే గాలి సవ్వడినో, కుక్క మొరగడాన్నో, ఇంకా ఎవరో దగ్గడాన్నో వింటారు. కానీ నేను మాట్లాడుతున్నప్పుడు మీరు ఆ విషయాలను గమనించరు. మీరు చేసే పనులన్నీ మీరు వింటున్న నా మాటల మాదిరిగా ఉండాలి.

[1] చెన్నైలో సాగరతీరాన శ్రీబాబూజీ నివసిస్తున్నప్పుడు జరిగిన సత్సంగమిది.

మీరు ఏదో ఒక పని చేస్తున్నంతవరకు, అది స్టవ్ మీద పాలు పెట్టడం కావచ్చు, మరేదైనా కావచ్చు, అది మీరు నా మాటలు వినడం మాదిరిగా ఉండాలి. మీ ఎరుక ఎప్పుడూ అలా ఉండాలి. మీరు ఏమీ చెయ్యకుండా ఊరకే ఉన్న తక్షణం మనస్సు నిరంతరం ఉన్న సముద్రపు ఘోషను వింటూ, దాని మీద నిలవాలి. ఆ శబ్దం ఎప్పుడూ ఉంది. నిజానికి నేను మీతో మాట్లాడుతున్నప్పుడు కూడా మీకది వినిపిస్తూనే ఉంది. మీకది వినిపిస్తూనే ఉంది కానీ మీరు దానిని ఆలకించడం లేదు. మీకు అది వినిపిస్తూనే ఉన్నా, నేను మాట్లాడటాన్ని మీరు ఆలకిస్తున్నారు. నా మాటలు వినడం ఆపగానే, మీరు సముద్ర ఘోషను – హృదయంలోని మౌనాన్ని, ఆ ఆనందాన్ని, ఆ ప్రేమను – వింటారు, ఆలకిస్తారు. ప్రేమ యొక్క పులకరింత సముద్రపు ఘోష లాంటిది. మీకది ప్రతిక్షణం వినిపిస్తూనే ఉంది, మీరు చేసే పనులన్నీ దాని మీదనే ఆధారపడి ఉన్నాయి. మీరేదైనా పనిలో నిమగ్నమైతే – ఇప్పుడు నా మాటలు వింటున్న మాదిరిగా – మీరు ఆ పనినే చెయ్యాలి. ఆ పనిని ఆపిన తక్షణం, మీరు సముద్రఘోషను వినగలగాలి.

ప్రతి క్షణాన్నీ పూర్తిగా అనుభూతి చెందడానికి ప్రయత్నించండి. నెమరువేస్తూ ఉండవద్దు – హడావుడిగా గడ్డి తినేసిన ఆవులలాగా, గేదెలలాగా మనం విషయాలను నెమరువేసుకుంటూ ఉండవద్దు. ఆవులు, గేదెలు ఏం చేస్తాయి? తరువాత గడ్డి దొరకదని భయపడి వేరే పశువులు వచ్చి తినడానికి ముందే ఆబగా తినేసి, తరువాత నెమ్మదిగా దానిని వెనక్కి తెచ్చుకుని నెమరువేసి జీర్ణం చేసుకోవడానికి ప్రయత్నిస్తాయి. మనకున్న ఆలోచనలు, ఆందోళనలు, భయాలు, చీకాకుల వల్ల మనమూ అలానే చేస్తుంటాం. ప్రపంచంలో విషయాల

పట్ల మన అనుభవం గేదె గడ్డి తిన్నట్టుగా ఉంటుంది. ఆ పైన మనం ఒంటరిగా ఉన్నప్పుడు, మనం గమ్మున కూర్చున్నప్పుడు, వాటిని వెనుకకు తీసుకుని వచ్చి నెమరువేసుకుంటూ జీర్ణం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం. గేదెల్లాగానో, ఆవుల్లాగానో బ్రతకవద్దు. ఆహారాన్ని సంపూర్ణంగా నమిలి తినే మనిషిలా జీవించండి, ప్రతి క్షణాన్ని ఆ క్షణంలో పరిపూర్ణంగా అనుభూతి చెందడానికి ప్రయత్నించండి.

భక్తుడు:

ఈ నెమరువేసుకునే అలవాటును పోగొట్టుకోవడానికి దగ్గర దారి ఏదీ ఉన్నట్లు కనిపించడంలేదు.

**గురువుగారు:**

దానిని దూరమైన దారినే తీసుకోనివ్వండి, ఏం సమస్య లేదు. (నవ్వులు...)

భక్తుడు:

అలా అయితే అది చాలా సుదీర్ఘమైన ప్రక్రియ, అది సంవత్సరాల తరబడి కొనసాగవచ్చు.

**గురువుగారు:**

నిజానికది అంత సుదీర్ఘమైన విషయం కాదు. ఎందుకంటే మీకు సన్నిధి ఉంది, మీ చెంత సముద్రం ఉంది. ఒకవేళ మీరు మర్చిపోయినా మీరు చేయాల్సిన ప్రయత్నమంతా దానిని గుర్తుచేసుకోవడమే. ఎందుకంటే సన్నిధి, సముద్రం ఎప్పుడూ ఉన్నాయి. ఆ సముద్ర ఘోషను, ఆ భావాన్ని మీరు కల్పించుకోవాల్సిన అవసరంలేదు – అది ఉంది. దాని మీద దృష్టి ఉంచడమనే ఆ ఒక్క విషయాన్ని మీరు చెయ్యడం లేదు. కనీసం మీరు ఇక్కడ సముద్రం వద్ద, సముద్రపు

ఒడ్డున ఉన్నప్పుడైనా, దానిని వినడానికి ప్రయత్నించండి. మీరు ఏం చేసినా, ఏం మాట్లాడినా ఆ మరుక్షణం వాటి జాడలు మీ మనస్సు మీద ఉండకూడదు. మీరు ఆ ఎరుకతో ఉన్నట్లయితే ఆ తరువాత ఏ పనైనా చెయ్యాల్సిన అవసరం వచ్చినప్పుడు మీరు దానిని నిర్దిష్టంగా చేస్తారు – ఈ ఘోష మీ జ్ఞాపకశక్తిని ప్రభావితం చెయ్యదు. మీరు పనిచేసినపుడు పనిచేస్తారు. మీరు అలా నిశ్చలంగా ఉన్నప్పుడు నిశ్చలంగా ఉంటారు. మీరు నిశ్చలంగా ఎప్పుడుంటారు? మీరు దీనిని (సన్నిధిని) అనుభూతి చెందితే, సన్నిధి అనే ఈ మంట అంటుకుంటే ఆ నిశ్చలత్వం వస్తుంది. ఆ మంట అంటుకోవాలంటే ఆ మంటకు దగ్గరగా ఉండాలి. మంట చుట్టుప్రక్కలే ఉండాలి. మీ మార్గంలో దానిని ప్రయత్నించండి. మీ పద్ధతులను, విధానాలను మీరే వెతుక్కోండి. నా దగ్గర ఒక ప్రత్యేకమైన పద్ధతి అంటూ ఏమీ లేదు. ఎందుకంటే, బయట వేల, లక్షల పద్ధతులున్నాయి. వాటన్నింటికీ ఎరుకతో ఉండటమనేదే లక్ష్యం. అప్పుడు మిమ్మల్ని ఏదీ కదిలించలేదు, ఏదీ మీ హృదయంలో దుఃఖాన్ని కలిగించలేదు. ఆ దుఃఖం మనల్ని బాధించడానికి, మన ముందుకు రావడానికే భయపడుతుంది. అది విఫలమవ్వాల్సిందే. అప్పుడు మన జీవితానికి ఒక అర్థముంటుంది.

# అనుబంధం

"శరశ్చంద్రికలు"లోని 12 అధ్యాయాలలో ఉన్న 'శ్రీబాబూజీ సత్సంగాలలోని భాగాలు' డేటాబేస్ లోని ఏఏ సత్సంగాల నుండి గ్రహింపబడినవో ఆ క్రమసంఖ్య, సత్సంగం జరిగిన తేదీ, ప్రదేశం ఈ క్రింది సూచికలో పేర్కొనబడినవి.

స- :: రికార్డ్ చేయబడిన ఆంగ్ల సత్సంగం, ప్రక్కనే క్రమసంఖ్య

**అధ్యాయం 1 :: ఆరతి**

| | | | |
|---|---|---|---|
| 1. | పూజ్యశ్రీ బాబూజీ విరచిత **ఆరతి సాయిబాబా,** | | 1996 |
| 2. | స-111 | 08 సెప్టెంబర్ 2005 | తిరువణ్ణామలై |
| 3. | స-123 | 17 ఆగష్టు 2007 | తిరువణ్ణామలై |
| 4. | స-82 | 30 సెప్టెంబర్ 2003 | చెన్నై |
| 5. | స-82 | 30 సెప్టెంబర్ 2003 | చెన్నై |
| 6. | స-130 | 28 నవంబర్ 2007 | హృషీకేశ్ |
| 7. | స-130 | 28 నవంబర్ 2007 | హృషీకేశ్ |
| 8. | స-99 | 16 నవంబర్ 2004 | తిరువణ్ణామలై |

**అధ్యాయం 2 :: రసానుభూతి**

| | | | |
|---|---|---|---|
| 1. | స-131 | 23 ఫిబ్రవరి 2008 | తిరువణ్ణామలై |
| 2. | స-113 | 26 అక్టోబర్ 2005 | తిరువణ్ణామలై |
| 3. | స-107 | 23 మే 2005 | తిరువణ్ణామలై |
| 4. | స-125 | 18 నవంబర్ 2007 | పిప్పల్‌కోట్ |
| 5. | స-134 | 14 డిసెంబర్ 2009 | హృషీకేశ్ |
| 6. | స-133 | 23 నవంబర్ 2009 | హృషీకేశ్ |

## అధ్యాయం 3 :: నీ లక్ష్యాన్ని నీవే తెలుసుకో

| | | | |
|---|---|---|---|
| 1. | స-56 | 29 జనవరి 2002 | చెన్నై |
| 2. | స-102 | 25 డిసెంబర్ 2004 | చెన్నై |
| | స-03 | 12 మార్చి 1997 | శిరిడీ |
| 3. | స-103 | 09 జనవరి 2005 | తిరువణ్ణామలై |

## అధ్యాయం 4 :: సద్గురు ప్రేమకక్ష్యలో

| | | | |
|---|---|---|---|
| 1. | స-104 | 10 మార్చి 2005 | తిరువణ్ణామలై |
| 2. | స-128 | 26 నవంబర్ 2007 | హృషీకేశ్ |
| 3. | స-99 | 16 నవంబర్ 2004 | తిరువణ్ణామలై |
| 4. | స-132 | 18 నవంబర్ 2009 | హృషీకేశ్ |
| 5. | స-17 | 22 డిసెంబర్ 1997 | శిరిడీ |
| 6. | స-104 | 10 మార్చి 2005 | తిరువణ్ణామలై |
| 7. | స-103 | 09 జనవరి 2005 | తిరువణ్ణామలై |

## అధ్యాయం 5 :: నియమం

| | | | |
|---|---|---|---|
| 1. | స-109 | 15 జూలై 2005 | తిరువణ్ణామలై |
| 2. | స-68 | 01 ఫిబ్రవరి 2003 | చెన్నై |
| 3. | స-68 | 01 ఫిబ్రవరి 2003 | చెన్నై |
| 4. | స-109 | 15 జూలై 2005 | చెన్నై |
| 5. | స-109 | 15 జూలై 2005 | చెన్నై |
| 6. | స-109 | 15 జూలై 2005 | చెన్నై |
| 7. | స-109 | 15 జూలై 2005 | చెన్నై |
| 8. | స-109 | 15 జూలై 2005 | చెన్నై |

## అధ్యాయం 6 :: కోపాన్ని జయించడం ఎలా?

| | | | |
|---|---|---|---|
| 1. | స-19 | 27 డిసెంబర్ 1997 | శిరిడీ |
| 2. | స-19 | 27 డిసెంబర్ 1997 | శిరిడీ |
| 3. | స-19 | 27 డిసెంబర్ 1997 | శిరిడీ |

| | | | |
|---|---|---|---|
| 4. | స-02 | 09 మార్చి 1997 | శిరిడీ |
| 5. | స-19 | 27 డిసెంబర్ 1997 | శిరిడీ |
| 6. | స-02 | 09 మార్చి 1997 | శిరిడీ |
| 7. | స-47 | 01 ఆగష్టు 1998 | శిరిడీ |

**అధ్యాయం 7 :: ప్రేమ తత్త్వం**

| | | | |
|---|---|---|---|
| 1. | స-118 | 14 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 2. | స-67 | 18 జనవరి 2003 | చెన్నై |
| 3. | స-111 | 08 సెప్టెంబర్ 2005 | తిరువణ్ణామలై |
| 4. | స-102 | 25 డిసెంబర్ 2004 | చెన్నై |
| 5. | స-91 | 12 మార్చి 2004 | తిరువణ్ణామలై |
| 6. | స-95 | 23 జూలై 2004 | తిరువణ్ణామలై |
| 7. | స-118 | 14 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 8. | స-104 | 10 మార్చి 2005 | తిరువణ్ణామలై |
| 9. | స-119 | 24 నవంబర్ 2006 | ఉత్తరకాశీ |
| 10. | స-97 | 16 అక్టోబర్ 2004 | చెన్నై |

**అధ్యాయం 8 :: లక్ష్యసిద్ధిని లభింపజేసే ముచ్చటైన మూడు సూత్రాలు**

| | | | |
|---|---|---|---|
| 1. | స-131 | 23 ఫిబ్రవరి 2008 | తిరువణ్ణామలై |
| 2. | స-131 | 23 ఫిబ్రవరి 2008 | తిరువణ్ణామలై |
| 3. | స-68 | 01 ఫిబ్రవరి 2003 | చెన్నై |
| 4. | స-79 | 18 ఆగష్టు 2003 | చెన్నై |
| 5. | స-124 | 17 నవంబర్ 2007 | పిప్పల్‌కోట్ |
| 6. | స-108 | 19 జూన్ 2005 | తిరువణ్ణామలై |

**అధ్యాయం 9 :: పూర్ణ అవధూతకు నిదర్శనం శ్రీపూండీస్వామి**

1. శ్రీబాబూజీ విరచిత "పూర్ణ అవధూతకు నిదర్శనం శ్రీపూండీస్వామి" నుండి... (సాయిపథం మాసపత్రిక - జనవరి/ఫిబ్రవరి 1988)

| | | | |
|---|---|---|---|
| 2. | స-103 | 09 జనవరి 2005 | తిరువణ్ణామలై |
| 3. | స-12 | 09 ఏప్రిల్ 1997 | తిరువణ్ణామలై |
| 4. | స-123 | 17 ఆగష్టు 2007 | హృషీకేశ్ |
| 5. | స-35 | 15 మార్చి 1998 | తిరువణ్ణామలై |
| 6. | స-35 | 15 మార్చి 1998 | తిరువణ్ణామలై |
| 7. | స-68 | 01 ఫిబ్రవరి 2003 | చెన్నై |
| 8. | స-37 | 21 ఏప్రిల్ 1998 | తిరువణ్ణామలై |

## అధ్యాయం 10 :: పవిత్ర క్షేత్రాలు

| | | | |
|---|---|---|---|
| 1. | స-118 | 14 నవంబర్ 2006 | హృషీకేశ్ |
| 2. | స-70 | 03 మార్చి 2003 | తిరువణ్ణామలై |
| 3. | స-107 | 23 మే 2005 | తిరువణ్ణామలై |
| 4. | స-108 | 19 జూన్ 2005 | తిరువణ్ణామలై |
| 5. | స-69 | 04 ఫిబ్రవరి 2003 | తిరువణ్ణామలై |
| 6. | స-68 | 01 ఫిబ్రవరి 2003 | చెన్నై |
| 7. | స-68 | 01 ఫిబ్రవరి 2003 | చెన్నై |
| 8. | స-70 | 03 మార్చి 2003 | తిరువణ్ణామలై |
| 9. | స-03 | 12 మార్చి 1997 | శిరిడీ |
| 10. | స-80 | 25 ఆగష్టు 2003 | చెన్నై |

## అధ్యాయం 11 :: ఆనందపారవశ్యం - వ్యక్తీకరణ

| | | | |
|---|---|---|---|
| 1. | స-114 | 07 డిసెంబర్ 2005 | తిరువణ్ణామలై |
| 2. | స-130 | 28 నవంబర్ 2007 | హృషీకేశ్ |
| | స-123 | 17 ఆగష్టు 2007 | తిరువణ్ణామలై |
| | స-134 | 14 డిసెంబర్ 2009 | హృషీకేశ్ |
| 3. | స-121 | 27 నవంబర్ 2006 | ఉత్తరకాశీ |
| 4. | స-121 | 27 నవంబర్ 2006 | ఉత్తరకాశీ |

## అధ్యాయం 12 :: ఎరుక మరపుల హేల

| | | | |
|---|---|---|---|
| 1. | స–67 | 18 మార్చి 2003 | చెన్నై |
| 2. | స–67 | 18 మార్చి 2003 | చెన్నై |
| 3. | స–67 | 18 మార్చి 2003 | చెన్నై |